www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వరంగల్

ANDHRAJYOTHI

కొరడాతో కొట్టుకొని నిరసన



తమిళనాడులో శాంతిభద్రతల పరిస్థితిపై బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న చర్య

ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచార ఘటనను నిరసిస్తూ కొరడాతో బాదుకున్న నేత

రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పాదరక్షలు ధరించబోనని శపథం

2

కొరడాతో కొట్టుకుంటున్న అన్నామలై

శనివారం | 28-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 270

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి తె. 3.38 తదుపరి చతుర్దశి; నక్షత్రం: అనూరాధ రా. 10.13 తదుపరి జ్యేష్ఠ వర్జ్యం: తె.4.05-5.45; దుర్ముహూర్తం: ఉ.6.47-8.15; అమృతఘడియలు: ఉ.11.03-12.46; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 5.45

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆర్థిక సంస్కర్తకు

అశ్రు నివాళి





మన్మోహన్‌సింగ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ, సీఎం రేవంత్, సుఖ్విందర్, దామోదర, దీపాదాస్

మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ తదితరుల నివాళి

ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో నేడు ఉదయం 11:45కు అంత్యక్రియలు

స్మృతి స్థలంలో స్మారక నిర్మాణం

దేశం గొప్ప రాజనీతిజ్ఞుణ్ని కోల్పోయింది

విచారం వ్యక్తం చేసిన కేంద్ర క్యాబినెట్

భారత రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహోన్నత వ్యక్తి.. సీడబ్ల్యూసీ నివాళి

నేడు 'కేంద్ర' సంస్థలకు ఓపూట సెలవు

న్యూఢిల్లీ, డిసెంబరు 27: దివాలా అంచున ఉన్న దేశానికి కొత్త దిశ చూపి దశ మార్చిన ఆర్థిక మాంత్రికుడు, నిష్కళంక పాలకుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విశ్వవ్యాప్త అశ్రునివాళుల మధ్య శనివారం శాశ్వత స్మృతిపథానికి చేరుకోనున్నారు. ఆయన అంత్యక్రియలను శనివారం ఉదయం 11:45 గంటలకు ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో నిర్వహించనున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరిపించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ

మిగతా 2వ పేజీలో...

మన్మోహన్ జీవితం స్ఫూర్తిదాయకం

వీడియో సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ

దేశం ఎప్పటికీ మన్మోహన్ సేవలను గుర్తుంచుకుంటుంది: సీఎం రేవంత్‌రెడ్డి

12



చెక్ యువర్ మొబైల్ డేటా అని చూపిస్తున్న యాప్

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో

సమస్యల ముళ్లు!

సర్వర్ డౌన్‌తో పాటు ఎన్నో సాంకేతిక సమస్యలు

పొద్దున 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 దాకా పనే చేయదు

ముందుకుసాగని దరఖాస్తుల పరిశీలన

31 నాటికి పూర్తవడం కష్టమే

జనవరి 10 దాకా కొనసాగే అవకాశం

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వర్ డౌన్ అవడంతో పాటు మెయింటెనెన్స్ ప్రాబ్లమ్, నో ఇంటర్‌నెట్ కనెక్షన్, చెక్ యువర్ మొబైల్ డేటా అనే ఎర్రర్లతో యాప్ నిలిచిపోతోంది. ఫలితంగా గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో దరఖాస్తుల పరిశీలన ముందుకుసాగడంలేదు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యాప్ పనిచేయడం లేదు. ఫలితంగా సర్వే మరింత ఆలస్యమవుతోందని

మిగతా 13వ పేజీలో...

లక్ష్యం రూ.18 వేల కోట్లు..

వచ్చింది సగమే

మిగిలింది నాలుగు నెలలే.. ఆలోపు రూ.9 వేల కోట్ల రాబడి కష్టమే

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారుల ఆందోళన

నిరుటితో పోలిస్తే రాబడి లక్ష్యం 22% పెంచిన ఆర్థిక శాఖ

15 శాతానికి మించి కష్టమంటున్న అధికారులు

పురపాలక, పంచాయతీరాజ్ సహకరిస్తే కాస్త మెరుగు.. త్వరలో భేటీ



హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాను కళకళలాడించే కీలక శాఖల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగం ఒకటి. అలాంటి శాఖ ఈ ఏడాది ఆదాయంలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరలేకపోతోంది. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.14,588.06 కోట్ల ఆదాయం రాగా.. దీనికి 22 శాతం పెంచుతూ 2024-25కి రూ.18,229 కోట్ల లక్ష్యాన్ని ఆర్థిక శాఖ నిర్దేశించింది. 15 శాతం వరకు అయితే ఏదోవిధంగా రాబడి పెంచుకోవచ్చని.. 22 శాతం అంటే చతికిలపడే పరిస్థితి వచ్చిందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబరు వరకు

మిగతా 13వ పేజీలో...

ఆదాయంలో కోత!

నిరుటితో పోలిస్తే 6% తగ్గుదల

రాష్ట్ర రాబడులు 51 శాతమే!

నవంబరు నాటికి రూ.1,41,178 కోట్లు

మొత్తం రాబడి లక్ష్యం రూ.2,74,057 కోట్లు

ఖర్చు రూ.1,38,556 కోట్లు

అంచనా వ్యయంలో ఇది 54%

రాష్ట్ర సర్కారు ఆదాయ, వ్యయాలపై 'కాగ్' నివేదిక

13

సరిహద్దుల్లో కిక్కు తగ్గింది!

ఏపీతో సరిహద్దు ఉన్న జిల్లాల్లో తగ్గిన మద్యం ఆదాయం

6 జిల్లాల్లో విక్రయాలపై ప్రభావం

డిసెంబరులో రూ.40 కోట్లు తగ్గిన రాబడి

ఆర్థిక సంవత్సరం లక్ష్యంపైనా ప్రభావం

రూ.300 కోట్ల ఆదాయం తగ్గే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మద్యం విధానం రావడంతోనే!



అలంపూర్ చౌరస్తాలోని ఓ వైన్ షాప్ వద్ద ఏపీ నుంచి వచ్చిన జనంతో నెలకొన్న రద్దీ (ఫైల్)

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో సరిహద్దులో ఉన్న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో మూడు మద్యం దుకాణాలు నిత్యం కిటకిటలాడుతూ ఉండేవి. ఏపీ నుంచి మద్యం ప్రియులు పెద్దఎత్తున ఇక్కడికి వచ్చేవారు. రద్దీని తట్టుకోలేక, ఉన్న స్టాక్ అందరికీ సర్దాలన్న లక్ష్యంతో రేషన్ కార్డులు తేవాలన్న నిబంధన కూడా అమలు చేశారు! ఒక్క కార్డుపై ఒక్క బాటిల్ మాత్రమే ఇచ్చేవారు! ఆదివారం, సెలవు రోజుల్లో అయితే రద్దీని నియంత్రించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేవారు! పక్క రాష్ట్రం నుంచి వచ్చే వారికోసం ఇక్కడి వైన్ షాపుల చుట్టుపక్కల పదుల సంఖ్యలో దాభాలు వెలిశాయంటేనే రద్దీని అంచనా వేయొచ్చు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లో రెండు నెలల

మిగతా 12వ పేజీలో...



కేబీఆర్ పార్క్ చుట్టూ

స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌లు

10

వేగంగా పూర్తి చేసేందుకు స్టీల్‌తో నిర్మాణం

1090 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం

వచ్చే వారం టెండర్లకు జీహెచ్ఎంసీ సిద్ధం

303 ఆస్తుల సేకరణకు మార్కింగ్.. వాటిలో బాలకృష్ణ, చిరంజీవి, జానారెడ్డి ఇళ్లు

దేహం.. దానం!

వైద్య పరిశోధనలకు స్వచ్ఛందంగా మృతదేహాల అప్పగింత

ముందుగానే వీలునామాలు

ఇటీవల మారుతున్న ప్రజల వైఖరి

ఎక్కువగా కమ్యూనిస్టు ప్రభావిత జిల్లాల్లో..

ఖమ్మంలో ఓ ప్రైవేట్ కాలేజీలో 65 శవాలు

సర్కారీ మెడికల్ కాలేజీల్లోనూ కొరతేం లేదు

ప్రైవేట్ కాలేజీలకు మాత్రం తప్పని తిప్పలు

ఒక్కో కాలేజీకి 10 శవాలు అవసరం

లభించక రబ్బరు బొమ్మలతోనే బోధన

ప్రాక్టికల్ జ్ఞానం లేకుంటే కష్టమే: నిపుణులు



హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మరణానంతరం తమ దేహాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం మెడికల్ కాలేజీలకు దానం చేయాలనుకునే వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. చనిపోయిన తర్వాత మట్టిలో కలిసిపోవడం కంటే నలుగురు వైద్యులు నేర్చుకునేందుకు తమ దేహం ఉపయోగపడడమే మంచిదని భావించే వారు పెరుగుతున్నారు. ఒకర్ని చూసి

మిగతా 12వ పేజీలో...

మరోసారి 'మిలియన్ వీసా'

భారతీయులకు పది లక్షలకు పైగా వీసాలు

వరుసగా రెండో ఏడాదీ టాప్‌లో భారత్

హెచ్-1బీ వీసాల రెన్యువల్ ఇక తేలిక

అమెరికాలోనే పునరుద్ధరించుకునే వీలు

2

కేటీఆర్‌ను 31 వరకు అరెస్టు చేయొద్దు

ఫార్ములా-ఈ రేసు కేసులో హైకోర్టు ఆదేశాలు.. తదుపరి విచారణ 31కి వాయిదా

కేటీఆర్ అరెస్ట్ వద్దన్న ఉత్తర్వులు ఎత్తేయండి.. వెకేట్ స్టే పిటిషన్ దాఖలు చేసిన ఏసీబీ

నేరం లేదు.. ఉన్నదంతా రాజకీయ కుట్రే.. అనుమతుల బాధ్యత నాది కాదు.. అధికారులదే

నాపై కేసు పెట్టాలనే వాయిదాల ఎగవేత.. ప్రభుత్వ తీరు వల్లే భారీ నష్టం: కేటీఆర్ కౌంటర్

బిగుస్తున్న ఉచ్చు!.. ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ మీద 409 సెక్షన్

నోటీసులు ఇవ్వకుండా అరెస్టుకు అవకాశం.. క్వాష్ పిటిషన్ తేలగానే ఏసీబీ నిర్ణయం

14



తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలకు ఆమోదం!

వారంలో రెండుసార్లు అనుమతి

టీటీడీ బోర్డు నిర్ణయం

3



అమెరికా నుంచి బేరింగ్!



నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం (ఫైల్)

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో కీలక ముందడుగు

మార్చి నెలాఖరు నుంచి పనులు పునఃప్రారంభం

సెప్టెంబరు 2027కి పూర్తి చేయాలని లక్ష్యం

సొరంగమార్గం పూర్తయితే కీలకదశ దాటినట్లే

పునరావాస కల్పన, పునర్నిర్మాణ పనులపై దృష్టి

నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారమార్గంగా చేపట్టిన ఎస్ఎల్‌బీసీ(శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగమార్గం పనుల పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నుంచి సొరంగం తవ్వకం పనులను మళ్లీ ప్రారంభించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈలోపే సొరంగం తవ్వే టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)లో వినియోగించే బేరింగ్, కటింగ్ స్పేర్‌పార్ట్స్ పని ప్రదేశానికి చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు. విదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ బోరింగ్ మిషన్‌కు మరమ్మతులు వస్తే, దాంట్లో ఉపయోగించే బేరింగ్, ఇతర స్పేర్ పార్ట్స్(విడి భాగాలు) అన్నీ కూడా అమెరికాలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ తయారు

మిగతా 3వ పేజీలో...

మన్మోహన్ జీవితం స్ఫూర్తిదాయకం

- అనేక సవాళ్ల మధ్య ఆయన అసాధారణ విజయాలు సాధించారు
- వీడియో సందేశంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 27: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జీవితం భవిష్యత్ తరాలకు ఒక స్ఫూర్తి దాయక పాఠంగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ విభజన తర్వాత సర్వస్వమూ పాకిస్థాన్‌లో వదిలేసి భారత్‌కు వచ్చిన కుటుంబానికి చెందిన మన్మోహన్.. తీవ్రమైన సమస్యల మధ్య కూడా అనేక అసాధారణ విజయాలు సాధించారని గుర్తు చేశారు. ఈ మేరకు మోదీ శుక్రవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'దేశ ప్రజానీకం పట్ల, దేశాభివృద్ధి పట్ల మన్మోహన్ అంకితభావం ఎల్లప్పుడూ గౌరవాన్ని అందుకుంటుంది. ఆయన మృతి దేశానికి తీరని నష్టం కలిగించింది. హుందాతనం మూర్తీభవించిన వ్యక్తిగా, మేధావిగా, ఆర్థికవేత్తగా, సంస్కరణలకు అంకితమైన నాయకుడిగా మన్మోహన్ ఎప్పటికీ గుర్తుండిపోతారు' అని మోదీ తెలిపారు. సవాళ్లతో కూడుకున్న సమయంలో మన్మోహన్ ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని, పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర ఆర్థికమంత్రిగా దేశాన్ని నూతన ఆర్థిక పథంలో నిలిపారని, ప్రధానిగా దేశాభివృద్ధికి కట్టుబడి సేవలందించారని వివరించారు. వ్యక్తిగతంగా మన్మోహన్ పాటించిన విలువలనూ మోదీ ప్రశంసించారు. 'ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదువుకొని, ఉన్నత హోదాల్లో పని చేసిన మన్మోహన్ సింగ్.. తన మూలాలను, వాటి తాలూకు విలువలను ఎన్నడూ మర్చిపోలేదు. నిజాయితీ, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా జీవితం గడిపారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. కొన్నేళ్లుగా ఆరోగ్యం సహకరించకపోయినా వీల్‌చెయిర్‌లో వచ్చి పార్లమెంటు కార్యకలాపాలకు హాజరయ్యారు' అని గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్‌ది రాజకీయపార్టీలకు అతీతమైన వ్యక్తిత్వమని, తాను గుజరాత్ సీఎంగా ఉన్న రోజుల్లో అనేక జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రధానిగా ఉన్న మన్మోహన్‌ను కలిసి మాట్లాడేవాడినని మోదీ పేర్కొన్నారు. 2014లో తాను ప్రధాని అయిన తర్వాతా మన్మోహన్‌ను ఆయన పుట్టినరోజున కలిసి మాట్లాడానని తెలిపారు.

బెళగావిలో మన్మోహన్ సంస్మరణ సభ

బెంగళూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ బెళగావిలో బాధ్యతలు చేపట్టి వందేళ్లు గడిచిన సందర్భంగా నిర్వహిస్తున్న సభ.. రెండో రోజు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ సభగా మారింది. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' సభను రద్దు చేసి, అక్కడే మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. కేపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య, మంత్రులు పుష్పాంజలి ఘటించారు.

అసలైన రాజనీతిజ్ఞుడు మన్మోహన్

భారత రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహోన్నత వ్యక్తి

- మాజీ ప్రధానికి సీడబ్ల్యూసీ ఘన నివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు 27 : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఓ మహోన్నత వ్యక్తి అని, అసలైన రాజనీతిజ్ఞుడని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) పేర్కొంది. తన జీవితం, అందించిన సేవలతో మన్మోహన్ దేశ దశ, దిశను మార్చేశారని అభిప్రాయపడింది. ఈ మేరకు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి అర్పిస్తూ సీడబ్ల్యూసీ ఓ తీర్మానం చేసింది. మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ శుక్రవారం సమావేశం అయింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాజీ ప్రధానికి పుష్పాంజలి ఘటించారు. 1990ల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన మన్మోహన్ సింగ్ భారతదేశ ఆర్థిక రంగ సరళీకరణకు రూపశిల్పి అని సీడబ్ల్యూసీ తన తీర్మానంలో పేర్కొంది. మన్మోహన్ ముందుచూపుతో చేపట్టిన సంస్కరణలు భారతదేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకొని నిలబడేలా చేశాయని, అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించాయని తెలిపింది. ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడులకు ప్రోత్సహించడం వంటి నిర్ణయాలతో మన్మోహన్‌సింగ్ భారతదేశాన్ని ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా చేశారని వివరించింది. ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం, జాతీయ ఆహార భద్రత చట్టం, భూసేకరణ చట్టం, వ్యవసాయ రుణ మాఫీ, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం అందించే 93వ రాజ్యాంగ సవరణ, సమాచార హక్కు చట్టం వంటివి అన్నీ మన్మోహన్ హయాంలోనే జరిగాయని సీడబ్ల్యూసీ గుర్తు చేసింది. సమ్మిళిత వృద్ధి, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక రంగ బలోపేతం వంటి అంశాలతో పాటు సగటు పౌరుడి సంక్షేమం కోసం మన్మోహన్ సింగ్ చేసిన కృషి వల్లే భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదిగిందని వివరించింది. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, సంస్కరణకర్తగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది.



మన్మోహన్ సింగ్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాహుల్ గాంధీ; చిత్రంలో ఖర్గే

పీవీని కాదని..

మన్మోహన్‌కు ఔనని..


- ఏఐసీసీ కార్యాలయంలోకి పీవీ భౌతికకాయం రాకుండా నాడు గేట్లు మూసేసిన కాంగ్రెస్ పార్టీ
- మన్మోహన్‌కు రాజ్ ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి
- కార్యకర్తల సందర్శనార్థం ఆయన పార్థివదేహాన్ని ఏఐసీసీ కార్యాలయంలో ఉంచుతామని వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పతనం అంచున ఉన్న దేశాన్ని గాడిన పెట్టిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఇవ్వని గౌరవాన్ని.. కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన హయాంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్‌కు ఇస్తోంది! పీవీ చనిపోయినప్పుడు ఆయన భౌతిక కాయాన్ని సైతం ఏఐసీసీ కార్యాలయానికి రానివ్వకుండా గేట్లు మూసేసిన కాంగ్రెస్ పార్టీ.. పీవీ భౌతిక కాయాన్ని హైదరాబాద్‌కు పంపి అంత్యక్రియలు చేయించిన అధిష్ఠానం.. ఇప్పుడు రాజ్‌ఘాట్‌లో మన్మోహన్ సింగ్‌కు అంత్యక్రియలు నిర్వహించాలని, అక్కడ ఆయన ప్రత్యేక స్మారకస్థలిని ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తోంది! వీపీ సింగ్, మొరార్జీ దేశాయ్, పీవీ నరసింహారావు మినహా.. దేశ మాజీ ప్రధానులందరి అంత్యక్రియలూ ఢిల్లీలోనే జరిగిన సంగతి తెలిసిందే. పీవీ నరసింహారావు చనిపోయినప్పుడు కేంద్రంలో అధికారంలో ఉండీ అంత కఠినంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ.. మన్మోహన్ విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. పార్టీ కార్యకర్తల సందర్శనార్థం మన్మోహన్ సింగ్ భౌతిక కాయాన్ని శనివారం ఉదయం 8-30 నుంచి 9-30 వరకు ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో ఉంచుతామని.. 9.30కి అంతిమయాత్ర మొదలవుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ధ్రువీకరించారు. యమునా నది ఒడ్డున ఉన్న రాజ్‌ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించాల్సిందిగా శుక్రవారం కేంద్రాన్ని కూడా కోరినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వయంగా ఈ విజ్ఞప్తి చేశారు. అనంతరం.. మన్మోహన్‌కు అంత్యక్రియలు నిర్వహించిన చోటులోనే స్మారకాన్ని కూడా నిర్మించాలని కోరుతూ రెండు పేజీల లేఖ రాశారు. రెండు సార్లు ప్రధానిగా సేవలందించిన మన్మోహన్‌కు దేశ ప్రజల హృదయాల్లో అత్యంత గౌరవనీయస్థానం ఉందని, ఆయన సాధించిన విజయాలు, దేశానికి చేసిన సేవలు అపూర్వమని ఖర్గే ఆ లేఖలో గుర్తుచేశారు. మాజీ ప్రధానులకు అంత్యక్రియలు జరిగిన చోటే వారి స్మారకాలను నిర్మించిన సంప్రదాయం ఉందని గుర్తుచేశారు. అలాగే.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ ప్రత్యేకంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఈ మేరకు అభ్యర్థించారు. రాజ్‌ఘాట్‌లో ఒక్కొక్కరికీ ప్రత్యేక స్మారక స్థలం ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపోనందువల్ల.. రాష్ట్రీయ స్మృతిస్థల్‌లో మాజీ ప్రధానుల స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలని 2013లో యూపీఏ హయాంలో మన్మోహన్ సింగ్ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు రాజ్‌ఘాట్‌లో ప్రత్యేక స్మారక స్థలం కావాలని కాంగ్రెస్ పార్టీ స్వయంగా కోరడం గమనార్హం. అంతేనా.. మన్మోహన్‌కు ప్రత్యేకంగా స్మారకస్థలిని నిర్మించకపోవడమంటే దేశ తొలి సిక్కు ప్రధానిని ఉద్దేశపూర్వకంగా అవమానించడమేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు.

ఆర్థిక సంస్కర్తకు

అశ్రు నివాళి



(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సిందిగా రక్షణ శాఖను కోరినట్లు వెల్లడించింది. మరోవైపు.. మన్మోహన్ మృతి పట్ల కేంద్ర మంత్రివర్గం శుక్రవారం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన భేటీ అయిన క్యాబినెట్.. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా తొలుత రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ సంతాప తీర్మానం చేసింది. "దేశ ప్రజల జీవితాలపై మన్మోహన్ సింగ్ చెరగని ముద్ర వేశారు. ఆయన మృతితో దేశం ప్రముఖ రాజనీతిజ్ఞుడిని, ప్రఖ్యాత ఆర్థికవేత్తను, మహోన్నత నాయకుడిని కోల్పోయింది" అని ఆ తీర్మానంలో పేర్కొంది. ఢిల్లీలోని సమాధి కాంప్లెక్స్‌లో ఉన్న స్మృతి స్థలంలో ఆయన స్మారకాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా ఏడురోజులపాటు జాతీయ సంతాపదినాలుగా కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు జనవరి 1 వరకూ దేశవ్యాప్తంగా జాతీయ జెండాను అవనతం చేస్తారు. అలాగే, ఇతర దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలన్నింటిపైనా జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా.. శనివారం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాలకు ఒంటిపూట సెలవు ప్రకటిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ నివాసం లో ఆయన భౌతిక కాయాన్ని శుక్రవారం పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు సందర్శించి కడసారి నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు ఆయన నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశానికి తీరని లోటు: చంద్రబాబు

న్యూఢిల్లీ/అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం చాలా బాధాకరమని, ఆయన మృతి దేశానికి తీరని నష్టమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దేశ నిర్మాణంలో మన్మోహన్ కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఢిల్లీలోని మన్మోహన్ సింగ్ నివాసంలో శుక్రవారం ఆయన భౌతిక కాయానికి చంద్రబాబు నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ సతీమణి గురుచరణ్ కౌర్‌ను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్ కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశానికి దశ, దిశను నిర్దేశించారని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని తెలిపారు. భారత దేశం ఈ రోజు ప్రపంచంలోనే గొప్పగా మారుతోందంటే ఆనాడు మన్మోహన్ వేసిన పునాదులే కారణమని ఆయన పేర్కొన్నారు.

జిన్నాను తాకిన మన్మోహన్ బంతి!

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ క్రీడా ప్రియుడు కూడా. అవిభాజ్య భారత్‌లోని పంజాబ్ రాష్ట్రంలో జన్మించిన మన్మోహన్‌సింగ్ తన 13 ఏళ్ల ప్రాయంలో లాహోర్‌లోని జూనియర్ కాలేజీ మైదానంలో తన మిత్రులతో కలిసి హాకీ ఆడుతున్నారు. ఈ మైదానానికి సమీపంలో ఉన్న ఓ ఇంటి ముందు ఓ పెద్దాయన నిలబడి వీరి ఆటను ఆసక్తిగా వీక్షించారు. ఇంతలో మాస్టర్ మన్మోహన్ సింగ్ కొట్టిన బంతి గోల్ పోస్టులోకి వెళ్లకుండా పొరపాటు ఇంటి ముందు నిలబడి వీరి ఆటను వీక్షిస్తున్న పెద్దాయన తలను తాకింది. అయితే.. బంతి తగిలిన పెద్దాయన నవ్వి ఊరుకున్నారు. ఆయన ఎవరో కాదు.. పాకిస్థాన్ విభజన కోసం పట్టుబట్టిన మహమ్మద్ అలీ జిన్నా. ఈ సరదా సంఘటనను మన్మోహనే స్వయంగా చెప్పుకొచ్చారు. -(సెంట్రల్ డెస్క్)

కొరడాతో కొట్టుకుని నిరసన

- తమిళనాడులో శాంతిభద్రతల పరిస్థితిపై బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న చర్య

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన ఘటనకు ప్రభుత్వ భద్రతా వైఫల్యమే కారణమంటూ, ఇందుకు నిరసనగా శుక్రవారం అన్నామలై కొరడాతో ఆరుసార్లు కొట్టుకున్నారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ తాను 48 రోజుల పాటు వ్రతం ఆచరించి మురుగన్ ఆలయానికి వెళ్లి రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, అత్యాచారాల గురించి నివేదించనున్నట్లు గురువారం ఆయన ప్రకటించారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు తాను పాదరక్షలు ధరించని శపథం చేశారు. వ్రతంలో భాగంగా తన ఇంటి వద్దే ఆరుసార్లు కొరడాతో కొట్టుకుంటానన్నారు. ఆ ప్రకారం శుక్రవా రం కోయంబత్తూరులో తన నివాసం ఎదుట చొక్కా లేకుండా, పచ్చరంగు లుంగీ ధరించి, నుదుట విభూతి రేఖలు దిద్దుకుని పార్టీ కార్యకర్తల సమక్షంలో కొరడాతో కొట్టుకున్నారు. ఆ సమయంలో ఆయన చుట్టూ చేరిన పార్టీ శ్రేణులు 'వెట్టివేల్.. వీరవేల్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

తమిళ సంప్రదాయంలో భాగమే: అన్నామలై

అన్నామలై విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నిరసన తమిళ సంప్రదాయంలో భాగమేనని అన్నారు. బీజేపీ కార్యకర్తలెవరూ తనను అనుసరించరాదని విజ్ఞప్తి చేశారు. మహిళా లోకానికి జరుగుతున్న అన్యాయాల ను నిరోధించాలని తమిళుల ఆరాధ్య దైవమైన మురుగప్పెరుమాన్‌ను వేడుకోవటంలో భాగంగానే మండలం పాటు వ్రతం ఆచరిస్తున్నట్లు చెప్పారు.

వచ్చే ఏడాదిలో 4 గ్రహణాలు

- వీటిలో 2 సూర్య, 2 చంద్రగ్రహణాలు
- భారత్‌లో కనిపించనున్న ఒక్క చంద్రగ్రహణం

ఇండోర్, డిసెంబరు 27: వచ్చే సంవత్సరంలో నాలుగు గ్రహణాలు సంభవించనున్నాయని, వీటిలో రెండు సూర్య, రెండు చంద్రగ్రహణాలు ఉంటాయని మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ జీవాజీ అబ్జర్వేటరీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రకాష్ గుప్తా శుక్రవారం తెలిపారు. అయితే వీటిలో ఒక్కదానిని మాత్రమే భారత్‌లో ఖగోళశాస్త్ర ప్రేమికులు చూసే అవకాశం దక్కనుందన్నారు. 2025 మార్చి 14న సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తుందని, అయితే ఇది భారత్‌లో పగటిపూట సంభవించనుండటం వల్ల ఇది కనిపించే అవకాశంలేదని తెలిపారు. అమెరికా, పశ్చిమ యూరప్, పశ్చిమాఫ్రికా, ఉత్తర, దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రాల ప్రాంతాల్లో ఇది కనిపిస్తుందన్నారు. మార్చి 29న పాక్షిక సూర్యగ్రహణం సంభవిస్తుందని, ఇది కూడా భారత్‌లో కనిపించదని తెలిపారు. ఇక సెప్టెంబరు 7-8 మధ్య ఏర్పడే సంపూర్ణ చంద్రగ్రహ ణం భారత్‌తోపాటు ఇతర ఆసియా దేశాలు, యూరప్, అంటార్కిటికా, పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం, ఆస్ట్రేలియా, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో కనిపిస్తుందని గుప్తా తెలిపారు. ఇక 2025 సంవత్సరంలో చివరిగా సెప్టెంబరు 21-22 మధ్య పాక్షిక సూర్య గ్రహణం సంభవిస్తుందని, ఇది భారత్‌లో కనిపించదని తెలిపారు.

హిడ్మా కోసం 10 వేలకు పైగా బలగాలు!

- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ముమ్మర వేట

చర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా కోసం ఛత్తీస్‌గఢ్ అడవులను భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. వేలాది మంది వాగులు, వంకలు దాటుతూ గాలిస్తున్నారు. హిడ్మా టార్గెట్‌గా ఐదు క్యాంపుల ద్వారా.. దాదాపు 10 వేలకు పైగా బలగాలు అడవుల్లో ముమ్మర వేట సాగిస్తున్నాయి. బీజాపూర్, సుకుమా జిల్లాల అడవుల్లో చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో డీఆర్‌జీ, కోబ్రా, ఎస్టీఎఫ్, మహిళా కమాండోలు పాల్గొంటున్నారు. హిడ్మా సొంతూరైన సుకుమా జిల్లా పూవర్తిలో కొద్దినెలల కిందే సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. అనంతరం పూవర్తి పక్కనే ఉన్న కొండపల్లి, గుండం గ్రామాల్లోనూ క్యాంపులు ఏర్పాటు చేశారు.

జాతీయ వ్యవసాయ అకాడమీ ఫెలోగా

శాస్త్రవేత్త భానుప్రకాష్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 27: జాతీయ వ్యవసాయ అకాడమీ(నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్) ఫెలోగా జాతీయ పోషకాహార సంస్థ(ఎన్‌ఐఎన్) సీనియర్ శాస్త్రవేత్త, బయోకెమిస్ట్రీ విభాగం సారథి డాక్టర్ భానుప్రకాష్ రెడ్డి ఎంపికయ్యారు. పోషకాహార రంగంలో భానుప్రకాష్ చేసిన విస్తృత పరిశోధనలకు గుర్తింపుగా ఆయనకు ఫెలోగా అవకాశం దక్కిందని ఎన్‌ఐఎన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మనిషికి ఎంత పోషకాహారం కావాలి? పోషకాహార లోపాలు, నిత్యం ఉపయోగించే వంట దినుసులతో అనేక వ్యాధులను ఎలా దరిచేరకుండా చూసుకోవచ్చనే అంశాలపై భానుప్రకాష్ దశాబ్దాలుగా పరిశోధనలు నిర్వహిస్తున్నారు. వంట దినుసులతో మధుమేహాన్ని ఎలా దరిచేరకుండా చూసుకోవచ్చనే దానిపై విజయవంతంగా పరిశోధనలు నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయంగా 250 పరిశోధనా వ్యాసాలను ప్రచురించారు. ఐసీఎంఆర్-బసంతి దేవి అవార్డుతో పాటు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను భానుప్రకాష్ అందుకున్నారు.

26/11 ముంబై పేలుళ్ల నిందితుడు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ మృతి

న్యూఢిల్లీ, డిసెంబరు 27: నిషేధిత జమాత్-ఉద్-దవా ఉగ్రవాద సంస్థ డిప్యూటీ చీఫ్, ముంబై పేలుళ్ల నిందితుడు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ పాకిస్థాన్‌లో మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు లాహోర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం గుండెపోటుతో చనిపోయాడు. 2008 నవంబరు 26న జరిగిన ముంబై పేలుళ్ల సూత్రధారి హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రెహ్మాన్ మక్కీ బావమరిది. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన కేసులో రెహ్మాన్ మక్కీకి యాంటీ టెర్రరిజం కోర్టు 2020లో ఆరునెలల జైలు శిక్ష విధించింది. ఆ తర్వాత 2023లో ఐక్యరాజ్య సమితి అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించి, అతడి ఆస్తులను స్తంభింపచేయడంతో పాటు అతడి ప్రయాణాలపై ఆంక్షలు విధించింది.

మన్మోహన్ ఓ చాంపియన్

- జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ, డిసెంబరు27: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచంలోని గొప్ప చాంపియన్లలో మన్మోహన్‌సింగ్ ఒకరని, భారత్-అమెరికాల మధ్య పౌర అణు సహకార ఒప్పందంలో కీలకపాత్ర పోషించారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు. రెండు దేశాల మధ్య స్నేహం బలోపేతమయ్యేందుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. మన్మోహన్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో ఎప్పటికీ గుర్తుండిపోతారని బ్లింకెన్ కీర్తించారు. రష్యా-భారత్ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక బంధం ఏర్పడటంలో మన్మోహన్ పాత్ర కీలకమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. ఆర్థిక రంగంలో భారత్ ప్రగతి కోసం ఆయన విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. భారత్-చైనా మధ్య సంబంధాలు సజావుగా కొనసాగేలా మన్మోహన్ యత్నించారని చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. మన్మోహన్ హయాంలో సరిహద్దు అంశంపై కీలక ఒప్పందాలు కుదిరాయన్నారు. దేశ ప్రయోజనాల కోసం ధైర్యంగా ఆర్థిక సంస్కరణలు చేపట్టారని భారత్‌లో బ్రిటన్ హైకమిషనర్ లిండీ కామెరాన్ కీర్తించారు. ఆర్థిక రంగంలో భారత్‌ను సరైన స్థానంలో ఉంచడంలో కీలకంగా వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. అఫ్ఘానిస్థాన్ ప్రజలకు మన్మోహన్ మంచి మిత్రుడని ఆదేశ మాజీ అధ్యక్షుడు హమిద్ కర్జాయ్ తెలిపారు. మన్మోహన్‌తో పని చేయడం గొప్పగా ఉండేదని మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ చెప్పారు. బ్రిక్స్, ఐబీఎస్‌ఏ గ్రూపుల ఏర్పాటులో మన్మోహన్ కీలకంగా వ్యవహరించారని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసెల్వా చెప్పారు. మంచి స్నేహితుడిని కోల్పోయానన్నారు. మన్మోహన్ గొప్ప దార్శనికుడని, అసామాన్య రాజనీతిజ్ఞుడని నేపాల్ మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్ చెప్పారు. అనేకతరాలపాటు ఆయన స్ఫూర్తి కొనసాగుతుందన్నారు. మన్మోహన్ దార్శనిక ఆర్థికవేత్త అని శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స చెప్పారు.

అవినీతికి మన్మోహన్ వ్యతిరేకం

అవినీతికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ వ్యతిరేకమని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే చెప్పారు. 2010 ఆరంభంలో మన్మోహన్ పాలనకు వ్యతిరేకంగా తాను ఉద్యమించినప్పుడు లోక్‌పాల్, లోకాయుక్త చట్టాలకు సంబంధించి తన డిమాండ్లపై చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నారని హజారే కీర్తించారు. మన్మోహన్‌సింగ్ సేవలను భారత్ ఎప్పటికీ గుర్తించుకుంటుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలిపింది. అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చి అత్యున్నత పదవి చేపట్టారని కీర్తించింది.

నా స్నేహితుడా.. సోదరుడా.. ఇక సెలవు!!

మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం

మన్మోహన్‌సింగ్ మృతిపై మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం భావోద్వేగంతో స్పందించారు. "గుడ్‌బై.. మైమిత్రా.. మైభాయ్, మన్మోహన్" అంటూ "ఎక్స్"లో తమ ఇద్దరి అనుబంధాన్ని వివరించారు. 1990ల్లో తామిద్దరం ఆర్థిక మంత్రులుగా ఉన్నప్పుడు కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి తనను విషాదంలో ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గొప్ప వ్యక్తి, భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పిని స్మరిస్తూ ఎన్నెన్నో వ్యాసాలు, పుస్తకాలు రాయవచ్చన్నారు. భారత్ ప్రపంచంలోనే గొప్ప ఆర్థికశక్తిగా ఎదిగేందుకు ప్రధానిగా ఆయన ఓ మంత్రసానిలా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. అవినీతిపై ఇద్దరం అవిశ్రాంత పోరాటం చేశామన్నారు. ఓ కీలక కేసును బయటకు తీయడంలోనూ సహకరించుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. "ఎక్కువ మందికి ఓ విషయం తెలియదు. మలేషియన్లతో నేడీ విషయాన్ని పంచుకోవాలి. నన్ను జైల్లో వేసినప్పుడు మన్మోహన్ ఓ సాహసానికి పూనుకున్నారు. అది అప్పటి మలేషియా ప్రభుత్వానికి నచ్చేదీకాదు. రాజకీయంగానూ సరైన నిర్ణయం కాదు... అయినా మన్మోహన్ ఆ పని చేశారు. నా పిల్లల చదువులకు ఉపకార వేతనాలు ఇవ్వడానికి ముందుకు రావడం... మరీ ముఖ్యంగా మా అబ్బాయి ఇహ్‌సాన్‌కు.. నేను వాటిని తిరస్కరించినా... ఆ చర్య ఆయన ఉదార స్వభావానికి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం" అని ఇబ్రహీం ప్రశంసించారు.

లోకం తీరు



ప్రభుత్వ నియంత్రణ నుంచి ఆలయాలకు స్వేచ్ఛ కల్పించాలి

దేశవ్యాప్తంగా 'జాగరణ్ అభియాన్' ప్రచారం

5న విజయవాడలో ప్రారంభం: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ, డిసెంబరు 27: ఆలయాలకు ప్రభుత్వ నియంత్రణ నుంచి స్వేచ్ఛ కల్పించాలన్న డిమాండ్‌ను వీహెచ్‌పీ తీవ్రం చేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆలయాలను ప్రభుత్వాల నియంత్రణ నుంచి బయటకు తీసుకురావాలన్న అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి 5వ తేదీ నుంచి 'జాగరణ్ అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి మిలింద్ పరండే వెల్లడించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి ఈ క్యాంపెయిన్ ప్రారంభం అవుతుందని, 2 లక్షల మందికి పైగా పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. హిందూ సమాజంలోని ప్రముఖ వ్యక్తులు, సాధువుల నాయకత్వంలో ఈ దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మరోసారి 'మిలియన్ వీసా' రికార్డు

- భారతీయులకు పది లక్షలకు పైగా వలసేతర వీసాలు
- వరుసగా రెండో ఏడాదీ టాప్‌లో భారత్
- విదేశీ విద్యార్థుల ర్యాంకింగ్‌లో అగ్రస్థానం
- భారత్‌లోని అమెరికా ఎంబసీ వెల్లడి
- హెచ్-1బీ వీసాల రెన్యూవల్ ఇక తేలిక



న్యూఢిల్లీ, డిసెంబరు 27 : రికార్డు స్థాయి సందర్శకుల వీసాలు సహా మొత్తం పది లక్షలకుపైగా వలసేతర వీసాలను భారతీయులకు వరుసగా రెండో ఏడాది జారీ చేసినట్టు భారత్‌లోని అమెరికా ఎంబసీ ఒక ప్రకటనలో తెలిపింది. చదువుల కోసం తమ విద్యార్థులను అమెరికాకు పంపిన దేశాల వరసలో భారత్ టాప్‌లో నిలిచిందని తెలిపింది. ఈ ఏడాది 3,31,000 మందిని మనదేశం పంపినట్టు పేర్కొంది. 2008/2009 తర్వాత ఈ స్థాయిలో వేరే దేశం నుంచి అమెరికాకు చదువుల కోసం రావడం ఇదే తొలిసారి. అంతేకాదు.. అంతర్జాతీయంగా అత్యధికంగా గ్రాడ్యుయేట్లను వరుసగా రెండో ఏడాది కూడా అగ్రదేశానికి పంపిన ఘనతను కూడా భారత్ సొంతం చేసుకుంది. ఇప్పుడు అక్కడ రెండు లక్షల మంది (19 శాతం) గ్రాడ్యుయేట్లు మనదేశం నుంచి ఉన్నారు. విద్య తర్వాత పర్యాటకం, వ్యాపార అవసరాల కోసం అమెరికాను భారతీయులు సందర్శిస్తున్నారని ఈ సంస్థ తెలిపింది. అమెరికాకు భారత్ నుంచి సందర్శకుల సంఖ్య గత నాలుగేళ్లలోనే ఐదు రెట్లు పెరిగి.. 20 లక్షలమందికి చేరిందని వివరించింది. గత ఏడాది తొలి పదకొండు నెలలతో పోల్చితే.. ఈ ఏడాది అదే కాలానికి పెరుగుదల 26 శాతమని తెలిపింది. ఇప్పటికే యాభై లక్షలమంది వలసేతర వీసాల మీద అమెరికాలో ఉన్నారని, ప్రతి రోజూ ఈ వీసాలను వేలల్లో జారీ చేస్తున్నామని తెలిపింది. మరోవైపు.. హెచ్-1బీ వీసాలను అమెరికాలోనే పునరుద్ధరించే ఆలోచనతో చేపట్టిన పైలట్ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని ఆ దేశ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల ప్రత్యేక వృత్తి నిపుణులను అత్యధికంగా అమెరికాకు అందిస్తున్న భారత్ ఎక్కువ లబ్ధి పొందనుంది. సాధారణంగా హెచ్-1బీ వీసా గడువు ముగియగానే మనవాళ్లు భారత్‌కు తిరిగి వచ్చి రెన్యువల్ (స్టాంపింగ్) చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన కొత్త విధానం ప్రకారం.. ఇకపై వీరు అమెరికాలోనే తమ వీసాలను రెన్యువల్ చేయించుకునే వెసులుబాటు కలగనుంది.

పీఎస్ఎల్వీ-సీ60తో జంట ఉపగ్రహాలు

- స్పేస్ డాకింగ్ ప్రయోగానికి శ్రీకారం
- 30న స్పాడెక్స్ ప్రయోగం
- పూర్తయిన రాకెట్ అనుసంధానం



సూళ్లూరుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో మరో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి ఈ నెల 30 పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసీలోకి పంపనుంది. ఈ ప్రయోగం ద్వారా విభిన్న పరిశోధనలకు ఇస్రో శ్రీకారం చుట్టనుంది. దీన్ని స్పేస్ డాకింగ్ ప్రయోగంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించిన రాకెట్ అనుసంధాన పనులతోపాటు ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను కూడా గురువారం పూర్తి చేసినట్లు ఇస్రో వెల్లడించింది. ఈ నెల 30వ తేదీ రాత్రి 9.48 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం జరగనుంది. దీని ద్వారా చేసే పరిశోధనలు.. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత్ ఆధ్వర్యంలో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా రెండు ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపి.. వాటిని అనుసంధానిస్తూ, విడగొడుతూ ఇస్రో ప్రయోగాలు చేపట్టనుంది. ఈ ఉపగ్రహాలతో పాటు వివిధ రకాల పరిశోధనల కోసం 24 ఉపకరణాలను కూడా పంపుతున్నారు. ఈ మిషన్ విజయవంతమైతే మరిన్ని ప్రయోగాల్లో డాకింగ్ సిస్టమ్‌ను పరిశీలించనున్నారు.

తెనాలికి చెందిన 'స్వేచ్ఛశాట్-వీ.0' కూడా..

రాకెట్ నుంచి స్పాడెక్స్ ఉపగ్రహం విడిపోయిన తర్వాత నాలుగో దశలో విభిన్న పరిశోధనలకు ఇస్రో శ్రీకారం చుట్టనుంది. ఈ ప్రయోగంలో పీఎస్-4 ద్వారా ఏకంగా 24 పరిశోధనలు చేసేందుకు 24 చిన్న ఉపకరణాలను పంపుతున్నారు. ఈ పరిశోధనల ద్వారా ఇస్రోకు విలువైన సమాచారం రావడమే కాకుండా స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఎంతో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ ఉపకరణాల్లో ఇస్రోకు చెందినవి 14 కాగా.. మరో 10 ఉపకరణాలు దేశంలోని వివిధ ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలు, విశ్వ విద్యాలయాలకు చెందినవి. ఇందులో తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ సంస్థ వారు ఇస్రో సహకారంలో యుహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ మాడ్యూల్‌కు సంబంధించిన 'స్వేచ్ఛశాట్-వీ.0'ని పీఎస్ఎల్వీ-సీ60 ద్వారా అంతరిక్షంలోకి పంపుతున్నారు. ముంబైకి చెందిన అమిటి యూనివర్సిటీ విద్యార్థులు పాలకూర కణాలను అంతరిక్షంలోకి పంపుతున్నారు. ఇది అంతరిక్షంలో మొక్కలు ఎలా పెరుగుతాయనేది అధ్యయనం చేసేందుకు ఉపయోగపడనుంది.

ఆత్మహత్యలపై పోలీస్ శాఖ సీరియస్?

- ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ మృతిపై ఉన్నతాధికారుల ఆరా!
- దర్యాప్తు ముమ్మరం.. స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్పీ

కామారెడ్డి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కామారెడ్డి జిల్లాలో ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, ఓ యువకుడు మృతి చెందిన మూకుమ్మడి ఆత్మహత్యల ఘటనపై రాష్ట్ర పోలీస్ శాఖ సీరియస్ అయినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. ఎస్ఐ, కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చేదాక జిల్లా పోలీసులు ఏం చేస్తున్నారని, వారి మధ్య ఉన్న సంబంధాలపై పోలీసుశాఖలో చర్చ సాగినా ఎందుకు నిఘా పెట్టలేకపోయారని నిలదీసినట్లు తెలిసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా ఎస్పీ సింధూశర్మను రాష్ట్ర పోలీసుశాఖ ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కేసు విచారణను జిల్లా పోలీసులు ముమ్మరం చేయగా ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కేసు దర్యాప్తుకు ఎస్పీ మూడు టీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ కేసు విచారణకు కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్, సీసీ ఫుటేజీ, పోస్టుమార్టం రిపోర్టులు కీలకం కానున్నాయి.

తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల

లేఖలకు ఆమోదం!

- వారంలో రెండుసార్లు అనుమతి.. టీటీడీ బోర్డు నిర్ణయం

జడ్చర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తిరుమలలో భక్తులకు దర్శనం, వసతి కల్పించే విషయంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న డిమాండ్‌కు టీటీడీ బోర్డు ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. వారంలో రెండుసార్లు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించాలని శుక్రవారం నిర్ణయం తీసుకుంది. దీనిపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోకపోవడంపై.. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గళం విప్పిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఏపీ సీఎం చంద్రబాబుతో ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే టీటీడీ బోర్డు సానుకూల నిర్ణయం తీసుకుంది.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక నేడు

మొదట టెక్నికల్ బిడ్‌ల పరిశీలన
అనంతరం తెరుచుకోనున్న ఫైనాన్స్ బిడ్‌లు

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం రహదారికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ప్రభుత్వానికి అందించే బాధ్యత ఏ సంస్థకు దక్కనుందనే విషయం శనివారం తేలనుంది. డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక కోసం ప్రభుత్వం నవంబరు 25న 'ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్' విధానంలో టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల దాఖలుకు నిర్దేశించిన గడువు శుక్రవారం మధ్యాహ్నం 3గంటలతో ముగిసింది. నిబంధనల ప్రకారం శుక్రవారమే సంస్థ ఎంపిక తేలాల్సి ఉన్నప్పటికీ.. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించింది. ఆ కారణంగా దాఖలైన టెండర్లను అధికారులు శనివారం ఉదయం తెరవనున్నారు. వీటిలో మొదటగా టెక్నికల్ బిడ్‌లను తెరుస్తారు. వాటిలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్నాయా అని పరిశీలిస్తారు. ఆ తరువాత టెండర్ పత్రాలను 'టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ'కి పంపుతారు. నిబంధనల ప్రకారమే టెండర్లు దాఖలు చేశారా? లేదా అని కమిటీ పరిశీలిస్తుంది. అనంతరం సక్రమంగా ఉన్న టెండర్లను ఖరారు చేసి, ఆ టెండర్ల ఫైనాన్స్ బిడ్‌లను తెరుస్తారు. ఫైనాన్స్ బిడ్‌లను తెరిచిన తరువాత వాటిలో డీపీఆర్ తయారీ కోసం ఏ సంస్థ తక్కువ ధరను వేసిందో పరిశీలించి, ఆ సంస్థ టెండర్‌ను ఖరారు చేయనున్నారు.

అమెరికా నుంచి.. బేరింగ్!



(మొదటి పేజీ తరువాయి)

చేసినవే వాడాల్సి ఉంటుంది. ప్రస్తుతం పనులు పునరుద్ధరించడానికి ఏడు మీటర్ల వ్యాసంతో 37 మెట్రిక్ టన్నుల బరువుండే బేరింగ్, ఇతర విడిభాగాలను అమెరికా నుంచి తెప్పిస్తున్నారు. ఈ సామగ్రి తయారీ కోసం రాబిన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకోవడానికి ఆగస్టులో ఇరిగేషన్ అధికారులతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమెరికాలోని ఓహియోకు వెళ్లారు. మంత్రి పర్యటన తర్వాతనే బేరింగ్ తయారు చేసిన కంపెనీ, ప్రస్తుతం దానిని ఓడలోకి ఎక్కించి చెన్నైకి తరలిస్తోంది. ఈ బేరింగ్‌తో పాటు, ఇతర స్పేర్‌పార్ట్స్ ఫిబ్రవరి మొదటివారంలోపే చెన్నైకి చేరుకుంటాయని, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో వచ్చే ఏడాది మార్చి మొదటి వారంలో ఎస్ఎల్‌బీసీ పని ప్రదేశానికి వస్తాయని అంచనా వేస్తున్నారు. స్పేర్ పార్ట్స్‌ను మిషన్లలో అమర్చడానికి మరో పదిహేను రోజులు పడుతుందని, మొత్తంగా మార్చి నెలాఖరుకు పనులు ప్రారంభమవుతా యనే ధీమాతో అధికార యంత్రాంగం ఉంది. సొరంగమార్గం పెండింగ్ పనులతో పాటు సమాంతరంగా నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల రిజర్వాయర్ పెండింగ్ పనులు, నిర్వాసితులకు ఉద్దేశించే పునరావాస, పునర్నిర్మాణ పనులు కూడా పూర్తి చేసే అంశంపైనా అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది.

బేరింగ్ రాగానే పనులు మొదలుపెడతాం

టన్నెల్ బోరింగ్ మిషన్‌లోని బేరింగ్ మరమ్మతుల నేపథ్యంలో పనులు ఆగిపోయాయి. ఈ బేరింగ్ తయారీ కంపెనీతో ప్రభుత్వం ప్రత్యేకంగా సంప్రదించి బేరింగ్‌కు ఆర్డర్ ఇచ్చింది. ప్రస్తుతం ఓడ ద్వారా అది అమెరికా నుంచి బయలుదేరింది. ఫిబ్రవరి మొదటి వారానికి బేరింగ్, ఇతర స్పేర్‌పార్ట్స్ చెన్నై చేరుకోగానే, అక్కడినుంచి ఇక్కడికి తెప్పిస్తాం. ఈ యంత్రాలతో పాటు, ఇతర పెండింగ్ పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. బేరింగ్ రాగానే దాన్ని బిగించి పనులు మొదలుపెడతాం.

- సత్యనారాయణ, ఈఈ, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు

పనులకు గ్రీన్‌చానల్ ద్వారా నిధులు

ఎస్ఎల్‌బీసీ పథకంలో కీలకమైన సొరంగ మార్గంలో పది మీటర్ల డయాతో మొత్తం 43.930 కిలోమీటర్ల సొరంగాన్ని తవ్వేందుకు, రెండువైపులా పనులు చేపట్టారు. ఇప్పటివరకు 34.370 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 9.560 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అవుట్‌లెట్-1లో టన్నెల్ బోరింగ్ మిషన్‌లో వినియోగించే బేరింగ్ మరమ్మతుతో ఆ పనులు ఆగిపోగా, ఇన్‌లెట్ వైపు నుంచి చేపట్టిన సొరంగంలో పనులు ముందుకు సాగకుండా 2019 నుంచి ఊటనీరు వచ్చి చేరుతోంది. అంతేకాక పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతున్నాయి. దీంతో ఇక్కడ ఊటనీటిని తోడివేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊట నీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయిస్తున్నారు. బేరింగ్‌తో పాటు, ఇతర స్పేర్‌పార్ట్స్ అన్నీ వచ్చిన తర్వాత రెండువైపులా పనులు మొదలుపెట్టాలని నిర్ణయించారు. ఈ పనులన్నింటినీ సెప్టెంబరు, 2027 నాటికి వంద శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం ఇంజనీర్లకు, కాంట్రాక్ట్ ఏజెన్సీకి లక్ష్యాన్ని నిర్దేశించింది. అంతేకాకుండా ఇక్కడ చేసిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయాలని, ఇందుకోసం జాప్యం లేకుండా ఉండే ఉద్దేశ్యంతో ఈ పథకానికి గ్రీన్‌చానల్‌లో నిధులు అందుబాటులో ఉంచారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్ల రద్దు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు శబరిమల ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణికుల నుంచి స్పందన కరువవడంతో మౌలాలి-కొట్టాయం, కాచిగూడ-కొట్టాయం, నర్సాపూర్-కొల్లాం, నాంపల్లి-కొట్టాయం, కాగజ్‌నగర్-కొల్లాం మార్గాల్లో ప్రకటించిన 14 రైళ్లను రద్దు చేశారు.

కుంభమేళాకు 16 ప్రత్యేక రైళ్లు..

మహాకుంభ మేళాలో పాల్గొనే యాత్రికుల కోసం దక్షిణ మధ్య రైల్వే 16 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. జనవరి18, 21 తేదీల్లో మౌలాలి-అజాంఘడ్, జనవరి20, 23 తేదీల్లో అజాంఘడ్-మౌలాలి, జనవరి 19న మౌలాలి-గయ, 21న గయ-మౌలాలి, 22న మౌలాలి-గయ, 24న గయ-మౌలాలి, 25న కాచిగూడ-పట్నా, 27న పట్నా-కాచిగూడ రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

20 ప్రత్యేక రైళ్ల పొడిగింపు...

వేర్వేరు ప్రాంతాల నుంచి వెళ్లి వచ్చే 20 ప్రత్యేక రైళ్లను వచ్చే మార్చి నెలాఖరు వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. జనవరి 29 నుంచి మార్చి 28 వరకు సికింద్రాబాద్-రామాంతపురం-సికింద్రాబాద్, జనవరి 27నుంచి ఏప్రిల్ 2వరకు కాచిగూడ-మధురై-కాచిగూడ, జనవరి 24నుంచి మార్చి 30వరకు నాందేడ్-ఈరోడ్-నాందేడ్, జనవరి24 నుంచి మార్చి 30వరకు కాచిగూడ-నాగర్‌కోయల్-కాచిగూడ రైళ్లను పొడిగించారు.

అమ్మో పెద్దపులి..

- నల్లబెల్లి మండలంలో పాదముద్రలు పెద్దపులివే
- అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో సూచన



రుద్రగూడెం గ్రామచేనుల్లో పెద్దపులి పాదముద్రలు

నల్లబెల్లి, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో పెద్దపులి సంచారంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. రుద్రగూడెం గ్రామ శివారులో రైతులు శుక్రవారం ఉదయం పంట చేనుల్లో పెద్దపులి పాదముద్రలను గమనించారు. సమాచారం అందుకుని ఘటనాస్థలికి చేరుకున్న ఫారెస్ట్‌శాఖ అధికారులు పంట చేలలో ఉన్న పాదముద్రలను పరిశీలించారు. పెద్దపులి పాదముద్రలేనని నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్ నిర్ధారించారు. కొండాపురం అడవిలో 12-14 సెంటీమీటర్ల అడుగుల ఆడపులిని, రుద్రగూడెం శివారులో పంట చేనుల్లో 15-20 సెంటీమీటర్ల అడుగుల మగ పులిని గుర్తించామన్నారు. ఆడపులి తోడు కోసం మగపులి వచ్చి ఉంటుందన్నారు. మొత్తంగా ఇది పెద్దపులి సంచారమేనని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాత్రిపూట ప్రజలు బయట తిరగవద్దన్నారు. పెద్దపులి రాత్రిపూట మాత్రమే ఎక్కువగా సంచరిస్తుందన్నారు. పశువులను జాగ్రత్తగా కట్టివేయాలని రైతులను కోరారు. పెద్దపులి సంచరిస్తోందని మండలంలోని అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు చేయించాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను కోరారు.

కొత్తగూడ ఏజెన్సీలో పులి సంచారం

మహబూబాబాద్ జిల్లా ఏజెన్సీ కొత్తగూడ మండలంలో పులి సంచారం కలకలం రేపుతోంది. ఓటాయి, కోనాపురం, సాధిరెడ్డిపల్లి అటవీప్రాంతాల్లో పరిశీలనకు వెళ్లిన కొత్తగూడ ఎఫ్ఆర్వో వజహత్ ఓటాయి ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించారు. పులి సంచరిస్తున్న అనుమానిత ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఓటాయి సమీప గ్రామ ప్రజలు పులి సంచారం నేపథ్యంలో ప్రయాణాలు, పనులకు వెళ్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజా సమస్యలపై సమరంలో శతాబ్ది

రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు.. ఐదు వేల గ్రామాల్లో ఎర్ర జెండా రెపరెపలు

- 30న నల్లగొండలో శతాబ్ది ఉత్సవ ప్రారంభ సభ
- వచ్చే ఏడాది ఆఖర్లో ఖమ్మంలో ముగింపు ఉత్సవాలు



హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం, సోషలిస్టు రాజ్యస్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్లు పూర్తి చేసుకుంది. 1925 డిసెంబరు ఆఖరి వారంలో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక మహాసభ సందర్భంగా దేశంలో ఉన్న కమ్యూనిస్టు బృందాలు అక్కడి చేరుకున్నాయి. అదే ప్రాంతంలో తొలిసారి సమావేశమయ్యాయి. 26వ తేదీన సీపీఐ ఏర్పాటును అధికారికంగా ప్రకటించారు. ఇక, స్వాతంత్ర్యానంతరం దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా సీపీఐ ఎదిగింది. సోషలిజాన్ని ఈ దేశానికి పరిచయం చేసింది. కార్మిక, కర్షక, విద్యార్థి, అభ్యుదయ రచయితలు, ప్రజానాట్యమండలి, మహిళా సంఘాలకు అంకురార్పణ చేసింది. భూ స్వామ్య వ్యవస్థ రద్దు, భూ సంస్కరణల ఆవశ్యకతపై ఉద్యమాలు చేపట్టింది. సంస్థానాల విలీనంలోనూ ప్రధాన పోరాట పాత్ర కమ్యూనిస్టు పార్టీదే. నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటాన్ని చేపట్టింది. 8 గంటల పని, న్యాయబద్ధమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు చేసింది. 1952 పార్లమెంట్ ఎన్నికల్లో 49 స్థానాల్లో పోటీ చేసిన సీపీఐ.. 16 చోట్ల విజయం సాధించింది. భువనగిరి పార్లమెంట్ నుంచి కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి తొలి ప్రధాన మంత్రి నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో గెలిచారు. ఆ తర్వాత 1957 ఎన్నికల్లో 27 స్థానాలు, 1962లో 29, 1967లో 23, 1971లో 23 లోక్ సభ స్థానాలు దక్కించుకుంది. అయితే, సిద్ధాంత విభేదాలతో 1964లో సీపీఐలో ప్రధాన చీలిక రాగా.. క్రమేణా 15 పార్టీలుగా చీలిపోయింది. అప్పటినుంచే సీపీఐ ప్రాభవం తగ్గడం ప్రారంభమైంది. 1977లో 7 స్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ... 2024 ఎన్నికల్లో కేవలం 2 స్థానాలే దక్కించుకోగలిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ జాతీయ స్థాయి ఒరవడే కొనసాగింది. 70వ దశకం వరకు సీపీఐ బలంగానే ఉంది. 1983 అసెంబ్లీ ఎన్నికల వేళ సీపీఐతో పొత్తుకు టీడీపీ అధ్యక్షుడు ఎన్టీఆర్ ప్రయత్నించారు. 60 అసెంబ్లీ సీట్లు ఇస్తామన్నా.. ఆ పార్టీ ఒప్పుకోలేదు. దీంతో చివరకు ఆ పార్టీ నాలుగు స్థానాలకే పరిమితమైంది. 1985 ఎన్నికల్లో మాత్రం టీడీపీతో జతకట్టి 11 స్థానాల్లో గెలుపొందింది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని 6 స్థానాలు, 2009లో మహా కూటమిలో భాగమై నాలుగు స్థానాలు గెలుచుకుంది. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో ఒక్క స్థానంలో గెలవగా.. ఆ ఎమ్మెల్యే కూడా పార్టీ ఫిరాయించారు. తాజాగా 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేసి గెలుపొందారు. అంతర్జాతీయ పరిణామాలు, సిద్ధాంతాల్లో కూరుకుపోవడం, సమాజ పరిణామ క్రమంతో మారకపోవడం వంటి కారణాలతో సీపీఐ సహా అనేక కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడ్డాయి. అయితే, శతజయంతి ఉత్సవాల సందర్భంగా కమ్యూనిస్టుల పునరేకీకరణకు సీపీఐ పిలుపునిచ్చింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఎర్ర జెండా రెపరెపలు

సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు రాష్ట్రంలోని 5 వేల గ్రామాల్లో అరుణ పతాకాలను పార్టీ నేతలు ఎగురవేశారు. తొలిరోజు హనుమకొండ, ఖమ్మంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల 30న మధ్యాహ్నం 2 గంటలకు నల్లగొండలోని ఎంజీ కళాశాల మైదానంలో శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభను నిర్వహించనున్నట్లు సీపీఐ ప్రకటించింది. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఏడాది పాటు ఉత్సవాలు నిర్వహించనుంది. ముగింపు ఉత్సవాల్లో భాగంగా 2025 డిసెంబరు 26న ఖమ్మంలో సుమారు 2 లక్షల మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు.

సెక్షన్-3, సెక్షన్-89పై వాదనలు ఏకకాలంలో వినాలి

- ఏపీ కోరినట్లుగా విడిగా వాదనలు వద్దు
- అలాగైతే ముందుగా రెండు రాష్ట్రాలకు నీటిని సమానంగా పంపిణీ చేయండి
- కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ కౌంటర్ పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్-89, అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956లోని సెక్షన్-3లపై ఏకకాలంలో వాదనలు వినాలని తెలంగాణ రాష్ట్రం బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌ను కోరింది. ఈ రెండు సెక్షన్లలోని అంశాలకు సారూప్యత ఉందని గుర్తు చేసింది. సెక్షన్-3, సెక్షన్-89 ఒకటి కాదని, రెండు సెక్షన్లలోని అంశాలపై వేర్వేరుగా వాదనలు వినాలంటూ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఇటీవల ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసిన నేపథ్యంలో దానికి కౌంటర్‌గా తెలంగాణ శుక్రవారం రీజాయిండర్ దాఖలు చేసింది. రెండు అంశాల్లో వేర్వేరుగా వాదనలు వినాలనుకుంటే.. తొలుత సెక్షన్-3 కింద వాదనలు విని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలను రెండు తెలుగు రాష్ట్రాలకు సమానంగా పంపిణీ చేయాలని కోరింది. ఆ తర్వాత సెక్షన్-89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపులపై వాదనలు వినాలని పేర్కొంది. 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ట్రైబ్యునల్ విచారణకు ప్రతిబంధకం కావని తెలిపింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఏపీకి 34 టీఎంసీల (తెలుగుగంగకు 15 టీఎంసీలు, ఎస్ఆర్‌బీసీకి 19 టీఎంసీలు) కేటాయింపులు మాత్రమే ఉండగా.. ఆ రాష్ట్రం ఏటా 200 టీఎంసీలకు పైగా నీటిని (72 శాతానికి పైగా) తరలిస్తోందని తెలంగాణ ఆక్షేపించింది. పైగా.. నీటి కేటాయింపులపై ట్రైబ్యునల్‌లో విచారణ జరుగుతున్నందున.. ఈ అంశంలో అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోజాలదంటూ కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల తేల్చిచెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. నీటి పంపిణీకి సంబంధించి అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయబోమంటూ కేంద్ర జలశక్తి శాఖ 2023 అక్టోబరు 20న లేఖ రాసిందని తెలిపింది. విచారణ ప్రక్రియలో జాప్యం చేసి, కృష్ణా జలాలను బేసిన్ వెలుపలికి తరలించే ప్రయత్నం ఏపీ చేస్తోందని, సెక్షన్-89 కింద తొలుత వాదనలు వినాలనే వాదన దీనికి నిదర్శనమని గుర్తు చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ విస్తరణ వాదం

వచ్చే నెలలో అమెరికా అధ్యక్షపదవిని చేపట్టబోతున్న డోనాల్డ్ ట్రంప్, ఇటీవల ఓ విచిత్ర ప్రకటన చేశారు. పనామా కాలువ తిరిగి అమెరికా అధీనంలోకి వచ్చేయాలన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. అట్లాంటిక్, పసిఫిక్ సముద్రాలను కలిపే పనామా కాలువ అమెరికా వాణిజ్యానికి అతిముఖ్యం. నలభైశాతం వాణిజ్యం ఈ కాలువ గుండా సాగుతున్నందువల్ల, అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకోవాలంటే అది పూర్తిగా తమ నియంత్రణలోనే ఉండాలంటున్నారు ఆయన. ఇంకా గద్దెనెక్కకముందే వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో ట్రంప్ దుమారం రేపుతున్నారు. కెనడాని అమెరికా 51వ రాష్ట్రంగా అభివర్ణించారు, గ్రీన్‌లాండ్‌ను ఏకంగా కొనేస్తామన్నారు. పనామా కాలువ చైనా అధీనంలో ఉన్నదనీ, నౌకల మీద విధించే రాకపోకల రుసుములు చెల్లించలేక అమెరికా బక్కచిక్కిపోతోందనీ, అందువల్ల కాలువ తిరిగి తన చేతికి వచ్చేయాలనీ అంటున్నారు. ఆయన ఏ నిముషానికి ఏమంటాడో, ఏమి చేస్తాడోనని మిత్రదేశాలు, శత్రుదేశాలు ఏకరీతిన వణికిపోయే కాలం ఇప్పటికే మొదలైపోయింది.

ట్రంప్ వ్యాఖ్యల్లో ఔచిత్యం లేకపోవచ్చును గానీ, వ్యూహం ఉందట. అర్థంపర్థంలేని ఈ తరహా ప్రతిపాదనలు చేసినప్పుడు, ఎదుటివారు తమకు తెలియకుండానే కాస్తంత అర్థవంతంగా స్పందిస్తారు కనుక, వారు అలా వలలో పడగానే, అందులో నుంచి ట్రంప్ తన ప్రయోజనాన్ని ఏరుకోగలరట. కెనడాను గ్రేట్ స్టేట్ ఆఫ్ అమెరికాగా అభివర్ణిస్తూ, దాని ప్రధానిని తమ గవర్నర్‌గా వ్యాఖ్యానించడమనే దుస్సాహసం వెనుక ఆర్థిక, వాణిజ్య యుద్ధాలున్నాయి. ట్రంప్–ట్రూడో సుంకాల సంగ్రామం మధ్య గిలగిలలాడి కెనడా ఆర్థికమంత్రి చివరకు తట్టాబుట్టాసర్దుకున్న విషయం తెలిసిందే. జస్టిన్ ట్రూడో వంటి స్థితప్రజ్ఞతలేని నాయకుడికి ట్రంప్ సరిస్థాయిలో తూగుతారు.

గత పాలకుల నిర్ణయాన్ని తప్పుబట్టడంలో ట్రంప్‌ను మించినవారెవ్వరూ లేరు. ట్రంప్ కన్ను ఎప్పటినుంచో గ్రీన్‌లాండ్‌మీద ఉంది. డెన్మార్క్ నుంచి దీనిని కొనేస్తానని ఆయన తొలివిడత పాలనలోనే ఊగిపోయారు. ఇప్పుడు డెన్మార్క్‌కు కొత్త రాయబారిని ప్రకటిస్తున్న సందర్భంలో తిరిగి ఆ వాదన ముందుకు తెచ్చారు. అమెరికా భద్రతకీ, ఇంకా చెప్పాలంటే యావత్ ప్రపంచ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకీ గ్రీన్‌లాండ్ తన గుప్పిట్లో ఉండటం అవసరమని విశ్లేషిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా డెన్మార్క్ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. గ్రీన్‌లాండ్ అమ్మకానికి సిద్ధంగా లేదని ఆ స్వయంపాలిత ప్రాంతం అధినేత ఘాటుగా స్పందించారు. అట్లాంటిక్, ఆర్కిటిక్ సముద్రాల మధ్యన ఉన్న ఈ మంచు ప్రాంతం అమెరికా సైనికస్థావరంగా, మరీ ముఖ్యంగా ప్రచ్ఛన్న యుద్ధకాలంలో పలురకాల రక్షణపరిశోధనలకు ఉపకరించిన విషయం తెలిసిందే. మంచు ఫలకం కిందన వందమీటర్ల లోతులో అర్థంతరంగా వదిలేసిన ఒక సైనికస్థావరం నిక్షిప్తమైన విషయాన్ని నాసా ఇటీవల వెలుగులోకి తెచ్చింది. అనేకానేక మారణాయుధాలను దాచేందుకు, సన్నద్ధంగా ఉంచేందుకు ఈ క్యాంప్ సెంచరీని ఉపయోగించాలనుకున్నారు. అరవైఏదేళ్ళనాటి ఈ రహస్య నగరంలో ఆయుధాల అవశేషాలు, అణువ్యర్థాలు నిక్షిప్తమై ఉన్నాయన్నది వార్త. రక్షణపరంగా ఎంతో కీలకమైన గ్రీన్‌లాండ్ గురించి ట్రంప్ అదేపనిగా మాట్లాడటం, గతంలో తన మాట కాదన్నందుకు అలిగి డెన్మార్క్ పర్యటనను రద్దుచేసుకోవడం వంటి పరిణామాలు గమనిస్తే ఈ మారు అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన చర్యలు మరింత గట్టిగా ఉండవచ్చునేమో.

నూటపాతికేళ్ళక్రితం పనామా కాలువను నిర్మించింది అమెరికాయే గానీ, 1977లో జిమ్మీకార్టర్ హయాంలో కుదిరిన ఒప్పందం ప్రకారం అది 1999 డిసెంబరు 31న పనామా దేశం అధీనంలోకి వెళ్ళిపోయింది. అలనాటి పరిణామాన్ని ఇప్పుడు ట్రంప్ చారిత్రక తప్పిదంగా అభివర్ణిస్తున్నారు. మిత్రదేశానికి తమ దేశం ఎంతో విలువైన ఈ కాలువను మూర్ఖంగా ఇచ్చేసిందనీ, దీనిని తీసుకున్నవారు బాధ్యతతో, నిబద్ధతతో వ్యవహరించనిపక్షంలో తన కొత్త యంత్రాంగం వెనక్కుతీసుకొనే పని మొదలుపెడుతుందని అంటున్నారు ఆయన. ఆ కాలువ వాడకానికి చెల్లించాల్సిన రుసుమును ఒక పద్ధతి ప్రకారం నిర్ణయిస్తామనీ, కాలువను తిరిగి ఇచ్చేయడం జరగనిపని అంటూ పనామా అధ్యక్షుడు ఘాటుగానే స్పందించారు. చైనా అధీనంలో ఈ కాలువ ఉన్నదన్న రీతిలో ట్రంప్ నర్మగర్భంగా చేసిన వ్యాఖ్యలు అర్థంలేనివి. ఎంతోకాలంగా ఈ కాలువ సింగపూర్ సంస్థ నిర్వహణలో ఉండటంతో, అమెరికా వాణిజ్యనౌకలకు మాత్రమే అధిక రుసుముల కష్టాలు వచ్చినట్టుగా ఆయన చిత్రీకరిస్తున్నారు. కెనడానుంచి, నార్వేనుంచి ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలు, రాయితీలూ పొందడానికి ట్రంప్ ఈ తరహా ఒత్తిడి వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతూనే ఉంది. దేశభద్రత పేరిట చివరకు మంచుద్వీపాన్ని కూడా ఆయన రాజకీయం చేస్తున్నారు.

అల్లావుద్దీన్ ఖాన్ అనశ్వర సప్తస్వరాలు

అదొక అపురూపమైన రసానుభూతి. గొప్పదనం సమక్షంలో ఉన్నానని నాకు నేను ప్రప్రథమంగా తెలుసుకున్న సందర్భమది. యాభై హేమంతాల క్రితం (1974లో) న్యూఢిల్లీలోని మోడరన్ స్కూల్‌లో ఒక షామియానా కింద ఆసీనులమయి వున్నాము. నేను కళాశాల విద్యాభ్యాసంలోకి ప్రవేశించిన తొలి సంవత్సరమది. నా స్నేహితులు కొంతమంది మోడరన్ స్కూల్‌లో జరగనున్న సంగీత సభకు నన్ను తీసుకువెళ్లారు. అలీ అక్బర్ ఖాన్ సరోద్‌పై లయాన్విత సరిగమలను, రవి శంకర్ సితార్‌పై సుకుమార రాగాలను, అల్లా రఖాఖాన్ తబలాపై మనసు, తనువును పులకరింప చేసిన శబ్దరావాలను ఆ కచేరిలో వినిపించారు. దశాబ్దాలు గడిచిపోయినందున ఆ సంగీత మాంత్రికులలో ఎవరు ఏ రాగాలను వాయించిందీ గుర్తుచేసుకోలేక పోతున్నాను. అయితే పరిసరాలను విస్మరింపచేసిన ఆ వాద్య ధ్వనులు నన్ను సంపూర్ణంగా మంత్రముగ్ధుని చేశాయన్నది నాకు ఇంకా ఒక పచ్చని జ్ఞాపకంగా ఉన్నది. అలీ అక్బర్ ఖాన్, రవి శంకర్ ఇరువురికీ గురువు అయిన అల్లావుద్దీన్ ఖాన్ స్మృత్యర్థం ఆ సంగీత సభను నిర్వహించారు.



■ రామచంద్ర గుహ


గతానుగతం

యాభై సంవత్సరాల క్రితం న్యూఢిల్లీ మోడరన్ స్కూల్‌లో నా సంగీతాసక్తులను పూర్తిగా మార్చి వేసిన ఆ రాత్రి, కొద్ది రోజుల క్రితం అన్నపూర్ణాదేవి సుర్ బహార్‌పై అద్భుతంగా వాయించిన మంజ్ ఖమాజ్ రాగం రికార్డింగ్‌ను వింటున్నప్పుడు, మళ్లీ జ్ఞాపకమొచ్చింది. ఆ రాగాన్ని ఇంతకు ముందు ఎన్నోసార్లు విన్నాను. అయితే ఇప్పుడు అది ఎలాగో మన మహోజ్వల సంగీత వారసత్వం, ప్రత్యేకించి ఒక నిర్దిష్ట ఘరానా (మైహర్) గురించి ప్రగాఢంగా ఆలోచింపచేసింది.

అలీ అక్బర్ ఖాన్ తోబుట్టువు, రవి శంకర్ మొదటి భార్య అన్నపూర్ణాదేవి. తండ్రి అల్లావుద్దీన్ ఖాన్ వద్దే ఆమె సంగీత శిక్షణ పొందారు. ఆమె ఎంచుకున్న, ఆమెకు బాగా ఇష్టమైన వాద్య పరికరం సుర్ బహర్. అయితే ఈ ప్రతిభావంతురాలి సంగీత జీవితం సాఫీగా సాగిపోలేదు. వివాహ జీవితంలో వైపరీత్యాలు ఆమెను ఏకాంతవాసానికి గురిచేశాయి. అయితే ఆమె సంగీత వైదుష్యం పలువురు గొప్ప సంగీతకారులను సృష్టించింది. వేణుగాన విద్వాంసుడు హరిప్రసాద్ చౌరాసియా వారిలో ఒకరు. (అన్నపూర్ణ జీవితం, సంగీత వైదుష్యం, వారసత్వంపై నిర్మల్ చందర్ ఇటీవల ఎ–6 ఆకాశ్ గంగ అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను రూపొందించారు).

అన్నపూర్ణ సంగీతాన్ని వింటూ 1974లో ఆ రాత్రి అలీ అక్బర్ ఖాన్, రవి శంకర్‌ల సరోద్, సితార్ వాద్యాల గురించిన ఆలోచనలు అల్లావుద్దీన్ ఖాన్‌పై వేద్ మెహతా రాసిన వ్యాసాన్ని మళ్లీ చదివేందుకు నన్ను పురిగొల్పాయి. అల్లావుద్దీన్ ఖాన్‌ను పలుమార్లు స్వయంగా చేసిన ఇంటర్వ్యూల ఆధారంగా వేద్ ఆ వ్యాసాన్ని రాశారు. ఆసక్తికరంగా ఉన్న వేద్ కథనంలో కల్పన ఎక్కడ ముగిసిందో, వాస్తవం ఎక్కడ ప్రారంభమయిందో చెప్పడం కష్టం. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉన్న ఒక మూర్ఖాల గ్రామం నుంచి అల్లావుద్దీన్ జీవన ప్రస్థానం ప్రారంభమయిందని వేద్ వివరించారు. తనకు సంగీతాన్ని నేర్పగల గురువులను అన్వేషిస్తూ కలకత్తాకు వచ్చిన అల్లావుద్దీన్ ఎంతటి కష్టనష్టాలు ఎదురైనా ఓర్పుగా భరిస్తూ, ఎదుర్కొంటూ కఠిన, గంభీర గురువుల వద్దకు చేరగలిగారు. ఆయన తన స్వతస్సిద్ధ సంగీత ప్రతిభను గురువుల శుశ్రూషతో పరిపూర్ణం చేసుకున్నారు. ఈ సంగీత జిజ్ఞాసువు, ఆనాటి సుప్రసిద్ధ సంగీతకారుడు వహీద్ ఖాన్ బీన్‌కార్ వద్ద శిక్షణ పొందడానికి రాంపూర్ వెళ్లారు. బీన్‌కార్ దయతలచలేదు. ఆయనను ఎలాగైనా ప్రసన్నం చేసుకునేందుకు అల్లావుద్దీన్ శతథా ప్రయత్నించారు. ఫలితం లేకపోయింది. విసిగి పోయిన అల్లావుద్దీన్ ఒక రోజు రాంపూర్ నవాబుకు తన గోడు చెప్పుకున్నాడు. నవాబు సూచన మేరకు గర్విష్టి అయి వహీద్ ఖాన్ తన శిష్యుడిగా అల్లావుద్దీన్‌ను స్వీకరించాడు.





బాబాగా ప్రేమాస్పదుడు అయిన ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ (1862–1972) ఇరవయ్యో శతాబ్ది ప్రముఖ సంగీత ఉపాధ్యాయులలో ఒకరు. ఆయన సంగీత విద్యా కుటుంబం విస్తృతమైనది. అందులో పండిట్ రవి శంకర్, పన్నాలాల్ ఘోష్, నిఖిల్ బెనర్జీ మొదలయిన వారితో పాటు తనయుడు అలీఅక్బర్ ఖాన్, తనయ అన్నపూర్ణాదేవి కూడా ఉన్నారు. వీరితో పాటు ఇంకా ఎందరో బాబా శిష్యులు హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ధ్రువతారలుగా వెలుగొందుతున్నారు.

అల్లావుద్దీన్ ఆ తరువాత మధ్య భారతంలోని మైహర్ అనే చిన్న సంస్థానానికి వెళ్లి. లోకోత్తర సంగీతాన్ని సృష్టిస్తూ ప్రతిభావంతులైన శిష్యులను అద్వితీయ సంగీతకారులుగా తీర్చిదిద్దుతూ జీవితాంతం అక్కడే ఉండిపోయారు. ఆయన శిష్యులలో, ఇప్పటికే ప్రస్తావితమైనవారే కాకుండా సితార్ విద్వాంసుడు నిఖిల్ బెనర్జీ, వేణుగాన విద్వాంసుడు పన్నాలాల్ ఘోష్ తదితరులు ఉన్నారు. అన్నట్టు ఏమంత ప్రతిభావంతుడు కానప్పటికీ మైహర్ మహారాజా కూడా అల్లావుద్దీన్ శిష్యగణంలో ఒకరు. సంగీత బోధన చేయని సమయాలలో అల్లావుద్దీన్ నమాజ్ చేసేవారు. మతాచారం ప్రకారం రోజుకు ఐదుసార్లు నమాజ్ చేసేవారు. అంతేకాకుండా మైహర్ పట్టణంలోని హిందూ దేవాలయంలో నిత్యం పూజలు, ప్రార్థనలు చేస్తుండేవారు. క్రమంగా మైహర్‌లోను, సంగీతలోకంలోను ఆయన 'బాబా' (బెంగాలీలో తండ్రి, హిందుస్థానీలో గౌరవనీయ వృద్ధ విజ్ఞాని అని అర్థం)గా సుప్రసిద్ధమయ్యారు.

వేద్ మెహతా వ్యాసం (ఇది 1970లో ప్రచురితమైన ఆయన 'పోర్ట్రైట్ ఆఫ్ ఇండియా' పుస్తకంలో ఉంది) తరువాత అల్లావుద్దీన్ ఖాన్ జీవితం, సంగీతంపై ఇటీవల వెలువడిన అంజనా రాయ్, సహనగుప్తా పుస్తకాలు చదివాను. బాబా సంగీతం గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు మెహతా వ్యాసం కంటే ఈ పుస్తకాలు ఎక్కువగా ఉపకరించాయి. అల్లావుద్దీన్ వైయక్తిక, వృత్తిగత ప్రస్థానాలు, పలు విభిన్న సంగీత వాద్యాలను వాయించడంలో ఆయనకు ఉన్న అసమాన అధికారం, భారతీయ సంగీతానికి ఆర్కెస్ట్రా, పలు కొత్త జోడ్ రాగాలను సృష్టించడంలో ఆయన అసమాన కృషిని లోతుగా సమగ్రంగా ఈ పుస్తకాలు వివరించాయి. ఇరువురి కథనాలు పలుచోట్ల ఆరాధనాపూర్వకంగా ఉన్నప్పటికీ బోధనకు సంబంధించి బాబా సిద్ధాంతాన్ని ఏ ఒక్కరూ ప్రస్తావించలేదు. వేద్ మెహతా ప్రకారం 'బోధనలో బాదడం అంతర్భాగమే కాకుండా అనివార్యం' అనేది బాబా సిద్ధాంతం! ఇది యథార్థమేనని నా బెంగాలీ స్నేహితులు ధ్రువీకరించారు, మైహర్ మహారాజా సైతం గురువు గారి అసహనం ఫలితంగా దేహశుద్ధికి గురయ్యారనే ఐతిహ్యం ఒకటి ఉన్నది మరి.

అల్లావుద్దీన్ ఖాన్ వ్యక్తిత్వంలోని ఈ లక్షణం ఈ తరం వారికి సహజంగానే నచ్చకపోవచ్చు. సహన గుప్తా పుస్తకానికి అన్నపూర్ణాదేవి రాసిన ముందు మాటలోని ముగింపు మాటలు నాకు ఎంతో సాంత్వననిచ్చాయి (అన్నపూర్ణాదేవి తన తండ్రి గురించి ఆంగ్లంలో రాసింది ఈ ముందు మాట ఒక్కటే కావచ్చు). ఆమె ఇలా రాశారు: 'బాబా తన జీవితంలో నాలుగు దశాబ్దాలకు పైగా మైహర్‌లో గడిపారు. భగవదత్తమైన తన సంగీతాన్ని ఇతరులకు వినిపించారు, శిష్యులకు బోధించారు. ఇరవయో శతాబ్ది మహోన్నత సంగీత వాద్యకారులలో పలువురు ఆయన శిష్యులే. అలీఅక్బర్ ఖాన్, రవి శంకర్, పన్నాలాల్ ఘోష్, నిఖిల్ బెనర్జీ తదితరులను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు ఆమె తన పేరును ఆ జాబితాలో చేర్చలేదు. లలితకళాభిజ్ఞురాలుగా సుర్ బహర్ వాయిద్యంలో అద్వితీయ ప్రతిభాశాలిగా భారతీయ సంగీత జగత్తులో అన్నపూర్ణ సుప్రసిద్ధురాలు. ఆమె ముందు మాటలోని చివరి వాక్యం నా మనసులో నిలిచిపోయింది: 'అన్నిటికీ మించి బాబా, నాకు తెలిసిన వారందరిలోను బహుశా పరిపూర్ణ లౌకికవాది'. అంజనారాయ్ కూడా ఇదే విధంగా రాశారు: అల్లావుద్దీన్ ఖాన్ సంకుచిత స్వభావుడు కాదు. మతాభినివేశ జాతీయవాది కాదు. ఆయన దేశభక్తి ప్రపూర్ణుడు. ఒక విశాల ప్రపంచ దృక్పథంలో మిళితమైన దేశభక్తి ఆయనది... హిందువులు ముస్లింల మధ్య సంపూర్ణ సమైక్యతను ఆయన ఆకాంక్షించారు. సకల మతాలు, విశ్వాసాల సమ్మేళనాన్ని ఆయన ఆశించారు'.

నేను సంగీత విద్వాంసుడిని కాను, సంగీత గుణగ్రహణ పారీణుడిని కాను, కేవలం ఔత్సాహిక శ్రోతను మాత్రమే. ఆ స్ఫూర్తితోనే ఈ కాలమ్ రాశాను. అదే స్ఫూర్తితో అల్లావుద్దీన్ సంగీత విద్యా కుటుంబంలోని వారి సంగీత కృతులలో వ్యక్తిగతంగా నాకు ఇష్టమైన వాటిని ప్రస్తావించదలుచుకున్నాను. అవి: ఇంతకు ముందే ప్రస్తావించిన అన్నపూర్ణాదేవి మంజ్ ఖమాజ్‌తో పాటు రవి శంకర్ పహాడి ఝింఝోతి; అలీ అక్బర్ ఖాన్ ఛాయానత్; నిఖిల్ బెనర్జీ రాగేశ్వరి, పన్నాలాల్ ఘోష్ హంసధ్వని, బహదూర్ ఖాన్ నట్ బిల్వాల్. సంగీత విశ్వంలో అల్లావుద్దీన్ ఖాన్ ఒక ధ్రువతార. ఆయన సంగీతం అజరామరమైనది అనేది ఎన్నటికీ ఎవరూ కొట్టివేయలేని సత్యం.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

చరిత్ర మరచిపోని మంచిమనిషి

పాతిక సంవత్సరాల నాటి మాట. 1999లో డాక్టర్ మన్మోహన్ సింగ్ దక్షిణ ఢిల్లీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేశారు (లోక్‌సభకు ఆయన పోటీ చేయడం అదే మొదటిసారి, అదే చివరిసారి). ఆ ఎన్నికలలో ఆయన ఓడిపోయారు. అప్పుడు నేను ఎన్‌డీ టీవీలో పనిచేస్తున్నాను. 'ఫాలో ది లీడర్' అనే ఒక ఎన్నికల కార్యక్రమాన్ని మేము నిర్వహిస్తున్నాం. ఎన్నికలలో పోటీ చేస్తున్న ఒక నాయకుడి ప్రచారంలో ఒకరోజు పాటు ఆయన వెన్నంటి ఉండి వార్తా నివేదన చేయడం ఆ కార్యక్రమం ప్రత్యేకత. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రచార సరళిని కవర్ చేసే బాధ్యతను నాకు అప్పగించారు. నియోజకవర్గం పర్యటనలో మన్మోహన్ వెంట ఉండి మా కార్యక్రమానికి అవసరమైన సమాచారాన్ని సమకూర్చాలి. చెప్పినంత తేలిక కాదు ఈ పని. ఎందుకంటే ఆయన బిడియస్తుడు. పది మందిలో ఉండలేరు. టీవీ కెమెరాల ముందుకు రావడానికి సంకోచిస్తారు. మేము ఆ రోజు మొదటి సగాన్ని ఆయన గృహంలోనే గడిపాము ఆయనతో కలిసి ఉదయం ఉపాహారం తీసుకున్నాం. ఆ తరువాత ఆయన విస్తృత గ్రంథాలయంలో మాటా మంతీ జరిపాము. ఆ తరువాత మన్మోహన్ తన నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లినప్పుడు ఆయన వెంట వెళ్లాం. అక్కడ గుంపుల మధ్య ఉండవలసిరావడంతో ఆయన చాలా ఇబ్బందిపడ్డారు. తోపులాటలు, నెట్టుకోవడాలు ఆయనకు సుతరామూ నచ్చవు. అయినా ఆయన ఓపిక వహించారు.

మంచి రోజులలోను, కష్టాలు చుట్టుముట్టిన రోజులలోను హుందాతనం కోల్పోకుండా మెలగడం ఎలా అన్నది మన్మోహన్ జీవితం నుంచి మనం నేర్చుకోవలిసిన పాఠం. ప్రజా జీవిత ఒత్తిళ్లు తన స్థితప్రజ్ఞతను ప్రభావితం చేసేందుకు ఆయన ఎన్నడూ అనుమతించలేదు. విప్లవాత్మక కొత్త పుంతలు తొక్కిన భారత ఆర్థిక మంత్రి ఆయన. ప్రధానమంత్రిగా కీలక ఇండో–అమెరికా అణు ఒప్పందానికి ఆయనే ప్రధాన కారకుడు అయ్యారు. అయితే ఇందుకు ఆయన గానీ, ఆయన కుటుంబ సభ్యులుగానీ ఎటువంటి ప్రచారాన్నీ కోరుకోలేదు ఒక టీవీ షోలో భాగంగా 'సింగ్ ఈజ్ కింగ్' అనే పాటను ప్రసారం చేశాం. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి మాకు ఫోన్ వచ్చింది. అంత ఉల్లాస స్థితిని మరోసారి చూపించకుండా నివారించడం మంచిదని సూచించారు. మరో సందర్భంలో మన్మోహన్‌ను 'ఇండియన్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపిక చేశాం. ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో నిర్వహించదలిచిన ఆ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి రావడానికి నిరాకరిస్తూ దానిని తన ఇంటి వద్దనే స్వీకరించేందుకు ఆయన సంకోచిస్తూ అంగీకరించారు. 'నాకంటే ఎన్నో గొప్ప విజయాలు సాధించినవారు మరెందరో ఉన్నారని' ఆయన వినమ్రంగా ప్రతిస్పందించారు.

స్వీయ ఉన్నతికి స్వీయ ప్రచారం చేసుకోవడమే నిపుణ రాజకీయ వ్యూహంగా పరిగణన పొందుతున్న ఈ కాలంలో ఎటువంటి పటాటోపాలు లేని మన్మోహన్ సింగ్ పాతకాలం నాయకుల సత్సంప్రదాయాలకు ప్రతినిధిగా కనిపిస్తారనడం సత్యదూరం కాదు. జాతి శ్రేయస్సుకు మౌనంగా పనిచేసిన ఉదాత్త నాయకుడు ఆయన. మన్మోహన్ తన వృత్తి జీవితంలో మొదటి నుంచీ నమ్మలేని రీతిలో నిర్దిష్ట పని గంటలకు మించి ఎక్కువగా పనిచేయడం అలవరచుకున్న వ్యక్తి. జీవితంలో చాలా కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చినందున పనిపట్ల అతి నిష్ఠ, స్వీయ క్రమశిక్షణను తన విధి నిర్వహణలో అంతర్భాగం చేసుకున్నారు. ఆయనతో నా చివరి వ్యక్తిగత సమావేశాలలో ఒకసారి దేశ విభజన బీభత్సాల నుంచి తమ కుటుంబం ఎలా తప్పించుకున్నదీ వివరించారు. పేదరికంలో తాను పెరిగిన తీరు, ఉపకార వేతనాల ఆధారంగా విద్యాభ్యాసం చేయడం, విద్య ఆసరాతో ఉన్నత స్థాయికి ఎదగడం గురించి చెప్పారు. అప్పుడు ఆయన కొంచెం భావోద్వేగానికి లోనవడాన్ని గమనించాను. ఆయనలో అటువంటి భావోద్వేగ ధోరణి చాలా అరుదు. ఈ విషయాన్ని ఆయన భార్య కూడా గమనించినట్టున్నారు. వెంటనే మేమున్న గదిలోకి వచ్చి 'బస్ కరో, టీ తీసుకుందాం రండి' అని దృఢ స్వరంతో అన్నారు. ఇంట శ్రీమతి మన్మోహనే బిగ్‌బాస్ అనేది స్పష్టం.



యూపీఏ రెండో ప్రభుత్వం వేసిన ప్రతి తప్పటడుగుకు నిందలు భరించడానికి బదులు ప్రధానమంత్రి పదవి నుంచి మన్మోహన్ నిష్క్రమించి ఉండవలసింది. ఆయన మంత్రిమండలి సభ్యులపై పోటెత్తిన అవినీతి ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చాయి. అయినప్పటికీ చరిత్ర ఆయనపై తన తీర్పును చాలా అభిమానపూర్వకంగా ఇచ్చి తీరుతుంది, సందేహం లేదు.

తన తొలి సంవత్సరాల గురించి ఆయన భావోద్వేగంతో వివరిస్తున్నప్పుడు సువ్యక్తమవుతున్న ఆకాంక్షా భరిత, ప్రతిభాపాటవాలే చోదక శక్తిగా ప్రభవిస్తున్న 'నవ' భారత కథకు ఆయనే పూర్వగామి అన్న వాస్తవం నాకు స్ఫురించింది, ఆశ్చర్య పరిచింది. ఈ నూతన భారతదేశం ఆవిర్భవించేందుకు అద్వితీయంగా దోహదం చేసింది ఆయనే అన్న వాస్తవాన్ని చరిత్ర విస్మరించదు మన్మోహన్ యవ్వన కాలంలోని భారత దేశంలో కులీన విద్యాధిక వర్గాలకు వెలుపలి వారికి అవకాశాలు తక్కువగా ఉండేవి. చదువులో ప్రశస్తంగా ఉండడమే ఆనాటి వారికి సమాజంలో, ఎదుగుదలకు ఒక ప్రధాన మార్గంగా ఉండేది. డాక్టర్ మన్మోహన్ సింగ్ 'యాదృచ్ఛిక' ప్రధానమంత్రి కావచ్చు కాని ఆయన ఒక మెరిటోక్రాట్ (ప్రతిభా సంపన్నతతో ఎదిగిన వ్యక్తి). ఇది, మనం పొరపాటుపడడానికి వీలులేని ఒక నిశ్చిత సత్యం. తనకు లభించిన ప్రతి పరిమిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదిగారు. యువ మన్మోహన్ నాటి భారతదేశానికి 1991 అనంతర భారతదేశానికి మధ్య ఎంత వ్యత్యాసమున్నదో మనం విస్మరించకూడదు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా తన సాహసోపేత విధానాలతో తీర్చిదిద్దిన నేటి భారతదేశంలో ఎదుగుదలకు అనూహ్యమైన అవకాశాలు లభిస్తున్నాయి.

మన్మోహన్ మృదుభాషి. సొంత గొప్పలు చెప్పుకునే వ్యక్తి కాదు. ఎటువంటి పరిస్థితులలోను నిండు ఆత్మవిశ్వాసంతో వ్యవహరించే వ్యక్తి. ఈ కారణంగానే ఎటువంటి అహమికలు, దురహంకారం, వ్యక్తి ఆరాధనా ఉన్మాదానికి లోనుకాకుండా అత్యున్నతస్థాయి అధికార పదవుల ఒత్తిళ్లను నిబ్బరంగా తట్టుకుంటూ సమర్థంగా తన బాధ్యతలను నిర్వర్తించగలిగారు. తన రాజకీయ పరిమితులు ఏమిటో ఆయనకు బాగా తెలుసు. ఆ పరిధులలోనే ఆయన పనిచేశారు. సదా జాతి నిర్మాణ లక్ష్యాలకు ప్రాధాన్యమిచ్చి వాటికి కట్టుబడ్డారు. అణు ఒప్పందం లాంటి అనివార్యమైన కఠిన నిర్ణయాలను తీసుకోవలసివచ్చినప్పుడు ఆదేశించడం కాకుండా చర్చలు, ఏకాభిప్రాయ సాధనతో తీసుకున్నారు.

2009లో తన గుండె ఆరోగ్యం సజావుగా లేదని వెల్లడయినప్పుడే ఆయన రాజకీయ జీవితం నుంచి నిష్క్రమించి ఉండవలసిందేమో? ఆనాటి నుంచే ఆయన ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమయింది. సంకీర్ణ రాజకీయాల ఒత్తిళ్లు పెరగసాగాయి. యూపీఏ రెండో ప్రభుత్వం వేసిన ప్రతి తప్పటడుగుకు నిందలు భరించడానికి బదులు ప్రధానమంత్రి పదవి నుంచి నిష్క్రమించి ఉండవలసింది. ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు వచ్చినప్పటికీ మన్మోహన్ వ్యక్తిగత నిజాయితీని, చిత్తశుద్ధిని ఎవరూ అనుమానించలేదు. అయితే ఆయన మంత్రిమండలి సభ్యులపై పోటెత్తిన అవినీతి ఆరోపణలు యూపీఏ రెండో ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చాయి. అయినప్పటికీ చరిత్ర ఆయనపై తన తీర్పును చాలా అభిమానపూర్వకంగా ఇచ్చి తీరుతుంది, సందేహం లేదు. 1991లో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలతో ఒక తరం రూపుదిద్దుకున్నది, లక్షలాది కుటుంబాలు పేదరికం నుంచి బయటపడ్డాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది. జాతి పురోగతికి ఇంతగా దోహదం చేసినప్పటికీ మన్మోహన్ తన స్వతస్సిద్ధ స్వభావానికి అనుగుణంగా ఈ పురోగతి వైయక్తిక ప్రయత్నం వల్ల కాకుండా ఒక సమష్టి కృషి ద్వారా మాత్రమే సాధ్యమయిందని వినమ్రంగా చెప్పుతారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

ఒక పాత్రికేయుడుగా మరొక ప్రత్యేక కారణానికి మన్మోహన్‌ను ప్రేమగా గుర్తు చేసుకుంటాను. ఆయన ప్రభుత్వాన్ని మేము తరచు తీవ్రంగా విమర్శిస్తుండేవాళ్లం. అయినా మన్మోహన్ గానీ, ప్రధాన మంత్రి కార్యాలయంలోని ఆయన అధికారులుగానీ ఒక్కరు కూడా ఎన్నడూ నాకు ఫోన్ చేసి మందలించడమనేది జరగనేలేదు. 2జి స్పెక్ట్రమ్ వేలం నిర్వహణలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును నేను తీవ్రంగా విమర్శించాను. ఆ తరువాత మన్మోహన్‌ను నేను ఒక అధికారిక కార్యక్రమంలో కలుసుకున్నాను. నన్ను చూడగానే నవ్వుతూ 'నీ కాలమ్‌ను చదివాను. కొన్ని ముఖ్యమైన అంశాలను మీరు లేవనెత్తారు.' అని ఆయన అన్నారు. ఇతర నాయకులలో ఎంత మంది అటువంటి సౌహార్దభావంతో విమర్శలకు ప్రతిస్పందిస్తారు?


ఒక తుది జ్ఞాపకం. 2004 సార్వత్రక ఎన్నికలలో దిగ్భ్రాంతికరమైన ప్రజా తీర్పు అందరినీ ఆశ్చర్యపరిచింది. తదుపరి ప్రధానమంత్రి ఎవరు అవుతారనే విషయమై ఉత్తేజిత, వ్యాకులిత ఊహాగానాలు జరిగాయి. ఆ సందర్భంలో నేను సర్ డేవిడ్ బట్లర్‌తో ఒక తేనీటి విందులో పాల్గొన్నాను. సర్ డేవిడ్ సెఫాలజీ (ఓటింగ్ విధానంపై జరిపే విశ్లేషణ)కి మౌలిక గురుగా పేరు పొందారు. మన్మోహన్ సింగ్ ఆయనకు సుపరిచితుడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఇరువురూ సమకాలికులు. 'రాజ్‌దీప్, నీకు తెలుసా? ప్రధానమంత్రి ఎవరు అవుతారన్న ప్రశ్నకు నా వద్ద సమాధానమున్నది. సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహించేందుకు అన్ని విధాల యోగ్యుడైన వ్యక్తి ఒకరు నాకు తెలుసు' మన్మోహన్ సింగ్ పేరును సర్ డేవిడ్ ప్రస్తావించగా ఎందుకు ఆయన్ని ప్రతిపాదిస్తున్నారని ప్రశ్నించాను. 'భారత్‌కు అత్యున్నత స్థాయిలో ఒక మంచి మనిషి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉన్నది. స్వప్రయోజనాలు, సొంత పార్టీ ప్రయోజనాల కంటే జాతి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చే మన్మోహన్ సింగ్ అటువంటి ఉత్తమ నాయకుడు' అని సెఫాలజీ గురు సమాధానమిచ్చాడు. అవును, మంచి నడవడి అనేది ఘోరంగా నిరాదరణకు గురవుతున్న నాయకత్వ విలువ అయిపోయింది. సచ్ఛీలవర్తనను తక్కువ అంచనా వేస్తే ఎలా? డాక్టర్ మన్మోహన్ సింగ్ నిజాయితీ ఉన్న నాయకుడు. ప్రజా జీవితంలో మూర్తీభవించిన సభ్యత, మంచితనంకు ఆయన ఒక ఉత్కృష్ట ప్రతీక. ప్రజా జీవితంలో ఉండవలసిన, ఉండదగిన నాయకుడుగా మన్మోహన్‌ను ముందుగా చెప్పి తీరాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కన్నభిరాన్ సార్‌ను మరచిపోగలమా!

సమాజంలో సంక్లిష్ట పరిస్థితి, సంక్షోభం నెలకొన్నప్పుడు, ప్రభుత్వం బాధ్యతారహితంగా నడుచుకుంటున్నప్పుడు, అయ్యో ఇట్లా అవుతోందే అని మనం అనుకున్న ప్రతి సందర్భంలోనూ ప్రముఖ పౌర హక్కుల నేత, న్యాయవాది కె.జి. కన్నభిరాన్ ఉంటే బాగుండు అని తలచుకుంటూనే ఉన్నాం. సామాజిక హితవు కోరి, అధికారంలో ఉన్న ప్రభుత్వాలు, పార్టీలు తమ మాట విన్నా, వినకపోయినా, దేశంలో సంక్లిష్ట పరిస్థితి తలెత్తినప్పుడు తమ బాధ్యతగా పరిస్థితి చక్కబెట్టడానికి జోక్యం చేసుకున్న ప్రజాస్వామిక వాదులైన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, జస్టిస్ వి.ఎం. తార్కుండేల తర్వాత కన్నభిరాన్‌ను పేర్కొనడంలో అతిశయోక్తి లేదేమో.

ప్రజల హక్కుల కోసం గళమెత్తుతూ ప్రభుత్వం అమలుపరుస్తున్న విచ్చలవిడి హింసా విధానాలను, చట్ట వ్యతిరేక పాలనను వ్యతిరేకించడమే కాకుండా, ప్రభుత్వానికి సూచనల రూపంలో ఆయన హితవు పలికిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 1987లో తూర్పుగోదావరి జిల్లా గుర్తేడు అటవీ ప్రాంతంలో పీపుల్స్‌వార్ నక్సలైట్లు జైళ్లలో ఉన్న తమ పార్టీ సభ్యుల విడుదలకై సాంఘిక సంక్షేమ ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్. శంకరన్‌తో పాటు 25 మంది అధికారులను కిడ్నాప్ చేశారు. అప్పుడు పౌర హక్కుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న కన్నభిరాన్‌ను జోక్యం చేసుకోమని ప్రభుత్వం కోరింది. అప్పట్లో ప్రయివేటుగా జరుగుతున్న సంఘటనల్లో హక్కుల సంఘం జోక్యం చేసుకోరాదనే అవగాహన ఉండేది. అయినా పేద ప్రజల అవసరాలు చూసే అధికారి, ఆయన బృందాన్ని కాపాడడం ధర్మంగా సార్ జోక్యం చేసుకున్నారు. కార్యవర్గంలో చర్చ లేకుండా ఎలా జోక్యం చేసుకుంటారని కొందరు సభ్యులు ప్రశ్నించారు. అయినా సార్ ఆ విమర్శకు జవాబు చెప్పి, కొన్ని సందర్భాలలో హక్కుల సంఘం మానవాళి సంక్షేమం కోసం తన పరిధులను దాటి పని చేయవలసి ఉంటుంది అన్నారు. 1993లో కొయ్యూరు కిడ్నాప్ సంఘటనలో ఆదివాసీ ప్రజాప్రతినిధి బాలరాజుతో పాటు, అధికారులు కిడ్నాప్‌కు గురైనప్పుడు, తర్వాత వరంగల్, కరీంనగర్‌లలో జరిగిన కొన్ని కిడ్నాప్ సంఘటనల్లో పౌరహక్కుల సంఘం బాధ్యులు జోక్యం చేసుకుని ఉద్రిక్తతలు తగ్గడానికి కృషి చేశారు. ఇటువంటి పనులు కూడా పౌర హక్కుల సంఘాలు చేపట్టాలనే ఒక సూత్రాన్ని కన్నభిరాన్ సార్ ఏర్పరిచారు. తర్వాత కాలంలో విప్లవ గ్రూప్‌ల సభ్యులు ఒకరినొకరు హతమార్చుకునే విషయంలో జోక్యం చేసుకోవడం సులభతరం అయింది.



1992లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీపుల్స్‌వార్ పార్టీని, నాటి ప్రజాసంఘాలను నిషేధించింది. 1994లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ నిషేధాన్ని ఎత్తివేయాలనే ప్రతిపాదనతో స్వామి అగ్నివేశ్, కాళోజీ నారాయణరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, కన్నభిరాన్‌ల బృందం ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లింది. నిషేధం ఎత్తివేసే విషయం చర్చిస్తూ 'ముఖ్యమంత్రిగారూ మీరు మాంసం అమ్మే వ్యాపారిలా ప్రజాపాలన సాగిస్తున్నారు. దీన్ని చట్టబద్ధ పాలన అంటారా' అని ప్రశ్నించారట. అంతేకాకుండా 'ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని చెపుతున్నారు, ప్రజలలో ఉండి ప్రజల సమస్యలపై పనిచేస్తున్న నక్సలైట్ పార్టీ నిషేధానికి గురై ఉంది, పాలన అంటే ఇదేనా' అని నిలదీశారట. పక్కనే రూంలో ఉన్న నిఘా డీజీ దొరను కూడా సంప్రదించకుండా 'కోపం వద్దు కన్నభిరాన్ గారు, మా ప్రభుత్వం పీపుల్స్‌వార్‌పై నిషేధం ఎత్తివేస్తుంది' అని ఎన్టీఆర్ ప్రకటించారట. కన్నభిరాన్ ఎప్పుడూ ఒక న్యాయ ఆగ్రహాన్ని ప్రదర్శించేవారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రపంచ బ్యాంకు ఆయనకు అప్పులు ఇస్తూ చాలా సంస్కరణలతో కూడిన పరిపాలనా పద్ధతులు అమలుపరచాలని సూచించింది. అక్టోబర్ 2003లో అలిపిరి వద్ద పీపుల్స్‌వార్ పార్టీ చంద్రబాబు నాయుడుపై హత్యాయత్నం చేసింది. ఈ నేపథ్యంలో బాలగోపాల్, కన్నభిరాన్... ప్రపంచ బ్యాంకు ఛైర్మన్‌కు ఒక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సలహాతో పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మార్చిందని, దాని ఫలితంగా ప్రజల వైవిధ్యమైన జీవితాలు, వాళ్ల జీవనోపాధులు ఎలా విధ్వంసానికి గురౌతున్నాయో ఆ లేఖలో రాశారు. అలాగే సామాజిక ఆందోళనలను, నక్సలైట్ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్న బ్యాంకు సలహా గురించి, ఫలితంగా 1629 మంది నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేయడం, దీనికి ప్రతిగా చంద్రబాబుపై అలిపిరిలో నక్సలైట్ల దాడి తదితర అంశాలు ఆ లేఖలో వివరంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రపంచ బ్యాంకు అప్పు అందించకపోతేనే ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని రాశారు.

హింస–ప్రతిహింసల వలయంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, నక్సలైట్ పార్టీలు శాంతి ఏర్పరచడానికి చర్చలు పరిష్కారం అని పౌరస్పందన వేదిక చేసిన ప్రయత్నం మనకు తెలిసిందే. ఈ ప్రయత్నంలో సంస్థ కన్వీనర్‌గా వ్యవహరించిన ఎస్.ఆర్ శంకరన్, ఇతర 12 మంది సభ్యులతో పాటు కన్నభిరాన్ నిర్వహించిన పాత్ర ముఖ్యమైనది.


బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేయడం, సుప్రీం తీర్పులు రాజ్యాంగం పొందుపరచిన న్యాయం, చట్టాల వెలుగులో వెలువడక, విశ్వాసాల ప్రాతిపదికన వెలువడడం మనల్ని కలవరపెడుతోంది. ఈ అన్ని సందర్భాలలోనూ కన్నభిరాన్‌ను మళ్లీ మళ్లీ గుర్తుకు తెచ్చుకుంటూనే ఉంటాం. ఆయనకు మానవహక్కుల సెల్యూట్.

● ఎస్. జీవన్‌కుమార్
మానవ హక్కుల వేదిక

(30 డిసెంబర్ : కన్నభిరాన్ వర్ధంతి)

పూర్వవైభవం దిశగా కాంగ్రెస్

రెండు వందల ఏళ్ళ ఆంగ్లేయుల పాలన నుంచి భారతీయులకు విముక్తి కలిగించిన, ఆధునిక భావాలు కలిగిన పురాతనమైన కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం నేడు. ముంబాయిలో 1885 డిసెంబర్ 28న గోకుల్ దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో ఉమేష్ చందర్ బెనర్జీ అధ్యక్షుడిగా విశ్రాంత బ్రిటిష్ ఇండియన్ సివిల్ సర్వీసెస్ అధికారి అలన్ అక్టేవియన్ హ్యూమ్ (ఏఓ హ్యూమ్) ప్రధాన కార్యదర్శిగా, దేశం నలుమూలల నుంచి వచ్చిన 72 మంది ప్రతినిధులతో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది. 1920లో మహాత్మాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటాన్ని అహింస మార్గంలో ఉధృతం చేసింది. తద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. అధికారంలో ఉన్నా లేకున్నా జాతీయవాద, సామ్యవాద, లౌకికవాద, ప్రజాస్వామ్య భావజాలంతో దేశ సంపదను అందరికీ పంచాలనే లక్ష్యంతో ఇప్పటికీ పనిచేస్తున్న ఏకైక స్వాతంత్ర్యోద్యమ పార్టీ కాంగ్రెస్.



తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఆ తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల వరకు సుస్థిర పాలన చేసింది. ఈ సమయంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా హరిత విప్లవం పేరుతో వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక విప్లవం పేరుతో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేశారు. విజ్ఞాన సమాచార సాంకేతిక విప్లవం పేరుతో దేశ శాస్త్ర విజ్ఞానాన్ని టెలికాం, కంప్యూటర్ పరిజ్ఞానంతో సమాచార సాంకేతిక రంగాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు దోహదపడ్డాయి. దేశంలో గ్రామీణ పేద ప్రజల ఆకలిని తీర్చే 'పనికి ఆహార పథకం' వంటివి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. బ్యాంకుల జాతీయకరణ, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, భూసేకరణ చట్టాలు తెచ్చి పాలనలో అనేక విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అన్నది జగమెరిగిన సత్యం.

సామాజిక న్యాయం చేయడంలో దేశంలోని అన్ని పార్టీలకు ఆదర్శంగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి తొలిసారి దళితుడైన దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిని, అనంతరం అఖిల భారత పార్టీ అధ్యక్షునిగా రెండు పర్యాయాలు అవకాశమిచ్చింది. ఆనాటి నుంచి నేటి వరకు అదే సామాజిక స్పృహతో వ్యవహరిస్తూ నేడు దళితుడైన మల్లికార్జున్ ఖర్గేను అధ్యక్షుడిని చేసి రాజకీయాలపై అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసం కల్పించింది. 140 ఏళ్ళ కాంగ్రెస్ పార్టీకి 71 మంది అధ్యక్షులుగా పనిచేశారు. వీరిలో తెలంగాణ రాష్ట్ర ప్రదాత శ్రీమతి సోనియాగాంధీ 19 ఏళ్ళు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం రాహుల్‌గాంధీతో పాటు ప్రియాంకాగాంధీ కూడా లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించడంతో కాంగ్రెస్ పార్టీకి నూతన జవసత్వాలు వచ్చాయి.

– కోటూరి మానవతారాయ్, టీపీసీసీ అధికార ప్రతినిధి

- నగరానికి ప్రాధాన్యమిస్తూ.. రూ.4,962కోట్లతో పనులకు శ్రీకారం
- ప్రజల కలలను సాకారం చేస్తూ సర్కారు అడుగులు
- భూగర్భ డ్రెయినేజీ, వరంగల్ మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక దృష్టి
- విమానాశ్రయానికి అడ్డంకుల తొలగింపులో ప్రభుత్వం సక్సెస్
- కాళోజీ కళాక్షేత్రం పూర్తి.. మెగా టెక్స్‌టైల్ పార్కుపై ఫోకస్
- మైలారం గుట్టల్లో ఎడ్యుకేషన్ హబ్, చిన్న కాళేశ్వరం పనులు ముమ్మరం
- దేవాదుల ప్రాజెక్టు పూర్తికి రూ.690కోట్లతో ప్రణాళిక



రూ.కోట్లలో నిధులు..
అభివృద్ధిపై ఆశలు..

సుదీర్ఘకాలం తరువాత ఓరుగల్లుకు భారీగా కేటాయింపులు

రూ.కోట్లలో నిధులొస్తున్నాయి.. ఓరుగల్లు అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న పెండింగ్ ప్రాజెక్టుల ఫైళ్లు కదులుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఉమ్మడి ఓరుగల్లు.. ముఖ్యంగా వరంగల్ మహానగరంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దాంతో గతం కన్నా ఈ ఏడాది వరాల జల్లు కురిసింది. ఏళ్ల నాటి భూగర్భ డ్రెయినేజీకి మోక్షం కలగ్గా.. మామునూరు విమానాశ్రయానికి అడ్డంకులు తొలగాయి. ఇక 52 ఏళ్ల తరువాత మాస్టర్ ప్లాన్ అమలు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులపై కదిలికలు వచ్చాయి. పదేళ్లకు కాళోజీ కళాక్షేత్రం కార్యరూపం దాల్చింది. ములుగులో గిరిజన యూనివర్సిటీ.. భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్‌కు బీజాలు పడ్డాయి. మరోవైపు చిన్నకాళేశ్వరం పనులు ముమ్మరం కాగా.. సుదీర్ఘకాలంగా పెడింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టుకూ కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.690కోట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. మొత్తంగా 2024 ఉమ్మడి ఓరుగల్లు చరిత్రలో ప్రత్యేక చోటును దక్కించుకుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి నిధులు దక్కగా.. ఇవన్నీ సాకారమైతే జిల్లా స్వరూపమే మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓరుగల్లు నగరం రెండో రాజధాని కావాలని.. కొత్త ఏడాదిలోనూ ఇదే ఒరవడి కొనసాగాలన్న ఆకాంక్ష అందరిలోనూ కనిపిస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలి..

- సివిల్ తగాదాల్లో తలదూర్చకుండా చూసుకోవాలి
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా
- కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వ్యక్తులతోపాటు రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణిచివేయాలని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌జోన్ పోలీస్ అధికారులతో సీపీ శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్‌స్టేషన్లు, డివిజన్‌లు, జోన్‌ల వారీగా పెండింగ్ కేసులకు సంబంధించిన నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై అధికారులను సీపీ అడిగి తెలుసుకున్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులకు సంబంధించిన సమాచారంతోపాటు వాటి పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశాలపై సమీక్ష జరిపారు. నేరాల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలతోపాటు, పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధుల్లో నిజాయితీ ప్రదర్శించాలన్నారు. సివిల్ పంచాయితీల్లో తలదూర్చొద్దని, తప్పుడు కేసులు నమోదు చేయొద్దని హెచ్చరించారు. పోలీసుల అప్రమత్తంగా లేకుంటే శాంతి భద్రతలు అదుపు తప్పుతాయన్నారు. రౌడీషీటర్ల ప్రతీ కదలికను ముందస్తుగానే పసిగట్టి కట్టడి చేయాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏఎస్పీ మనాన్ భట్, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్స్, ఎస్సైలు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సంతాప సూచికంగా మౌనం పాటిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మరణ వార్త ఎంతో కలతకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నాయకులు, కార్యకర్తలు మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థికశాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశాన్ని ప్రగతి వైపు నడిపించాయన్నారు. బహుముఖ సేవలు అందించిన ఆయన దేశ ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, పుల్లా పద్మావతి, వరద రాజేశ్వరరావు, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, కూర వెంకట్, లక్ష్మారెడ్డి, అంకుశ్, డాక్టర్ పులి అనిల్‌కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులతో పాటు జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు చిరస్మరణీయం

మాజీ ప్రధాన మంత్రి సేవలు చిరస్మరణీయమని ఆయన మృతి యావత్ దేశాన్ని ఆవేదనకు గురి చేసిందని టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు.

మన్మోహన్‌సింగ్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియచేస్తూ భగవంతుడు వారికి మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతున్నట్లు శుక్రవారం ఆయన ప్రకటనలో తెలిపారు.

మౌన ముని యాదిలో..

- కేయూతో మన్మోహన్‌సింగ్‌కు అనుబంధం
- కాళోజీ, జయశంకర్‌తో కలిసి వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరు


కేయూ స్నాతకోత్సవంలో కాళోజీ, జయశంకర్ తదితరులతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ (ఫైల్)

కేయూ క్యాంపస్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీతో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 1992లో కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి యూజీసీ ఛైర్మన్ హోదాలో ముఖ్యఅతిథిగా మన్మోహన్ సింగ్ హాజరయ్యారు. డాక్టరేట్‌లు సాధించిన విద్యార్థులకు పట్టాలను అందచేసి అభినందనలు తెలిపారు. అప్పటి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్, ప్రజాకవి, పద్మ భూషణ్ కాళోజీ నారాయణరావు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌తో కలిసి వేదిక పంచుకున్నారు. కాజీపేటలోని అప్పటి ఆర్ఈసీ అతిథి గృహంలో బస చేశారు. వర్సిటీ ప్రొఫెసర్లు లింగయ్య, ప్రొఫెసర్ వడ్డె రవీందర్ మన్మోహన్‌సింగ్‌కు మర్యాదలు చేశారు. వర్సిటీల బలోపేతంపై చర్చించారు. వర్సిటీల స్వయం ప్రతిపత్తితో పాటు జీడీపీలోనూ విద్యారంగానికి అధిక నిధులను కేటాయించాలని చర్చించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాల్సిన అవశ్యకతపై ప్రత్యేకంగా మాట్లా డారు. అప్పట్లో వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జయ శంకర్, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ శంకరయ్యలతో పాటు ఇతర విభాగాల డీన్లు, పరిపాలన అధికారులతో కలిసి గ్రూప్ ఫొటోలలో పాలుపంచుకున్నారు.

కాగా, వర్సిటీతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ప్రత్యేక అనుబంధాన్ని తాజాగా వర్సిటీ ప్రొఫెసర్లు గుర్తు చేసుకున్నారు. అప్పట్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ విద్యార్థులలో స్ఫూర్తి నింపే ప్రసంగం చేశారని అప్పటి విద్యార్థులు, ఇప్పటి ప్రొఫెసర్లు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కాన్వకేషన్ గ్రూప్ ఫొటోలో ప్రొఫెసర్లు వి.భాస్కర్‌రావు, తిరుపతయ్య, విద్యావతి, శివరామకృష్ణ, ఎన్.లింగమూర్తి, జ్యోతిరాణి, పద్మవిభూషణ్ నేరేళ్ల వేణుమాధవ్, లక్ష్మణమూర్తి, పురి లింగయ్య, రవిప్రకాశ్, నర్సింహమూర్తి, మధుసూదన్‌రావు, విజయలక్ష్మి, వెంకట్‌రెడ్డి, ఏపీరావు, శర్మ, పరమేశ్వర్‌రావు తదితరులున్నారు.



ఓరుగల్లులో ఐటీ పరుగులు

హైదరాబాద్ తరువాత వరంగల్‌లోనే ఐటీ అభివృద్ధికి అనుకూలత

- నిట్‌తో పాటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉండడం వరం
- ఏటా 20వేలకు పైగా విద్యార్థులు గ్రాడ్యుయేట్ పూర్తి
- వరంగల్‌లో భూముల ధరలు కూడా తక్కువే..
- ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు వస్తే మరింత ఊపు
- తెలంగాణాస్ బ్లూ ప్రింట్ ఫర్ గ్రోత్ రిపోర్టులో నాస్కామ్ వెల్లడి

7


హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్)

విద్యాశాఖపై 'సమ్మె'ట!

- 22 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలు
- కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో కుంటుపడుతున్న విద్యాబోధన
- మధ్యాహ్న భోజనం, యూడైస్‌కు అవాంతరాలు

6



అమ్మో.. పులులు!

నల్లబెల్లి మండలంలో కలవరం

- పాదముద్రలను నిర్ధారించిన అటవీ అధికారులు
- ఆందోళనకు గురవుతున్న రైతులు, ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు, గ్రామాల్లో దప్పు చాటింపు
- మానుకోట జిల్లా కొత్తగూడ మండలంలోనూ కలకలం

6











పోలీసుల అదుపులో తుపాకీ కలిగి ఉన్న వ్యక్తి

కొలిక్కివచ్చిన విచారణ?

కేసముద్రం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం స్టేషన్ బ్రాందీ షాపు వద్ద ఓ యువకుడు తుపాకీ కలిగిఉన్నట్లు సమాచారం రావడంతో మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సదరు యువకుడితో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు సమాచారం. గతంలో కేసుల్లో ఉన్న వ్యక్తులుగా తెలుస్తోంది. సదరు వ్యక్తులు ముఠాలాగా ఉండడంతో పోలీసులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు విచారణ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. నేడో, రేపో వివరాలను వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం. తుపాకీతో పట్టుబడడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

హెర్బల్ మందు వికటించి మహిళ మృతి

వరంగల్ మెడికల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): హెర్బల్ మందు వికటించి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఎం.యాదలక్ష్మి(40) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజెరువు గ్రామానికి చెందిన యాదలక్ష్మి.. తన భర్తతో విడిపోయి కుమారుడితో కలిసి పుట్టింట్లో నివాసం ఉంటోంది. కొన్నేళ్లుగా మూర్చ వ్యాధితో బాధపడుతున్న ఆమె అలోపతి వైద్యం తీసుకుంటోంది. కాగా, ఈనెల 16న కవిత అనే మహిళ 15 రోజులు హెర్బల్ మందు వాడితే మూర్చ వ్యాధి నయమవుతుందని నమ్మించి, రూ.3వేల ఎలాంటి పేరు లేని హెర్బల్ మందును యాదలక్ష్మికి ఇచ్చింది. ఈ మందులు వాడటంతో మూడు రోజుల్లో తీవ్ర అస్వస్థకు గురై ఈ నెల 19న అపస్మారక స్థితికి చేరుకుంది. యాదలక్ష్మిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఊరు పేరు లేని హెర్బల్ మందు వాడటం వల్లే కిడ్నీ, లివర్ దెబ్బతిని మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరిస్తున్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న మహిళ అరెస్టు

జనగామ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ సీఐ దామోదర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన అక్షింతల సంధ్య 2008 నుంచి హైదరాబాద్‌లో ఉంటోంది. రద్దీగా ఉండే ప్రాంతాలను టార్గెట్ చేస్తూ.. జనాల్లో కలిసిపోయి బంగారు ఆభరణాలు, నగదును దొంగిలిస్తోంది. ఈనెల 26న పెంబర్తి బైపాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో అటుగా వచ్చిన సంధ్య కారును ఆపి తప్పించుకోవడానికి ప్రయత్నించింది. పోలీసులు ఆమెను పట్టుకొని విచారించగా రెండు నెలల క్రితం హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సులో బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును దొంగిలించానని ఒప్పుకోవడం జరిగిందని సీఐ తెలిపారు. సుమారుగా రూ.13లక్షల విలువ గల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించడం జరిగిందన్నారు. గతంలో సంధ్యపై పలు జిల్లాల పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. నిందితురాలిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్, హెడ్ కానిస్టేబుల్ రామన్న, కానిస్టేబుళ్లు కరుణాకర్, మౌనిక, అనిల్ కుమార్‌లను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

కాటారంలో వృద్ధుడి దారుణ హత్య

అంతకుముందు పొలం వద్ద గొడవ పడ్డ ఇరువర్గాలు.. దంపతులకు గాయాలు

ఆవేశంతో వెళ్లి వృద్ధుడిని కర్రతో కొట్టి చంపిన దంపతుల కుమారుడు



ఘటనా స్థలంలో బుచ్చయ్య మృతదేహం

కాటారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా రెండు కుటుంబాల మధ్య కొనసాగుతున్న కొద్దిపాటి భూవివాదం ఒకరిని బలితీసుకుంది. శుక్రవారం పొలం వద్ద ఇరువర్గాలు గొడవపడి దాడులు చేసుకునే వరకు పరిస్థితి దాపురించగా ఓకుటుంబానికి చెందిన వృద్ధుడు హత్యకు గురికాగా, మరో కుటుంబానికి చెందిన ఇద్దరు భార్యభర్తలు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని పశువైద్యశాల సమీపంలో చోటుచేసుకుంది. కాటారం జీపీ పరిధిలోని ఇప్పలగూడానికి చెందిన డోంగిరి బుచ్చయ్య(65) అనే వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. పొలం వద్ద నుంచి మోపెడ్‌పై ఇంటికొస్తున్న క్రమంలో భూ తగాదా నెలకొన్న మరో కుటుంబానికి చెందిన యువకుడు నెగడు కర్రతో దాడిచేసి కొట్టగా కింద పడి తలకు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాటారం సీఐ నాగార్జునరావు, మృతుడి భార్య సారమ్మ, గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం...

కాటారం శివారులోని సర్వే నెంబర్ 501లో గల ఎకరం 10గుంటల భూమి విషయంలో డోంగిరి బుచ్చయ్య కుటుంబానికి, సొదారి లింగయ్యతో పాటు అతడి సోదరుల కుటుంబాలతో గత మూడేళ్లుగా వివాదం నెలకొంది. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినా పరిష్కారం కాలేదు. ఈ వివాదంపై గత మే నెలలో బుచ్చయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సొదారి లింగయ్య, శోభ దంపతులు పొలం వద్దకు వెళ్లగా కొద్దిసేపటి తర్వాత బుచ్చయ్య కుటుంబ సభ్యురాలుతో కలిసి అక్కడికి వెళ్లాడు. ఇరువర్గాలు వాగ్వాదం పెట్టుకుని ఘర్షణపడ్డారు. బుచ్చయ్య, అతడి కుటుంబ సభ్యురాలు పారతో కొట్టడంతో లింగయ్య, శోభ దంపతుల తల, మెడకు గాయాలయ్యాయి. బుచ్చయ్య అక్కడి నుంచి మోపెడ్‌పై వెళ్లిపోయాడు. బుచ్చయ్య పొలం వద్దకు వచ్చి గొడవ పడిన విషయాన్ని లింగయ్య తన కుమారుడు పవన్‌కుమార్‌కు ఫోన్‌లో తెలిపాడు. దీంతో ఆవేశానికి లోనైన పవన్ ఇప్పలగూడెం చేరుకుని మోపెడ్‌పై ఇంటికి వస్తున్న బుచ్చయ్యను అటకాయించి అక్కడే చలిమంట కోసం పెట్టిన నెగడు కర్రను తీసుకుని దాడి చేశాడు. రోడ్డు పక్కన పడిపోయిన బుచ్చయ్యపై కసిదీరా కొట్టడంతో తల పగిలి చనిపోయాడు. పొలం వద్ద గొడవలో గాయాలపాలైన లింగయ్య దంపతులు చికిత్స కోసం ఆ హత్య విషయం తెలుసుకున్న సీఐ నాగార్జునరావు, ఎస్సై-2 శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. కాగా తన భర్తపై సొదారి లింగయ్య, శోభ, పవన్ దాడి చేసి హత్య చేశారని మృతుడి భార్య సారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, విచారణలో పూర్తి విషయాలు తెలుస్తాయని సీఐ నాగార్జునరావు తెలిపారు. కాగా, నిందితుడు పవన్‌కుమార్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఇరువర్గాలు మళ్లీ గొడవ పడకుండా ఇప్పలగూడెంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

సరస్వతి బ్యారేజీలో మూడో విడత జియో ఫిజికల్ టెస్టు



బ్యారేజీలో టెస్టులు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మహదేవపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం మేడిగడ్డ సరస్వతి బ్యారేజీలో సోమవారం నుంచి మూడో విడత ఫిజికల్ టెస్టులు ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారుల ద్వారా సమాచారం తెలిసింది. గత మూడు నెలల క్రితం ఒకటి, రెండో విడత జియో ఫిజికల్ టెస్టులు నిర్వహించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు ఉండడంతో మూడో విడత జియో ఫిజికల్ టెస్టును ఆపేశారు. అయితే ప్రభుత్వం టెస్టులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం నుంచి బ్యారేజీలో మూడో విడత టెస్టులు నిర్వహించనున్నట్లు సమాచారం.

కాగా, టెస్టులు చేసే ప్రదేశంలో ఎక్కువగా ఇసుక పేరుక పోవడంతో ముందుగా ఇసుక తొలగించాలని ఇరిగేషన్ అధికారులు కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం టెస్టులు జరిగే ప్రదేశంలో ఇసుకను తొలగించారు.

వైద్య విద్య పీజీలో రితికకు రెండో ర్యాంకు

వరంగల్ మెడికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పీజీ ప్రవేశ పరీక్షలో దుగ్యాల రితిక రెండో ర్యాంకు సాధించింది. జాతీయ స్థాయి నీట్‌లో 117 ర్యాంకు సాధించింది. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలో రితిక కోరుకున్న కళాశాలలో ఏ విభాగంలోనైనా అడ్మిషన్ పొందే అవకాశం ఉంది. జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దుగ్యాల గోపాలరావు కూతురే రితిక. ఐఎంఏ వైద్యులు రితికను అభినందించారు.

ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటక పోటీలు

వర్ధన్నపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నాటక కళా సమితి 51వ ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటక పోటీలు 2025 ఫిబ్రవరి 22 నుంచి 26వ తేది వరకు మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్నట్లు భారతీయ నాటక కళా సమితి వర్ధన్నపేట శాఖ అధ్యక్షుడు మహ్మద్ అప్సర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనలో పాల్గొనే ఔత్సాహిక కళాకారులు జానపద, పౌరాణిక, దేశభక్తి ప్రదర్శనలు ఇవ్వవలసి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సంస్థ సాంస్కృతిక కార్యదర్శి పెద్దూరి సంజీవరావు సెల్ నంబర్ : 9492642301లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏపీజీవీ బ్యాంకు నాలుగు రోజులు బంద్

విలీనం కారణంగా 28 నుంచి 31 వరకు సేవలు నిలిపివేత

ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీజీవీ బ్యాంకు విభజన కారణంగా ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంకు సేవలు, నగదు లావాదేవీలు ఉండవని, అత్యవసర సేవల కోసం రూ.10వేల వరకు 30, 31వ తేదీల్లో ఆయా శాఖల పరిధిలో తీసుకోవచ్చని బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి ఖాతాదారులకు సూచించారు. శుక్రవారం హనుమకొండలోని ఏపీజీవీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఖాతాదారులు అత్యవసర సమయంలో 30, 31 తేదీల్లో బ్యాంకులు తెరిచి ఉంటాయని అన్నారు. ఖాతాదారులు బ్యాంకులో రూ.10 వేల వరకు నగదు పొందవచ్చని, ఎక్కువ మొత్తమైతే బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీవీ జనరల్ మేనేజర్ ఆపరేషన్ బి.దయాకర్, ఏపీజీవీ జనరల్ మేనేజర్ ఎ.విద్యాధర్, ఏపీజీవీ మేనేజర్ ఎస్.శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేసే వరకు పోరాడతాం

ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు సాను



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు పీవీ.సాను

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా విధానం రద్దు చేసేంత వరకు పోరాడుతామని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జాతీయ అధ్యక్షుడు పీవీ.సాను అన్నారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతారని ఆరోపించారు. బాలికలు విద్యకు దూరమై బాల్యవివాహాలు పెరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో సామాజిక న్యాయం విస్మరించి, మను ధర్మ శాస్త్రం ఎజెండాను అమలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ లాంటి వీరోచిత పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకొని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయ్యాయని, ఆ నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న సంఘం తమదేనన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెను వెంటనే విరమింపచేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో నాయకులు బుర వీరభద్రం, పట్ల మధు, గుగులోతు సూర్యప్రకాష్, గంధసిరి జ్యోతిబసు, దీపిక, సింహాద్రి, రాజేష్, ప్రవీణ్, వినయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పగటి వేషగాళ్లలా పార్టీలు మారుతున్నారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రంగారెడ్డి



మాట్లాడుతున్న రంగారెడ్డి, సభకు హాజరైన వారు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజాయితీలేని వారు, నీతి లేని వారు, నైతిక విలువలు లేనివారు పగటివేషగాళ్లలా పార్టీలు మారి ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఎంపికై అతిపెద్ద వ్యాపార రంగంగా పదవులను మార్చుకొని ప్రజల సంపదను కొల్లగొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా మహాసభల్లో భాగంగా ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద నుంచి బహిరంగసభ వేదిక వారు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రంగారెడ్డి మాట్లాడారు. అసమానతలు లేని సమాజాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజలు గమనించాలన్నారు. నేటికీ దేశంలో 82కోట్ల మందిపేద ప్రజలు రేషన్ కార్డులు ఉన్నాయంటే 75ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి చెందినట్లా అని ప్రశ్నించారు. పాలకుల వైఫల్యాలు, తప్పుడు నిర్ణయాల వల్లనే 82 కోట్ల మంది ప్రజలు పేదరికంలో ఉన్నారని తెలిపారు. మోదీ పాలనలో వ్యవసాయం చేసే వారి శాతం పదేళ్లలో సగానికి పడిపోయిందని, మోదీ తీసుకువచ్చిన నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్లే తీసుకొని పరోక్షంగా అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వంలో దేశంలో 1.80లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే రైతు ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలను పెంచడంతో పాటు, పన్నుల భారం మోపుతూ, కార్పోరేట్ సంస్థలకు ప్రజల ఆస్తులను అమ్ముతున్నారన్నారు.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తే సీపీఎం పార్టీగా ఊరుకోం బిడ్డా అని కేంద్ర మంత్రి అమిత్‌షాను అబ్బాస్ హెచ్చరించారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక అని జమిలి ఎన్నికల విషయం తీసుకువస్తున్న బీజేపీ ప్రభుత్వం ఒకే కులం అనే దమ్ముందా అని ప్రశ్నించారు. జమిలి ఎన్నికలు అనేవి ప్రజాస్వామ్యాన్ని ఆత్మహత్య చేయడమేనని తెలిపారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, అముదాల మల్లారెడ్డి, పుప్పాల శ్రీకాంత్, పిట్టల రవి, రాపర్తి రాజు, యాదగిరి, ఇర్రి అహల్య, సోమయ్య, బూడిద గోపి, కొడెపాక యాకయ్య, సాదం రమేష్, నరేందర్, చందు, భాస్కర్, వెంకటమల్లయ్య, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గిర్మాజిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్- కాజీపేట రైల్వేస్టేషన్‌ల మధ్య దర్గా రైల్వేగేటు సమీపంలో గురువారం రాత్రి సుమారు 45ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఆరు అడుగుల 6 అంగుళాల ఎత్తు, చామన ఛాయ రంగు, కోల ముఖం కలిగి బ్లూ కలర్ ప్యాంటు, తెలుపు రంగు ఫుల్‌షర్టు ధరించి ఉన్నాడని వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. ఎడమ పక్కటెముకలపై పుట్టుమచ్చ మినహా ఏలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహం తల, మొండెం వేరుపడి ఉండటంతో గుర్తు పట్టలేకుండా ఉందని, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, కుటుంబసభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే వరంగల్ జీఆర్పీ ఫోన్ నెంబర్లు 9701747014/ 8712658585లో సంప్రదించాలని సీఐ సూచించారు.

కేయూ పరిధిలో పరీక్షలు 31కి వాయిదా

కేయూ క్యాంపస్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరగాల్సిన పలు పరీక్షలు వాయిదా పడ్డాయి. యూజీ నాన్ ప్రొఫెషనల్ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ తదితర పరీక్షలను ఈనెల 31కి వాయిదా వేసినట్టు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్య ప్రకటించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో వాయిదా పడ్డాయని వెల్లడించారు. ఇతర వివరాలకు వర్సిటీలో కానీ సంబంధిత కళాశాలలో కానీ సంప్రదించాలని పేర్కొన్నారు. పరీక్షల సమయం, పరీక్షల కేంద్రాల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు.

విద్యాశాఖపై 'సమ్మె'ట!

22 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలు

కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో కుంటుపడుతున్న విద్యాబోధన

మధ్యాహ్న భోజనం, యూడైస్‌కు అవాంతరాలు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె పోటుతో విద్యా వ్యవస్థ గాడి తప్పు తోంది. 22 రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,645 మంది సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన బాట పట్టడటంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డీఈవో కార్యాలయాలతో పాటు ఎమ్మార్సీల్లో పనులు అటకెక్కుతున్నాయి. సీఆర్‌టీలు, పీజీసీఆర్టీలు సమ్మెలో పాల్గొంటుండటంతో కేజీబీవీల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. స్పెషల్ ఆఫీసర్లుసైతం సమ్మెలో ఉంటుండటంతో కేజీబీవీల నిర్వహణ నీరుగారిపోతోంది. కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు సమ్మెలో మమేకం కావడంతో యూడైస్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. స్కూళ్ల పర్య వేక్షణ కొరవడుతోంది. ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లు సైతం సమ్మె శంఖారావం పూరించడంతో బడుల్లో కంప్యూటర్, ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ తరగతులు పూర్తిగా నిలిచిపోయాయి. మొత్తంగా సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె విద్యా వ్యవస్థకు శిక్షగా మారింది.

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెబాట విడిచి విధులకు హాజరుకాకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు విద్యాశాఖ యంత్రాంగం సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖాధికారులు జిల్లా విద్యాశాఖ యంత్రాంగాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67 కేజీబీవీలల్లో సుమారుగా 600మంది బోధన సిబ్బంది పనిచేస్తున్నారు. వీరంతా 20 రోజులుగా సమ్మె బాట పట్టారు. కొన్ని కేజీబీవీలల్లో ఇప్పటికీ పదోతరగతి, ఇంటర్ సిలబస్ పూర్తి కాలేదని, రోజుకు ఇద్దరు బోధన సిబ్బంది చొప్పున పాఠశాలలకు వెళుతున్నా ఫలితం లేదని తెలుస్తోంది. పరీక్షలు దగ్గర పడుతున్న వేళ సమ్మె జరుగుతుం డడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

ఎమ్మార్సీల్లో పనులు, మధ్యాహ్న భోజననానికి ఇబ్బందులు

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులైన కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు సమ్మెలో ఉండటంతో పాఠశాలల నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ పనులు ఆగిపోయాయి. డీఈవో కార్యాలయాలకు ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఉత్తర్వులు, ఆదేశాలు ఎమ్మార్సీలకు పంపేందుకు ఆవరోధం ఏర్పడుతోంది. ఇక సీఆర్పీలు సమ్మె బాట పట్టగా.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి కావాల్సిన బియ్యం తెచ్చేందుకు వేలిముద్ర వేసే వారులేక బియ్యం సరఫరా నిలిచిపోయింది. విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజన వివరాలను డీఈవో కార్యాలయానికి చేరవేడయంలో జాప్యం జరుగుతోంది. ఇక ఎప్పటికప్పుడుఆన్‌లైన్‌లో యూడైస్‌ను పర్యవేక్షించాల్సిన ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెలో ఉంటుండటంతో ప్రక్రియకు అవరోధం ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు	
జిల్లా	సమగ్ర శిక్ష ఉద్యోగులు
వరంగల్	473
హనుమకొండ	418
జనగామ	452
మహబూబాబాద్	567
జయశంకర్ భూపాలపల్లి	403
ములుగు	332
మొత్తం	2,645

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆదేశాలు?

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. కేజీబీవీల్లో విద్యా బోధన కుంటుపడటం, మధ్యాహ్న భోజనం, యూడైస్ తదితర సమస్యలతో మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం వరకు సమ్మె విరమించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్టు సమచారం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖ యంత్రాంగం కొంత మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను కేజీబీవీలకు పంపుతుండగా.. సోమవారం నాటికి సమ్మె వీడకపోతే వారి స్థానాల్లో కొత్త వారిని తాత్కాలికంగా నియమించుకునే ప్రయత్నాలు కూడా చేస్తున్నట్టు సమాచారం.

అమ్మో.. పులులు..

- వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో కలవరం
- పాదముద్రలను నిర్ధారించిన అటవీ అధికారులు
- మానుకోట జిల్లా కొత్తగూడ మండలంలోనూ కలకలం



ఓటాయి సమీపంలో పులి పాదముద్ర

నల్లబెల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపులుల సంచారం ఏజెన్సీ మండలాల్లో తీవ్ర కలవరం రేపుతోంది. ఇటీవలి వరకు ములుగు జిల్లాలోని పలు మండలాల్లో పెద్దపులి సంచారం ఆందోళన కలిగించగా.. శుక్రవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో పెద్దపులి సంచారం వార్తలతో మండల ప్రజలు ఉలిక్కిపడ్డారు. మండలంలోని రుద్రగూడెం గ్రామ రైతులు కొందరు శుక్రవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్లగా.. పెద్దపులి పాదముద్రల పోలిన అడుగుల ఆనవాళ్లు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. సమాచారాన్ని అటవీ అధికారులకు తెలపగా.. అక్కడికి చేరుకుని నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్ మాట్లాడుతూ ఆ పాదముద్రలను పెద్దపులివేనని నిర్ధారించారు. కొండాపురం అడవిలో 12-14 సెంటీమీటర్ల ఆడపులి అడుగులు, రుద్రగూడెం శివారులో 15-20 సెంటీమీటర్ల అడుగుల మగ పులి అడుగలను గుర్తించామన్నారు.

ఆడపులి తోడు కోసం మగపులి వచ్చి ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులి రాత్రివేళల్లోనే ఎక్కువ సంచరిస్తుందని, ఈ క్రమంలో రాత్రి వేళల్లో బయట తిరగవద్దన్నారు. పశువులను జాగ్రత్తగా కట్టేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు చేయించాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను కోరారు. పెద్దపులి సంచారాన్ని ఎప్పటికప్పుడు ఫారెస్ట్ శాఖ గమనిస్తూ ప్రజలకు వాస్తవాన్ని తెలియజేస్తామన్నారు. ఆయన వెంట సెక్షన్ అధికారి సోమ్లా, శోభన్, తదితరులున్నారు.



రుద్రగూడెంలో పెద్దపులి పాదముద్రలను చూపిస్తున్న రైతులు

కొత్తగూడ ఏజెన్సీలో భయంభయం

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతం కొత్తగూడ మండలంలో పులి సంచారం కలకలం రేపుతోంది. ఓటాయి, కోనాపురం, సాధిరెడ్డిపల్లి అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తోందని డీఎఫ్‌వో విశాల్, ఎఫ్‌డీవో చంద్రశేఖర్ ఆదేశాల మేరకు కొత్తగూడ ఎఫ్ఆర్వో వజహత్ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు.

ఓటాయి ప్రాంతంలో పులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. పులి సంచరిస్తున్నట్టు భావిస్తున్న ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తామని ఎఫ్ఆర్వో తెలి పారు. ఓటాయి సమీప ప్రజలు పులి సంచారం నేప థ్యంలో ప్రయాణాలు, పనులకు వెళ్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

కేసముద్రం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ఉన్నట్లు చైర్మన్ గంట సంజీవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28, 29 శని, ఆది వారాంతపు, 30న అమావాస్యసందర్భంగా సెలవులు ఉన్నాయని, రైతులు ఈనెల 31న మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తీసుకురావాలని కోరారు.

దేవాదుల పంపింగ్ బంద్

కన్నాయిగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో నీటి పంపింగ్‌ను శుక్రవారం నిలిపివేశారు .గురువారం సాయంత్రం వరకు ఫేజ్-2, 3 నుంచి మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసిన ఇంజినీరింగ్ అధికారులు ఉన్నాతాధికారుల ఆదేశాలతో శుక్రవారం ఉదయం పంపింగ్‌ను నిలిపివేసినట్లు డీఈఈ శరత్‌బాబు తెలిపారు.



రూ.కోట్లలో నిధులు.. అభివృద్ధిపై ఆశలు

- సుదీర్ఘకాలం తరువాత ఓరుగల్లుకు భారీగా కేటాయింపులు
- ప్రజల కలలను సాకారం చేస్తూ సర్కారు అడుగులు
- నగరానికి మరింత ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో పలు ప్రాజెక్టులకు మోక్షం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అభివృద్ధికి 2024లో మరిన్ని అడుగులు పడ్డాయి. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఫలితంగా వరంగల్ నగరంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రెయినేజీకి మోక్షం కలగ్గా.. విమానయానానికి అడ్డుగా ఉన్న నిబంధనలకు బ్రేక్ పడింది. 52ఏళ్ల తరువాత మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చింది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులపై కదిలికలు.. పదేళ్లకు కాళోజీ కళాక్షేత్రం కార్యరూపం దాల్చింది ఈ ఏడాదిలోనే. ములుగులో గిరిజన యూనివర్సిటీ.. భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్‌కు శంకుస్థాపన జరిగింది ఈ ఏడాదే. ఎన్నో అభివృద్ధి పనులకు అడుగులు పడిన 2024ఓరుగల్లు చరిత్రలో చోటు సంపాదించుకుంది.

వరంగల్ భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లు..

వరద భయంతో వణికిపోతున్న వరంగల్ వాసులకు ప్రభుత్వం డిసెంబరులో చేసిన ప్రకటన ఉపశమనాన్నిచ్చింది. నగరంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.4,170కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. 30 ఏళ్లుగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం ఎదురు చూస్తున్న నగరవాసుల కల ఎట్టకేలకు తీరనుంది. గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 24, మే 7వ తేదీన జరిగిన సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత సీఎంగా గత జూన్ 29వ తేదీన వరంగల్ పర్యటనకొచ్చిన ఆయన తన హామీ మేరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై అధికారులతో సమీక్షించారు. సీఎం ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు భూగర్భ డ్రెయినేజీ ప్రాథమిక అంచనాలను రూపొందించటంతో ప్రభుత్వం రూ.4,170కోట్లు విడుదల చేసింది. నవంబరు 19వ తేదీన భూగర్భ డ్రెయినేజీ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు విడతల్లో ఈ పనులు పూర్తి చేయనున్నారు. 1995 నుంచి ఊరిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఈ ఏడాది అడుగులు పడటం పట్ల నగరవాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఎయిర్‌పోర్టుకు తొలగిన అడ్డంకులు

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ సమస్యకు ప్రభుత్వం తెరదించింది. వరంగల్ ఎయిర్‌పోర్టుకు 253ఎకరాల భూసేకరణకు రూ.205కోట్లు కేటాయించింది. దీంతో ఎయిర్‌పోర్టు నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. అలాగే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ పరిధిలో 2,038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలంగా స్పందించి ఎన్‌వోసీ కూడా ఇచ్చింది. దీంతో వరంగల్ ఎయిర్ పోర్టుకు దశాబ్దకాలానికి పైగా 150కి.మీ నిబంధనతో పాటు భూసేకరణే ప్రధాన అడ్డంకిగా ఉండేది. అయితే ఈ రెండు అడ్డంకులు తొలగటతో వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఓరుగల్లువాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అంతేకాకుండా డిసెంబరు 10న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుని వరంగల్ ఎంపీ కడియం కావ్య కలిసి త్వరగా మామునూరు ఎయిర్‌పోర్టు పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేయగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించటంతో ఓరుగల్లువాసుల్లో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి.

2024 కాలచక్రం

వరంగల్ నగరాభివృద్ధిలో కీలకమైన మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయడానికి 52ఏళ్లు పట్టింది. 1972లో తయారు చేసిన మాస్టర్ ప్లాన్ మాత్రమే ఇప్పటికీ అమల్లో ఉంది. ప్రతీ 20ఏళ్లకు ఒకసారి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంతో వరంగల్ మాస్టర్ ప్లాన్ అమల్లోకి రాకుండా పోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2041 మాస్టర్ ప్లాన్ తయారు చేసినా 2016నుంచి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విస్తరణతో పాటు 2041 మాస్టర్‌ప్లాన్‌కు కొంత మార్పులు చేర్పులు చేసి సీఎం రేవంత్‌రెడ్డి చేత నవంబరు 19న ఆవిష్కరించారు. దీంతో వరంగల్‌కు 52ఏళ్ల తరువాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది.

52ఏళ్లకు కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి..

కాళోజీ కళాక్షేత్రం జిగేల్

ధిక్కార స్వరం, ప్రజాకవిగా కాళోజీ నారాయణరావు స్మారకార్థం హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం జిగేల్‌మంటోంది. రూ.95కోట్ల వ్యయంతో నిర్మించిన కళాక్షేత్రాన్ని సీఎం ఇటీవల ఓరుగల్లు వాసులకు అంకితం చేశారు. కవులు, కళాకారులు, రచయితలు, వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనుకూలంగా నిర్మించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి దీటుగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ఓరుగల్లు రాజసం ఉట్టిపడేలా పూర్తి చేశారు.

వస్త్రనగరికి కొరియా పెట్టుబడులు

కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును 1,350ఎకరాల విస్తరణలో గత ప్రభుత్వం నిర్మాణం చేసింది. రూ.567కోట్లతో టెక్స్‌టైల్ పార్కులో టీఎస్‌ఐఐ ద్వారా రహదారులు, ఇతర మౌళిక వసతులు కల్పించారు. అయితే ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదు. కేవలం కైటెక్స్, గణేషా ఎకోపెట్, ఎకోటెక్, కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు మాత్రమే పరిశ్రమలు స్థాపించాయి. అయితే వీటిలో స్థానికులకు పెద్దగా ఉపాధి అవకాశాలు రాలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కును సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. మొదటి భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలను కేటాయించారు. ఇటీవల 836మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేశారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో అభివృద్ధి పనులకు రూ.160.99కోట్లు మంజూరు చేశారు. దీంతో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 12న దక్షిణ కొరియా వెళ్లారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో పెట్టుబడులకు అక్కడి కంపెనీలతో జరిపిన చర్చలు ఫలివంతమయ్యాయి. దీంతో త్వరలోనే భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండటంతో స్థానికులు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

గిరిజన వర్సిటీకి రైట్ రైట్

విభజన చట్టంలో పేర్కొన్న గిరిజన యూనివర్సిటీకి పదేళ్ల తరువాత 2024లో మోక్షం లభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించిన గిరిజన వర్సిటీని ములుగులో సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీగా నామకరణ చేసి మార్చి8వ తేదీన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఏడాది 2024-25 తరగతులు కూడా ప్రారంభం అయ్యాయి. సుమారు రూ.900కోట్లతో గిరిజన యూనివర్సిటీ భవనాలు, ఇరత సామగ్రిని సమకూర్చనున్నారు.

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ

రాష్ట్ర విభజన చట్టం-2014లో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 9వ తేదీన వ్యాగన్ తయారీ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసినట్టు ప్రకటించింది. దీంతో పదేళ్లుగా 50ఏళ్లకు పైగా పోరాటం చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీ కల ఈ ఏడాదే సాకారమైంది. కోచ్ ఫ్యాక్టరీపై హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ భూమి పూజ నిర్వహించారు. 2025లోగా పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీపై హామీ ఉంటే కేంద్రప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఇచ్చి చేతులు దులుపుకొందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరు 9వ తేదీన రైల్వే బోర్డు వ్యాగన్ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేసిన కోచ్ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లను తయారు చేసే విధంగా యూనిట్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలు ఇచ్చింది. కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 60వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్

భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మైలారం గుట్టలపై 40ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.170కోట్లు కేటాయించింది. ఈ మేరకు ఆగస్టు 3వ తేదీన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క చేతుల మీదుగా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్‌కు భూమి పూజ నిర్వహించారు. అన్ని సంక్షేమ గురుకులాలు ఒకే చోట ఏర్పాటు చేయనున్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఈ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్‌లో చెప్పనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లిలో దీనిని ఈ ఏడాది ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

ఉమ్మడి జిల్లాకొచ్చిన మరికొన్ని నిధులు ఇలా..

- వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి రూ.32.50కోట్లు
- భద్రకాళి దేవాస్థాన మాడవీధులకు రూ.30కోట్లు విడుదల
- వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి రూ.22.50కోట్లు
- రూ.10కోట్లతో నయీంనగర్ వంతెన పనులు పూర్తి
- భూపాలపల్లిలో రూ.176కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్
- భూపాలపల్లి జిల్లాలో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పనులకు రూ.286కోట్లు
- ములుగులో గిరిజన యూనివర్సిటీకి 211ఎకరాల భూమి కేటాయింపు
- తెలంగాణ పట్టణ మౌళిక వసతుల కల్పన సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా గ్రేటర్ వరంగల్‌కు రూ.250కోట్ల నిధుల కేటాయింపు
- యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయానికి రూ.73.74కోట్ల నిధుల కేటాయింపు. డిసెంబరు 8వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. ఈ నిధులతో రామప్పలో కాటేజీలు, గార్డెన్, యాంఫీ థియేటర్, లెక్ వ్యూ కాటేజీలు, బోటింగ్ పాయింట్ తదితర వాటిని నిర్మించనున్నారు. ఇవే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12అసెంబ్లీ నియోజకవర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించాయి.



బ్లాక్‌బెర్రీ దీవి వ్యూ

త్వరలో అందుబాటులోకి అద్భుత దీవి

ములుగు జిల్లాలో రూపు దిద్దుకుంటున్న మరో పర్యాటక ప్రాంతం

- 31న మొండ్యాలతోగులో 'బ్లాక్‌బెర్రీ' ప్రారంభం?
- హాజరవనున్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు

మేడారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌బెర్రీ.. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మొండ్యాల తోగు అటవీ ప్రాంతంలో కనువిందు చేయబోతున్న కొత్త ద్వీపం. మొండ్యాలతోగు అటవీప్రాంతం.. అమెజాన్ అడువులను తలపించేలా ఉంటుందని అందరికీ తెలిసిందే. కానీ ఇటీవల పర్యాటకంగా ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఇసుకతో ఉన్న ఈ దీవి చుట్టూ బ్లాక్‌బెర్రీ చెట్లు, వాగులు విస్తరించాయి. నిరంతరం గలగలపారే ఈ వాగుల మధ్య బ్లాక్‌బెర్రీ చెట్లతో పచ్చని అందాలు ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. 2017లో అటవీ అధికారులు దీనిని గుర్తించగా ప్రస్తుత కలెక్టర్ దివాకర అధ్వర్యంలో ప్రత్యేక నిధులు మంజూరుతో అటవీ, పర్యాటక శాఖల అధికారులు బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌గా అభివృద్ధి చేస్తున్నారు. పస్రా నుంచి తాడ్వాయి వెళ్లే 163 జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలో ఈ దీవి ఉంది.

అయితే ఈ నెల 23న పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సందర్శించి సౌకర్యాలు, ఐలాండ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఐలాండ్‌లో ఏర్పాటు చేసిన బ్లాక్‌బెర్రీ పర్యాటక కేంద్రాన్ని ఈ నెల 31న ప్రారంభించనున్నారని సమాచారం. ఈ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక మంత్రి సీతక్కను అధికారులు ఆహ్వానించినట్టు తెలిసింది. గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా ఈ బ్లాక్‌బెర్రీ దీవిని సందర్శించేవారని అధికారులు చెబుతున్నారు. 2020లో కరోనా వచ్చిన క్రమంలో ఈ ఐలాండ్ ప్రదర్శన మూతబడగా ఇటీవల పర్యటించిన కలెక్టర్.. ప్రభుత్వానికి నివేదిక పంపించి అనుమతులతో ఐలాండ్‌ను అభివృద్ధి చేపట్టారు.

మార్గం మధ్యలో బ్లాక్‌బెర్రీ అడవి

ములుగు జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి. ఇందులో ముందుగా వెంకటాపురం మండలంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, గోవిందరావుపేట మండలంలో లక్నవరం సరస్సు, ఐలాండ్ పర్యాటక కేంద్రం, తాడ్వాయి మండలంలో మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మల పుణ్యక్షేత్రం, మంగపేట మండలంలో మల్లూరు లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం, వాజేడు మండలంలో బొగత జలపాతం ప్రఖ్యాతి చెందినవి. ఈ క్రమంలో దైవ దర్శనాలకు వచ్చిన భక్తులకు, పర్యాటకులకు అందుబాటులో మార్గం మధ్యలో బ్లాక్‌బెర్రీ ఐలాండ్ ఉంది. ఈ బ్లాక్‌బెర్రీ దీవిని వీక్షించడానికి వచ్చే పర్యాటకులకు సకల సౌకర్యాలను అందుబాటులో ఉన్నాయి. రాత్రి వేళల్లో అక్కడే ఉండాలనుకున్నవారికి 50 ఆధునిక గుడారాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గుడారంలో ఇద్దరు నిద్రించేలా ఏర్పాట్లు చేశారు. క్యాంప్ ఫైర్, కోరుకున్న భోజనం అందిచేలా రెస్టారెంట్, బీచ్ తరహాలో ఆడుకోవడానికి వాలీబాల్, షటిల్ కోర్టులు అందుబాటులో ఉన్నాయి. అడవి మధ్యలో పకృతి అందాలు తిలకించేలా ఎతైన మంచె, రాత్రి భోజనం చేయడానికి మకాన్ (ఎతైన భోజనశాల), రాత్రి వేళ మరింత ఆహ్లాదాన్ని కలిగించే రంగురంగుల సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. మరుగు దొడ్లు, తాగునీటి సౌకర్యాలు కూడా కల్పించారు.



పర్యాటకుల విడిదికి ఆధునిక గుడారాలు



ఐల్యాండ్‌లో ఏర్పాటు చేసిన రెస్టారెంట్

ఆన్‌లైన్ బుకింగ్ ఏర్పాటు

బ్లాక్‌బెర్రీ ఐలాండ్ పర్యాటక కేంద్ర ప్రారంభం అనంతరం ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించేలా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు ఈ ఐలాండ్‌కు సులువుగా రావడానికి బుకింగ్ చేసిన యాప్‌లో రూట్ మ్యాప్‌తో పాటు రవాణా, వాహన సౌకర్యాల వివరాలను కూడా పొందుపరుచనున్నారు.

ఓరుగల్లులో ఐటీ పరుగులు

హైదరాబాద్ తరువాత వరంగల్‌లోనే మరింత అనుకూలం

- నిట్‌తో పాటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉండడం వరం
- ఏటా 20వేలకు పైగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి
- ఓరుగల్లులో భూముల ధరలు కూడా తక్కువే..
- ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు వస్తే మరింత ఊపు
- 'తెలంగాణాస్ బ్లూ ప్రింట్ ఫర్ గ్రోత్' రిపోర్టులో నాస్కామ్ వెల్లడి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు వరంగల్ డెస్టినేషన్‌గా మారుతోంది. హైదరాబాద్ తరువాత వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీ అభివృద్ధికి అన్ని అనుకూలతలు ఉన్నట్లుగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) వెల్లడించింది. ఇటీవల జీసీసీ ప్లేబుక్ తెలంగాణాస్ బ్లూప్రింట్ ఫర్ గ్రోత్ పేరిట నాస్కామ్ విడుదల చేసిన రిపోర్టులో వరంగల్‌కు రెండో స్థానం దక్కింది. వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీకి కావాల్సిన వనరులు పుష్కలంగా ఉన్నట్లుగా గుర్తించింది. హైదరాబాద్ తరువాత ఎక్కువ ఐటీ కంపెనీలను ఆకర్షిస్తున్న వరంగల్‌గా నాస్కామ్ పేర్కొంది. ఇతర దేశాల్లోని టాలెంటెడ్ టెకీల సేవలను, సామర్థ్యాన్ని తక్కువ ఖర్చుతో వినియోగించుకుంటూ వ్యాపారావృద్ధికి తోడ్పడే కేంద్రాలే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ). అంతర్జాతీయ వ్యాపారంలో జీసీసీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 355కు పైగా జీసీసీలు ఉన్నాయి. ఒక్క జీసీసీ ఏర్పాటు అయితే 500మంది నుంచి వెయ్యి మంది వరకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇంత కీలకమైన జీసీసీలకు వరంగల్ గమ్య స్థానంగా మారుతోందని నాస్కామ్ వెల్లడించింది.

వరంగల్‌లో ఇప్పటికే ఐటీ కంపెనీలు

వరంగల్‌ను ఐటీ హబ్‌గా ఏర్పాటు చేసేందుకు ఐదారేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభివృద్ధి మొత్తం ఒక్క హైదరాబాద్ చుట్టే కేంద్రీకృతం కాకుండా.. ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ తరువాత వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీకి అనుకూల వాతావరణం ఉండటంతో అనేక కంపెనీలు ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గుచూపుతున్నాయి. ఇప్పటికే మడికొండలో ఐటీ పార్కు అభివృద్ధి కోసం గత ప్రభుత్వం 40 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. 2020 ఫిబ్రవరి 6వ తేదీన అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఐటీ హబ్‌ను ప్రారంభించారు. సియెంట్, టెక్ మహేంద్ర, జెన్‌పాక్ట్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, క్వాడ్రంట్ రిసోర్సెస్ తదితర కంపెనీలు వచ్చాయి. ఇంక్యుబేషన్ సెంటర్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, హనుమకొండ ఐటీ పార్కు,



వరంగల్ ఐటీ పార్కు తదితర ఇండస్ట్రీస్ అందుబాటులోకి రావటంతో చాలామందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. వరంగల్ నగరానికి వచ్చే ఐటీ కంపెనీలకు మూడేళ్లపాటు మున్సిపల్ పన్నుల నుంచి మినహాయింపు ఇస్తున్నారు. అయితే సౌకర్యాలు లేవని కొన్ని కంపెనీలు మూసి వేసే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఐటీ ఇండస్ట్రీల అభివృద్ధిపై దృష్టిసారించింది. కనీస సౌకర్యాలు కల్పిస్తే.. ఇక్కడి నుంచి వెళ్లిన ఒకటిరెండు కంపెనీలు కూడా తిరిగి ఇక్కడ ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ ఇండస్ట్రీకి వరంగల్ సానుకూలంగా ఉన్నట్లుగా నాస్కామ్ అధ్యయనంలో తేలటంతో కొత్త కంపెనీలు వరంగల్ వైపు మొగ్గుచూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే వరంగల్‌లో దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)తో పాటు కిట్స్, ఎస్ఆర్ లాంటి ప్రముఖ యూనివర్సిటీతో పాటు 50కిపైగా ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటం ఐటీ అభివృద్ధికి కలిసి వచ్చే అంశంగా నాస్కామ్ పేర్కొంది. అంతేకాకుండా ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా సుమారు 20వేల మంది గ్రాడ్యుయేట్స్ బయటకు వస్తుండటంతో మానవ వనరులకు కొరత లేదు. హనుమకొండ, కాజీపేట పట్టణాలు ఐటీ పార్కుకు అనూకూలంగా ఉన్నాయి. ఐటీ పార్కులకు నిర్మాణానికి కావాల్సిన భూములు, భవనాలు హైదరాబాద్‌తో పోల్చితే ధరలు చాలా తక్కువ. ఇప్పటికే పలు టెక్ సర్వీసెస్ కంపెనీలు ఉండగా, స్టార్టప్ టెక్‌లు కొన్ని ప్రారంభం అవుతున్నాయి.

వరంగల్‌లో ఐటీ అభివృద్ధికి అనుకూల అంశాలు..

- హైదరాబాద్‌కు వరంగల్ నగరం 150కిలో మీటర్ల లోపే ఉండటం
- హైదరాబాద్ నుంచి వరంగల్‌కు నేషనల్ హైవే, రైల్ మార్గం కూడా అందుబాటులో ఉండటం.
- హైదరాబాద్‌తో పోల్చితే వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీల ఏర్పాటుకు కావాల్సిన భూముల ధరలు తక్కువ, అద్దె కూడా తక్కువే..
- త్వరలోనే వరంగల్ ఎయిర్‌పోర్టు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉండటం.
- వరంగల్ మహానగరంలో మెట్రో (నియో) రైల్ కూడా ప్రారంభం అయ్యే అవకాశం ఉండటం.
- మానవ వనరుల కొరతను తీర్చేలా నిట్‌తో పాటు కిట్స్, ఎస్ఆర్ లాంటి యూనివర్సిటీలు, 50కిపైగా ఇంజనీరింగ్ కాలేజీల నుంచి ఏటా 20వేలకుపైగా గ్రాడ్యుయేట్లు బయటకు వస్తుండటం.
- ఐటీ ఇండస్ట్రీల ఏర్పాటుకు విద్యుత్, పన్నుల మినహాయింపులపై ప్రభుత్వం ప్రోత్సాహన్ని ఇవ్వటం.
- తెలంగాణకు రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించటం.

ఎయిర్‌పోర్టు, మెట్రోతో ఐటీకి మరింత ఊపు..

వరంగల్ నగరానికి ఎయిర్‌పోర్టు లేకపోవటం పారిశ్రామిక అభివృద్ధికి ఆటంకంగా మారుతోందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఎయిర్‌పోర్టు లేకపోవటంతో విదేశాల నుంచే వచ్చే ఆయా కంపెనీల ప్రతినిధులు వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీ ఏర్పాటుకు ఆసక్తి చూపటం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ ఎయిర్‌పోర్టును తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వచ్చే రెండుమూడేళ్లలో వరంగల్ వాసుల కల కూడా తీరే అవకాశాలు ఉండటంతో పాటు ఐటీ రంగానికి కొత్త ఊపు రానుంది. అలాగే ఐదేళ్లుగా ఊరిస్తున్న వరంగల్ మెట్రో నియో రైలు కూడా పట్టాలెక్కితే నగరం రూపురేఖలు మారిపోయే అవకాశం ఉందనే చర్చలు జరుగుతున్నాయి. మొత్తానికి ఐటీ ఇండస్ట్రీకి హైదరాబాద్ తరువాత రెండోస్థానం వరంగల్‌కే ఉందని నాస్కామ్ తన అధ్యయనంలో వెల్లడించటంతో ఐటీ ఇండస్ట్రీ విస్తరణకు మరిన్ని అడుగులు పడనున్నాయి.



పాసింగ్ పరేడ్ కోసం ముస్తాబు చేసిన బెటాలియన్ పరేడ్ గ్రౌండ్

దీక్షంత్ పరేడ్ జనవరి 3కు వాయిదా

మాజీ ప్రధాని మన్మోహన్ కన్నుమూత నేపథ్యంలో అధికారుల నిర్ణయం

మామునూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకున్న 457 మంది టీజీఎస్పీ పోలీస్ కానిస్టేబుళ్లకు మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన దీక్షంత్ పాసింగ్ పరేడ్ వాయిదా పడింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందిన నేపథ్యంలో దీన్ని జనవరి 3వ తేదీకి వాయిదా వేశారు. కాగా, పరేడ్ కోసం ముస్తాబు చేసిన పరేడ్ గ్రౌండ్‌కు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యుల రాకతో సందడి నెలకొంది. ఆర్డర్ కాపీలు అందుకోవాల్సిన కానిస్టేబుళ్లు పరేడ్‌గ్రౌండ్‌లో కుటుంబసభ్యులతో కలిసి సెల్ఫీలతో సరిపెట్టుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తిరిగి వెళ్లిపోయారు.



పరేడ్ వాయిదా పడటంతో తిరిగి వెళ్లిపోతున్న శిక్షణాభ్యర్థుల తల్లిదండ్రులు, కుటుంబీకులు

శ్వేతార్కలో అయ్యప్ప కల్యాణోత్సవం

కాజీపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట విష్ణుపురిలోని శ్వేతార్క అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. 51 లీటర్ల పాలు, పంచామృతాలతో నవవిధాఫలాలతో అభిషేకం నిర్వహించారు. ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో గొలకొండ శ్రీనివాస్, రమేశ్ బాబు వైక్రాంతికుమార్‌వర్మ, జాగర్లపూడి శ్రీనివాస్ శర్మలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

న్యూశాయంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో బస్‌స్టేషన్ సమీపంలోని మొదటి వీధిలో ఎలాంటి సౌకర్యాలు లేక త్రీవ ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు కార్పొరేటర్ మామిండ్ల రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వీధిలో వీధి దీపాలు లేవని, డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం సరిగా లేని కారణంగా స్థానిక ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చినట్లు స్థానికులు త్యాగరాజు, శ్రీధర్, మధు, సరోజన, ఫాతిమా, రాజమణిలు తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ రాజు త్వరలోనే సమస్యలు పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

హనుమకొండ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం హనుమకొండ జేఎన్‌ఎస్, ఎర్రగట్టుగుట్ట కిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కిట్స్ కళాశాల మైదానంలో బ్యాడ్మింటన్ పోటీలను, హనుమకొండ జేఎన్‌ఎస్‌లో హ్యాండ్‌బాల్ సెపక్‌తాక్ర పోటీలు నిర్వహించినట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. ఈ క్రీడాపోటీలు మూడురోజుల పాటు జరుగుతాయని వెల్లడించారు. తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి

వడ్డెపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూమి లేని ఉపాధి హామీ, రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చే రూ.12వేల పథకానికి మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు మల్లేషం, రాము, రమేష్, రవి, సిద్ధార్థ, శివ, మహేందర్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్మారక నాటకోత్సవాలు ప్రారంభం

హసన్‌పర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ భీమారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పౌరాణిక రంగస్థల కళాకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి స్థానిక కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, నాటకోత్సవ కమిటీ సభ్యుడు పందిళ్ల రమేష్ బాబు, కాంగ్రెస్ నాయకులు పందిళ్ల అశోక్, ఆకుల సారంగపాణి, బూర సారంగపాణి, ఆకుల కుమార్, గడ్డం శివరాంప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై సంతాపం తెలిపారు.నాలుగు రోజుల పాటు జరిగే నాటకోత్సవాలలో భాగంగా శుక్రవారం మొదటి రోజు వనం లక్ష్మీకాంతరావు సభాధ్యక్షతన పల్లేటి లక్ష్మీకులశేఖర్ రచించిన బీవీఆర్ ఆర్ట్స్ కూకట్‌పల్లి హైదరాబాద్ వారి అయ్యప్ప పద్య నాటకం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పందిళ్ల శేఖర్‌బాబు స్మారక పురస్కారం రచయిత, నటుడు, దర్శకుడు తోట సత్యనారాయణకు పందిళ్ల శేఖర్‌బాబు సోదరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజం సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వొడపల్లి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరాజు రవీందర్‌రావు, పందిళ్ల స్మారక నాటకోత్సవ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు బాలాజీ, స్మారక కమిటీ సభ్యులు సీతా వెంకట్, నాగరాజు, రాజేంద్రప్రసాద్, జేఎస్.శర్మ, రవీందర్, ప్రసాద్, నాగరాజుతో పాటు కవులు, కళాకారులు, కళాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తి క్రీడాకారులు

హసన్‌పర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌ఎస్ బాక్సింగ్ హాలులో ఈ నెల 18న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాక్సింగ్ పోటీలలో హసన్‌పర్తికి చెందిన వివిధ పాఠశాలలకు చెందిన బాక్సింగ్ క్రీడాకారులు అత్యంత ప్రతిభకనబరిచి సీఎం కప్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హసన్‌పర్తి జడ్పీఎస్‌ఎస్ వ్యాయామ ఉపాధ్యాయుడు శీలం పార్థసారథి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలకు చెందిన క్రీడాకారిణి శీలం సుస్మిత, పి.వరుణ్, సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులు అశ్విత్‌గౌడ్, అభినాష్ క్రీడాకారులను కోచ్ నరేందర్‌ను స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, సామాజిక వేత్త శీలం యాదగిరి, ఎస్‌ఎంసీ చైర్మన్ అక్షర తిరుపతి, హెచ్‌ఎం సుమాదేవి అభినందించారు. ఈ నెల 31 నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి సీఎం కప్ బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని డివైఎస్‌వో గుగులోతు అశోకుమార్ తెలిపినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శీలం పార్థసారథి తెలిపారు.



కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల బాక్సింగ్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 26 నుంచి జనవరి 2 వరకు పంజాబ్‌లోని బటిండా యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల బాక్సింగ్ జట్టును 2024-25 ఏడాదికి గాను శుక్రవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో హెచ్.రాకేశ్, (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), బచ్చలి. రామకృష్ణ, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), మల్యాల సంజయ్, (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), విక్రమ్ కుమార్,(వివేకనంద డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్), పసుల విన్‌పాల్, గుగులోత్ శేఖర్(కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తి), వడాయ్ శివానంద్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్), గుండు చంద్రశేఖర్, (ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల, హనుమకొండ), సదానపల్లి శ్రీహరి (యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, కేయూ క్యాంపస్), శీలం సాకేత్ (కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తి)లున్నట్లు పేర్కొన్నారు. ఈజట్టుకు కోచ్, మేనేజర్‌గా హనుమకొం డలోని శివాని డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ .రమేశ్ వ్యవహరిస్తారని తెలిపారు.

ఎంప్లాయీస్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

రాంనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లష్కర్ సింగారం ఎంప్లాయిస్ సొసైటీ నూతన క్యాలెండర్‌ను హనుమకొండ సీఐ వై.సతీష్, పాస్టర్ ఉదయ్ శామ్యూల్ ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు సంద్రగిరి కుమార్, కార్యదర్శి అరికిల్ల నాని, కోశాధికారి మట్టెడ ప్రవీణ్‌కుమార్, ఉపా ధ్యక్షుడు కాట్రు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, నాగరాజు, అజంతా, న్యాయ సలహాదారుడు ఆర్.అశోక్, గాయకుడు మైస ఎర్రన్న పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు నిలిపివేయాలని ఆందోళన

రాంనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బొక్కలగడ్డలో జనావాసాల మధ్య నిర్మిస్తున్న సెల్‌టవర్ పనులు నిలిపివేయాలని స్థానికులు ఆందోళన నిర్వహించారు. న్యారంనేని శశిధర్‌రావు ఇంటిపై నిర్మిస్తున్న సెల్ టవర్ వలన స్థానికులకు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, మున్సిపల్ కమిషనర్ స్థానికుల సమస్య పట్ల స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీవాసుల సంతకాలతో మున్సిపల్ కమిషనర్‌తో పాటు 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధుకు గురువారం ఫిర్యాదు చేశారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు,



మన్మోహన్‌సింగ్‌తో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ (ఫైల్)

వరంగల్ లీగల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిగా ఆర్థికంగా ఒడుదొడుకులు ఎదుర్కొంటూ దేశాన్ని గట్టెక్కించిన ఘనత ఆయనదేనని జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆదర్శనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాతంగి రమేష్‌బాబు, తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు లాదె రమేష్, ముదసిర్ అహ్మద్, బార్ అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు 31వ డివిజన్ న్యూశాయంపేటలో శుక్రవారం నివాళులు అర్పించారు. కార్పొరేటర్ మామిండ్ల రాజు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● హనుమకొండటౌన్: దేశ ఆర్థిక సంస్కరణల రూప శిల్పి, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతిపట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అప్పటి ప్రధానమంత్రి పీవీ నర్సింహరావు ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రిగా, ఆధునిక ప్రగతిశీల భారత్‌కు పునాది వేసిన మైలురాయి లాంటి ఎల్‌పీజీ (లిబరైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) సంస్కరణలను మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టారని తెలిపారు. మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక వేత్తగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేశారని, ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థిక శాఖ అడ్వయిజరీ కౌన్సిల్ మెంబర్‌గా పనిచేశారని పేర్కొన్నారు.

నేడు నేరెళ్ల 93వ జయంతి

▸▸ శ్రీనివాస్‌కు పురస్కారం



శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిమిక్రీ కళ ద్వారా ఓరుగల్లు కళా రంగ చరిత్రను ప్రపంచ పటంలో నిలిపిన ఓరుగల్లు ముద్దుబిడ్డ ప్రపంచ ధ్వని అనుకరణ సామ్రాట్ పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 93వ జయంతి శనివారం జరుగనుంది. ఈ సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో స్వరార్చన పేరిట వేణుమాధవ్ శిష్యులతో ప్రత్యేక మిమిక్రీ ప్రదర్శనలు ఉంటాయని వేణుమాధవ్ ట్రస్టు నిర్వాహకులు నేరెళ్ల రాధాకృష్ణ తెలిపారు. అదే విధంగా వేణుమాధవ్ కల్చరల్ ట్రస్టు ద్వారా ఆయన జయంతి వేళ ఏదో ఒకరంగానికి చెందిన ప్రముఖులను సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ధ్వన్య అవధాన సామ్రాట్ మిమిక్రీ శ్రీనివాస్‌కు నేరెళ్ల పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. అంపశయ్య నవీన్ అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ప్రఖ్యాత మైమ్ కళాకారుడు మైమ్ మధు, తదితర ప్రముఖులు పురస్కారం ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిమిక్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనకు మిమిక్రీ కళ ద్వారా కళాకారుడిగా సమాజానికి పరిచమయ్యే అదృష్టం కలిగిందని అన్నారు. తన కళా ప్రతిభంతా గురువుగారి చలవేనని అన్నారు. ఆయన పేరు మీద అవార్డు స్వీకరించడం జీవితంలో మరుపురాని అనుభూతి అని పేర్కొన్నారు. కళాకారులు ఎవరైనా నిబద్ధతతో కళానైపుణ్యాతో క్రమశిక్షణతో కళారంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షికాలనీ, శివముక్తి ధామం, రాజ్‌పుత్‌వాడ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 10.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కేయూ విద్యార్థులకు చోటు



పూజ

కేయూ క్యాంపస్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీలో వరంగల్ కాకతీయ యూనివర్సిటీకి పెద్దపీట వేశారు. ఈ మేరకు డిసెంబరు 23, 24, 25 తేదీల్లో సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో పలువురిని రాష్ట్ర కమిటీలో కీలక పదవుల తో పాటు వర్సిటీ పదవుల్లో నియమిస్తూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జనారెడ్డి, జనరల్ సెక్రటరీ మాచర్ల రాంబాబులు ఉత్తర్వులు జారీ చేసింది. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా కేయూ మ్యాథ్ విభాగం స్కాలర్ అంబాల కిరణ్, తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్‌గా రాజనీతిశాస్త్ర విభాగం స్కాలర్ చట్ల సతీష్‌లను నియమించారు. అలాగే ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కేయూ ఎకనామిక్స్ విభాగానికి చెందిన ఉప్పటి హరికృష్ణ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన పసుపులేటి పూజలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి పనిచేస్తామని, వర్సిటీఅభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. తమకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఏబీవీపీ శాఖ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, గతంలో అంబాల కిరణ్ ఏబీవీపీ వరంగల్ మహానగర కార్యదర్శిగా, వరంగల్ జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించగా.. చట్ల సతీశ్ కేయూ ఏబీవీపీ అధ్యక్షుడిగా, స్టేట్ హాస్టల్స్ కన్వీనర్‌గా, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలకు ఎంపికైన కిరణ్, సతీష్, హరికృష్ణ, పూజను పలువురు అభినందించారు.

ఎర్రజెండా పేదలకు అండ

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎర్రజెండా అండ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 100వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా హనుమకొండలో శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన వేయి స్తంభాలగుడి నుంచి హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ పెట్రోల్ పంప్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతపట్టుకుని సీపీఐ జిందాబాద్.. మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలి.. అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ 100 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభా కాంక్షలు తెలుపుతున్నానన్నారు. త్యాగాలు, పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఉందని, అందుకు కమ్యూనిస్టుల పునరేకీకరణ కావాలన్నారు. ఎర్రజెండా పార్టీ 100 ఏళ్లు పూర్తి చేసుకోవడం గొప్ప విషయం అన్నారు.



హనుమకొండలో ఎర్రజెండాలతో ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ నాయకులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, మద్దెల ఎల్లేష్, మోతె లింగా రెడ్డి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునగాల భిక్షపతి, కొట్టెపాక రవితో పాటు పెద్ద సంఖ్య లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.

రైలులో తప్పిపోయిన బాలుడు

చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైలులో ఓ బాలుడు తప్పిపోయాడు. ఆ బాలుడిని పోలీసులు చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఔరంగాబాద్ నుంచి నర్సాపూర్ వెళ్లే నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో శుక్రవారం ఓ మహిళ మూడేళ్ల బాలుడిని రైలులో వదిలి సికింద్రాబాద్‌లో దిగిపోయింది. బాలుడిని గుర్తించినతోటి ప్రయాణికులు 100 సమాచారం ఇచ్చారు. రైలు కాజీపేట జంక్షన్‌లో ఆగిన తర్వాత బాలుడిని రైల్వే పోలీసులు చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 58609, 94900 27342 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.



ఐఆర్‌ఆర్ బైపాస్ రోడ్డును రద్దు చేయాలి

▸▸ కొందరి స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్ మార్చారు..

▸▸ కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డిని కలిసిన రైతులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు, పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ఐఆర్‌ఆర్(ఇంటర్నల్ రింగ్ రోడ్డు) 2041 మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట రైతులు శుక్రవారం కుడా చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తిచేశారు. అనంతరం రైతులు మాట్లాడారు. 2031 కుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఐఆర్‌ఆర్ 200 ఫీట్ల రోడ్డుకు వరంగల్ మండల పరిధిలోని పైడిపెల్లి, ఆరెపల్లి మీదుగా కొత్తపేట క్రాస్‌రోడ్డు వరకు 200 ఫీట్ల రోడ్డును ప్రతిపాదించారన్నారు. ఈ కొత్త మాస్టర్‌ప్లాన్‌తో తమ గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్‌ను వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ జీవనాధారమైన రెండు పంటలు పండే విలువైన పంట పొలాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇప్పటికే 163 నేషనల్ హైవే కింద చాలామంది రైతుల విలువైన భూములు పోయాయని ప్రస్తుతం కొత్త మాస్టర్ ప్లాన్‌తో తీవ్ర నష్టం జరుగు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఆర్‌ఆర్ బైపాస్ 200 ఫీట్ల రోడ్డు కోసం, ఓఆర్‌ఆర్ 300 ఫీట్ల రోడ్డు కోసం ప్రతిపాదనలు చేయడంతో ఎక్కువ మంది రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



కుడా చైర్మన్‌కు వినితిపత్రం అందిస్తున్న రైతులు

ఐఆర్‌ఆర్ బైపాస్ రోడ్డును కొందరు రాజకీయ నాయ కులు, ప్రజాప్రతినిధులు ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు మలుచుకుని తమను నష్టం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రెండు సార్లు మాస్టర్ ప్లాన్‌ను మార్చడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కొత్త డిజైన్ ద్వారా రైతులకు నష్టంతో పాటు ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందన్నారు. దీనికి వెంటనే స్పందించిన వెంకట్రాంరెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి ప్రజలకు, రైతులకు నష్టం జరుగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కుడా చైర్మన్‌ను కలిసిన వారిలో సుంకరి ప్రశాంత్, బుద్దె గణేశ్, రామేందర్‌రెడ్డి, అల్లాడి శ్రీను, దుకిరే బాబురావు, కమళాపురం జితేందర్, బుద్దె కృష్ణమూర్తి ఉన్నారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

హసన్‌పర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి ఆదర్శకాలనీకి చెందిన ఇద్దరు చిన్నారులు కల్వచర్ల అక్షయ్(9), కందికొండ లక్ష్య(5)లు శుక్రవారం ఇంటి నుంచి బయటకు ఆడుకునేందుకు వెళ్లి రాత్రి వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై కేయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు దర్యాప్తును వేగవంతం చేశారు. చిన్నారుల ఆచూకీ కోసం పెట్రోకార్, బీట్ కానిస్టేబుళ్లను అప్రమత్తం చేసి పక్క వీధిలో ఆడుకోవడానికి వెళ్లిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రలకు అప్పగించినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అనంతరం ఇద్దరు చిన్నారులను తమ తల్లిదండ్రులకు అప్పగించడంతో కథా సుఖాంతమైంది.



తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

ప్రజలు కోరుకున్న పాలన జరగడం లేదు..

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షలో విశారధన్ మహారాజ్

హనుమకొండటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న పాలన జరగడంలేదని ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ముందు సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం రేవంత్ రెడ్డికి ఊపిరి ఆడకుండా ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వేల కోట్లు సంపాదించిన సినిమా హీరోలతో మాట్లాడే సమయం దొరికిన రేవంత్‌రెడ్డికి పేద అణగారిన వర్గాల పిల్లలకు చదువు చెప్పే కాంట్రాక్టు ఉద్యోగులను పిలిచి మాట్లాడే సమయం దొరకకపోవడంపై తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో అగ్రవర్ణాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, నాలుగుకోట్ల మంది ప్రజలతో కాంట్రాక్టు ఉద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలని, ఎక్కడికక్కడ నిర్బంధాలతో కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను, నాయకులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు , కాంట్రాక్టు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే తెగించి ఉద్యమిస్తాం..

హనుమకొండ(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము చేస్తున్న సమ్మెదీక్షలకు ప్రభుత్వం స్పందించకుంటే తెగించి ఉద్యమిస్తామని సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ స్పష్టం చేసింది. హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె దీక్షలు 22వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షల వద్ద మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి వారు నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. న్యాయపరమైన తమ డిమాండ్‌ల పట్ల స్పందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. శనివారం అమరవీరుల స్థూపం, కాళోజీ జంక్షన్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీని నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రతినిధులు దొనికెల శ్రీధర్, షఫీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, సీఆర్పీలు, ఎంఐఎస్‌లు, డీఎల్‌ఎంటీలు, డాటా ఆపరేటర్‌లు, పీటీఐలు, ఐఈఆర్పీలు, మెస్సేంజర్‌లు, అకౌంటెంట్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్ : సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్యోగులు కోరారు. శుక్రవారం హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, తమ సర్వీసును క్రమబద్ధీకరించడంతోపాటు పేస్కేల్ అమలు చేసే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, మాధవి, సునీత, ఊర్మిళ, తిరుమల, సుమలత, స్వాతి తదితర కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జెండా అవనతం.. మరిచారు..!



వరంగల్ కలెక్టరేట్ వద్ద జాతీయ జెండాను అవనతం చేసిన దృశ్యం

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా ప్రభుత్వం ఏడు రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ఇందులో భాగంగా పాఠశాలలకు సెలవులు కూడా ప్రకటించింది. అయితే సంతాపదినాలను ప్రకటించిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని అవనతం చేయడం ఆనవాయితీ. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ వద్ద మాత్రం జాతీయ జెండాను అవనతం చేయడం మరిచిపోయారు. సమీపంలోనే ఉన్న వరంగల్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను సగానికి దించగా.. హనుమకొండ కలెక్టరేట్‌లో అవనతం చేయకపోవడం చర్చనీయాంశమైంది.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



హనుమకొండ కలెక్టరేట్‌లో ఇలా...

నేడు కేయూలో ఆర్ట్ ఎగ్జిబిషన్

వడ్డెపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలోని సెనెట్ హాల్‌లో యూనైటెడ్ నేషన్స్ సీట్ డెవలప్‌మెంట్ గోల్స్ ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవింద్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు మండల పరశురాములు, పొనుగోటి అశోక్ కుమార్, జి.సుధాకర్, కామేశ్వర్‌రావు, రామయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 28 డిసెంబరు 2024



చిక్కిపోయేవారికి చక్కని కొబ్బరి పాయసం

భోజనకుతూహలం — ఆహారంతో ఆరోగ్యం

"నారికేళం తనూకృత్య ఛిన్నం పయసిః గో క్షిపేత్
సితాగవ్యాజ్య సంయుక్తం తత్సచేన్మృదువహ్నినా"

అంటాడు 'భోజనకుతుహలం' రచయిత రఘునాథ సూరి. ఈ శ్లోకం ప్రకారం- కొబ్బరి పాలతో పాయసం వాతపైత్యాల్ని తగ్గిస్తుంది. ఈ పాయసాన్ని ఎలా తయారుచేయాలో కూడా ఈ శ్లోకం చెబుతుంది. ఈ శ్లోకంలో తనూకృత్యం అంటే కొబ్బరిని సన్నగా తరగటం. ఒకవేళ సన్నగా తురిమే సాధనం లేకపోతే దానిని ఛిన్నం కూడా చేయవచ్చని శాస్త్రకారుడు చెబుతాడు. ఇలా సన్నగా తరిగిన కొబ్బరిని చిక్కని ఆవుపాలలో కలిపి ఉడికించాలి. అలా ఉడికిన మిశ్రమంలో నెయ్యి వేసి దగ్గరపడేలా ఉడికించాలి. అలా ఉడికించిన తర్వాత దానిలో చిటికెడంత పచ్చకర్పూరం కలిపితే మంచి పరిమళంతో పాటుగా పవిత్ర భావం కూడా వస్తుందని రఘునాథ సూరి చెబుతాడు. ఇలా తయారు చేసిన కొబ్బరి పాయసం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

- కొబ్బరితో చేసిన పాయసం ఎక్కువ పుష్టిదాయకం. శరీరానికి పోషణ ఇస్తుంది. ఎదిగే పిల్లలకు మేలు చేస్తుంది. తక్కువగా తిన్నా ఎక్కువగా ఆకలి తీరుతుంది.
- మంచి నిద్ర పట్టడానికి ఇదొక సాధనం. రక్తస్రావాలు అరికడుతుంది. వాత వ్యాధులు ఉన్నవారు దీనిని జాగ్రత్తగా ఆలోచించి సేవించాలి. దగ్గు, జలుబు, ఆయాసం మొదలైన వ్యాధులతో బాధపడేవారికి ఇది చెడు ఎక్కువ చేస్తుంది.
- ఇది చర్మ సమస్యలకు మంచి మందులా పనిచేస్తుంది. చర్మానికి మంచి మెరుపునిస్తుంది.
- అలసటను తగ్గిస్తుంది. వికారాన్ని, ఎక్కిళ్లను, ఇతర గ్యాసు సమస్యలను తొలగిస్తుంది.
- సాధారణంగా ఎక్కువ మంది ముదురు కొబ్బరిని ఉపయోగిస్తారు. ముదురు కొబ్బరి కన్నా లేత కొబ్బరి ఎక్కువ ప్రయోజనకారి. అనేక రకాల శారీరక సమస్యలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



21 చుక్కలు
11 వరకు
సందుచుక్క



ఎస్. జ్యోత్స్న సురేష్, కర్నూలు

వంటిల్లు

శీతాకాలంలో వివిధ రాష్ట్రాల్లో రకరకాలైన వంటలు వండుకుంటూ ఉంటారు. అలాంటి కొన్ని రుచికరమైన పదార్థాలను ఎలా చేయాలో తెలుసుకుందాం.

ఇతర రాష్ట్ర రుచులు

మీ కోసం...

బెంగాలీ మాల్పువా

బెంగాల్‌లో రసగుల్లా, గులాబ్‌జామ్‌లతో పాటుగా మాల్పువాను కూడా ఎక్కువగా తింటారు. ముఖ్యంగా చలికాలంలో ఈ మాల్పువాకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ మాల్పువాను ఎలా చేయాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: మైదా- నాలుగు కప్పులు, రవ్వ- ఒక కప్పు, పంచదార- రెండున్నర కప్పులు, ఏలకులు- ఆరు, బేకింగ్ పౌడర్- ఒక స్పూను, చిక్కగా మరగపెట్టిన పాలు- రెండు కప్పులు, నూనె- రెండు కప్పులు, నీళ్లు- తగినన్ని

తయారీవిధానం: ఒక గిన్నెలో మైదా, రవ్వ, ఒక కప్పు పంచదార, ఏలకుల పొడి, బేకింగ్ పౌడర్‌లు వేసి కలపాలి. దానిలో పాలు పోసి ముద్దగా కలపాలి. దీనిపై ఒక మూత పెట్టి అరగంట సేపు ముద్దను నాననివ్వాలి.

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. మాల్పువా ముద్దను పలుచగా గారెల మాదిరిగా అరచేతిలో ఒత్తాలి. వాటిని ఈ నూనెలో వేయించాలి.
- మాల్పువాలను వేయిస్తున్న సమయంలోనే ఒక గిన్నెలో ఒక కప్పు నీళ్లు, ఒక కప్పు పంచదార వేసి పాకం పట్టాలి. బాగా వేగిన మాల్పువాలను ఈ పంచదార పాకంలో వేసి.. కొద్దిగా పాకం పీల్చిన తర్వాత బయటకు తీయాలి.

జాగ్రత్తలు
- పంచదార పాకం పలుచగా ఉండాలి. గట్టిపడితే మాల్పువా బావుండదు.
- కొందరు నూనె బదులు నెయ్యి కూడా వాడతారు.



మిసాల్ పావ్

మహారాష్ట్రలో చాలా సుప్రసిద్ధమైన వంటకమిది. దీనిలో పోషక విలువలు ఎక్కువ ఉండటం వల్ల కార్మికులు, కర్షకులు ఎక్కువగా తింటూ ఉంటారు. దీనిని ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: మిసాల్ (పావ్ బ్రెడ్)- నాలుగు, కొబ్బరి తురుము: ఒక కప్పు, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర-ఒక చెంచా, మిరియాలు- అర చెంచా, లవంగాలు-ఆరు, ఏలకులు- నాలుగు, నువ్వులు- రెండు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక చెంచా, బంగాళదుంప ముక్కలు- రెండు కప్పులు, మొలకలు- రెండు కప్పులు, కారం- రెండు చెంచాలు, తరిగిన పచ్చిమిరపకాయ ముక్కలు- రెండు చెంచాలు, పసుపు- ఒక చెంచా, మిక్సర్- నాలుగు చెంచాలు, నూనె- ఒక కప్పు, నీళ్లు- తగినన్ని, ఉప్పు- తగినంత, నిమ్మరసం- నాలుగు చెంచాలు

తయారీ విధానం
- ఒక మూకుడులో ధనియాలు, జీలకర్ర, మిరియాలు, లవంగాలు, ఏలకులు, నువ్వులు వేసి వేయించాలి. చల్లారిన తర్వాత వీటిని పొడిలా చేసుకోవాలి.
- అదే మూకుడులో కొద్దిగా నూనె పోసి వేడి చేయాలి. దానిలో ఉల్లిపాయముక్కలు, కొబ్బరితురుము, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. దీనిని మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి.
- ఒక గిన్నెలో మొలకలు, పసుపు వేసి తగినన్ని నీళ్ల పోసి- కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉంచాలి. చల్లారిన తర్వాత వీటిని ఒక గిన్నెలో తీసుకొని స్పూనుతో మెత్తగా ముద్దలా చేయాలి.
- మూకుడులో నూనె పోసి వేడి చేయాలి. దానిలో ఉల్లిపాయ ముక్కల పేస్ట్‌ను, మొలకల పేస్ట్‌ను, బంగాళ దుంప ముక్కలను కొద్దిగా నీళ్ల వేసి ఉడికించాలి. ఆ తర్వాత దానిలో ముందుగా తయారుచేసుకున్న పొడిని కలపాలి.
- ఈ మిశ్రమం బాగా ఉడికిన తర్వాత దానిలో పచ్చి మిరపకాయ ముక్కలు, కారం, ఉప్పు వేసి ఒక పది నిమిషాలు ఉడికించాలి.
- దీనిని కిందకు దింపి నిమ్మరసం కలపాలి. మిసాల్ బ్రెడ్, మిక్సర్‌తో పాటుగా తినటానికి అందించాలి.

జాగ్రత్తలు
- కొందరు మిసాల్ బ్రెడ్‌ను వెన్న లేదా నెయ్యితో కాల్చి తింటారు. అలా తింటే రుచి పెరుగుతుంది.
- మొలకలు, బంగాళదుంపలు మెత్తగా అయ్యేలా ఉడికిస్తే మంచి రుచి వస్తుంది.
- పావ్ బ్రెడ్ అన్ని కిరాణా దుకాణాలలోను లభిస్తుంది.

అలూ భునా

ఉత్తర భారత దేశంలో చలికాలంలో దీన్ని ఎక్కువగా తింటారు. దీనిలో అన్ని రకాల కూరగాయలు వేయటం వల్ల చాలా రుచికరంగా ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు:

ఉడికించిన బంగాళ దుంప ముక్కలు: నాలుగు కప్పులు, టమోటా ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, క్యాప్సికం ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక చెంచా, పచ్చి మిరపకాయ ముక్కలు- రెండు స్పూన్లు, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, గరం మసాలా- రెండు చెంచాలు, జీలకర్ర - ఒక చెంచా, పెరుగు- ఒక కప్పు, క్రీమ్- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, నూనె- పావుకప్పు ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని,

తయారీ విధానం:

ఒక మూకుడులో నూనె వేడి చేయాలి. దానిలో జీలకర్రను వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించాలి. ఉల్లిపాయ ముక్కలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చి మిరపకాయ ముక్కలు, టమోటా ముక్కలు, కాప్సికం ముక్కలు వేసి వేయించాలి.

- ఈ మిశ్రమంలో పెరుగు వేయాలి. దానిలో గరం మసాలా, ధనియాల పొడి, కారం వేసి కలపాలి. చివరగా బంగాళదుంప ముక్కలు వేసి కలపాలి.
- దాన్ని దింపిన తర్వాత క్రీమ్, తరిగిన కొత్తిమీర వేయాలి.



జాగ్రత్తలు
- కొందరు కొద్దిగా ఉల్లిపాయలను, జీలకర్రను నూనెలో వేయించి కూరపైన పోపులా వేస్తారు. దీని వల్ల రుచి పెరుగుతుంది.
- బంగాళదుంప ముక్కలు ముద్దగా కాకుండా విడివిడిగా ఉంటే తినేటప్పుడు బావుంటుంది.

281 పీజీ మెడికల్ సీట్లు పోయినట్లే!

- వైద్య విద్యలో ఈ సీట్లు స్థానికేతరులకు?
- హైకోర్టు ఆదేశాలతో పీజీ తుది మెరిట్ జాబితాలో వీరిని చేర్చిన కాళోజీ ఆరోగ్య వర్సిటీ
- తెలంగాణ విద్యార్థులకు ఆ మేరకు నష్టమే
- మెడిసిన్ పీజీ ప్రవేశాల ప్రక్రియ షురూ

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య కళాశాలల్లో నిర్వహించే పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో మన విద్యార్థులు సీట్లు కోల్పోతున్నారు. ఇలా కోల్పోయే సీట్ల సంఖ్య వందల్లోనే ఉండనుంది. శుక్రవారం కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ వైద్య విద్య పీజీ తుది మెరిట్ జాబితాను విడుదల చేసింది. అందులో మొత్తం 3314 మంది అర్హులున్నారని పేర్కొంది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు తుది జాబితాలో 281 మంది విద్యార్థుల పేర్లను చేర్చుతున్నట్లు వెల్లడించింది. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారైనప్పటికీ తెలంగాణలోనే ఎంబీబీఎస్ చదవడం వల్ల జాబితాలో వారి పేర్లు చేర్చారు. అంటే తెలంగాణ స్థానికత లేకపోయినప్పటికీ వారికి ఇక్కడ సీట్లివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన వారినీ స్థానిక కోటా కింద పరిగణించాలని హైకోర్టు తాజాగా తీర్పు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎంబీబీఎస్‌తో పాటు పాఠశాల విద్య కూడా రాష్ట్రంలోనే చదివి ఉండాలి. కానీ, ఆలిండియా, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా కింద తెలంగాణలో పెద్దసంఖ్యలో ఇతర రాష్ట్రాల విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ చేశారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో ఎంబీబీఎస్ చేసి, తమకు పీజీ ప్రవేశాల్లో అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విద్యా సంవత్సరానికి వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. దీంతో వారంతా స్థానికులయ్యారు. ఆరోగ్య వర్సిటీ జాబితా ప్రకారం 281 మంది ఉండగా.. ఆ మేరకు రాష్ట్ర విద్యార్థులు సీట్లు కోల్పోతారని వైద్యవిద్య నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో సుమారు 2886 పీజీ సీట్లున్నాయి.

పీజీ ప్రవేశాల ప్రక్రియ షురూ

స్థానికతపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో పీజీ వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియను కాళోజీ హెల్త్ వర్సిటీ ప్రారంభించింది. పీజీ తుది మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం 4 గంటలలోగా తెలపాలని ఆరోగ్య వర్సిటీ కోరింది. 3314 మందితో కూడిన మెరిట్ జాబితాను వర్సిటీ తన వెబ్‌సైట్‌లో ఉంచింది. తుది జాబితాలో ఉన్నవారే కౌన్సెలింగ్‌కు అర్హులవుతారు. మరోవైపు తెలంగాణలో ఎంబీబీఎస్ చదవకుండా పీజీ కోసం దరఖాస్తు చేసిన 34 మంది అభ్యర్థులను వర్సిటీ అనర్హులుగా ప్రకటించింది. వారి వివరాలను కూడా వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అలాగే పీజీ ఆయుష్ కోర్సులకు సంబంధించిన ప్రొవిజనల్ ఫైనల్ మెరిట్ జాబితాను కూడా విడుదల చేసింది. కన్వీనర్ కోటాలోని ఎండీ ఆయుర్వేద, ఎండీ హోమియో, ఎండీ యునానీ ప్రవేశాలకు సంబంధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టింది.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


రేవంత్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం, సాఫ్ట్‌వేర్ కొలువు.. ఇలా ఏదో ఒక ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించక, నిరుద్యోగాన్ని భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, వెంకిర్యాల్‌కు చెందిన నశబోయిన రేవంత్(25) డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్ వచ్చి ఓ ప్రైవేటు సంస్థలో కొద్ది రోజులు పని చేశాడు. అనంతరం ఆ ఉద్యోగం మానేసి పలు పోటీ పరీక్షలు రాశాడు. వాటిల్లో ఆశించిన ఫలితం రాక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. కానీ, ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రేవంత్ శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టాల వద్ద మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టానికి తరలించిన రైల్వే పోలీసులు రేవంత్ కుటుంబానికి సమాచారం ఇచ్చారు.

రాష్ట్రంలో సర్వేయర్ల కొరత!

'భూ భారతి' అమల్లో వారే కీలకం.. మండలాల్లో అరకొరగానే సిబ్బంది

- రాష్ట్రవ్యాప్తంగా 600కి పైగా ఖాళీలు
- సంక్రాంతిలోపు 1000 మందిని నియమిస్తామన్న మంత్రి పొంగులేటి
- ఇప్పటికీ ఖరారవని విధివిధానాలు
- 3 వారాల్లో నియామకాలు సాధ్యమేనా?

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా 'అనుభవదారుల సర్వే' చేయించి, శాశ్వత పరిష్కారం చూపుతామని భూభారతి చట్టం-2024లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. 2014కి ముందు పాస్‌పుస్తకాలు ఉండి, అనుభవదారులుగా ఉన్న వారు ధరణి అమల్లోకి వచ్చాక రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని విస్మరించిందని, భూభారతి చట్టం ద్వారా ఇలాంటి వారికి న్యాయం చేస్తామని, ఎవరూ ఆందోళన చెందనక్కర్లేదని రేవంత్ సర్కారు స్పష్టం చేసింది. పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురికావద్దని తెలిపింది. అయితే భూభారతి చట్టం అమల్లో సత్ఫలితాలు రావాలంటే కీలకమైన సర్వే విభాగాన్ని బలోపేతం చేయాలని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.



సగానికిపైగా ఖాళీలే..

ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాలు, 74 రెవెన్యూ డివిజన్లు, 612 మండలాలు ఉన్నాయి. త్వరలో మండలాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే ప్రచారం కూడా జరుగుతోంది. రాష్ట్రంలో సుమారు 1000 మంది సర్వేయర్లు ఉండాలి. కానీ, ప్రస్తుతం 410 మందే ఉన్నారు. తగినంత మంది సర్వేయర్లు లేకపోవడంతో సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఒక సర్వేయరే రెండు మూడు మండలాల్లో పనిచేయాల్సిన పరిస్థితి ఉంది. డబ్బులు ఇస్తే తప్ప కదలరనే ఆరోపణలు ఉన్న తరుణంలో.. అరకొరగా ఉన్న సర్వేయర్లతో రైతులు, ప్రజలు, గ్రేటర్ హైదరాబాద్ లాంటి చోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులు విసిగిపోతున్నారు. మండల కేంద్రాల్లో పెండింగ్ దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి.

సంక్రాంతిలోపు భర్తీ అయ్యేనా..?

సంక్రాంతిలోపు గ్రామ రెవెన్యూ సిబ్బందితోపాటు సర్వేయర్ల నియామకం చేపడతామని ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గతంలో పని చేసిన వీఆర్‌వోల నుంచే సర్వేకు అవసరమైన 1000 మందిని నియమిస్తామని తెలిపారు. కానీ, ఇప్పటి వరకు దీనికి సంబంధించిన విధివిధానాలు ఖరారవలేదు. సంక్రాంతికి ఇంకా మూడు వారాలే ఉంది. ఆలోపు నియామకాలు సాధ్యమా? అన్నది ప్రభుత్వానికే తెలియాలి.

కేబీఆర్ పార్క్ చుట్టూ స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌లు

వేగంగా పూర్తి చేసేందుకు స్టీల్‌తో నిర్మాణం.. రూ.1090 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం

- వచ్చే వారం టెండర్లకు జీహెచ్ఎంసీ సిద్ధం
- విరించి ఆస్పత్రి నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్ వరకు విస్తరణ
- 303 ఆస్తుల సేకరణకు మార్కింగ్
- బాలకృష్ణ, చిరంజీవి, జానారెడ్డి ఇళ్ల మార్కింగ్



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ఆరు జంక్షన్లలో ఆరు స్టీల్ వంతెనలు, ఆరు అండర్‌పాస్‌లు నిర్మించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. ఇందుకోసం రోడ్ నంబర్ 12 ప్రారంభమయ్యే విరించి ఆసుపత్రి నుంచి ఒమేగా ఆసుపత్రి, బాలకృష్ణ ఇల్లు మీదుగా జూబ్లీ హిల్స్ చెక్‌పోస్టు వరకు ఆరున్నర కిలోమీటర్ల పొడవున రోడ్డును విస్తరించనున్నారు. విరించి ఆసుపత్రి నుంచి బీఆర్ఎస్ భవన్ కూడలి వరకు 100 అడుగుల మేర విస్తరిస్తారు. అక్కడి నుంచి చెక్‌పోస్ట్ వరకు 120 అడుగుల మేర విస్తరిస్తారు. చెక్‌పోస్ట్ వద్ద మెట్రో రైల్‌కు ఇబ్బంది కలగకుండా చూడటానికి ఏకంగా 150 అడుగుల మేర విస్తరిస్తారు. విస్తరణకు సంబంధించి ఇప్పటికే 303 ఆస్తులను మార్కింగ్ చేశారు. తొలిదశలో 97 ఆస్తులకు సంబంధించి సర్వేను పూర్తి చేసి, భూసేకరణ నోటీసులు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఆరు జంక్షన్లలో వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి రూ.1090 కోట్లు అవుతాయని అంచనా వేశారు. మొదటి ప్యాకేజీలో కేబీఆర్ పార్కు, జూబ్లీచెక్‌పోస్టు జంక్షన్ల వద్ద రూ.580 కోట్లతో, ప్యాకేజీ-2లో జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-45, ఫిల్మ్‌నగర్, అగ్రసేన్, కేన్సర్ ఆస్పత్రి జంక్షన్ల వద్ద రూ.510 కోట్లతో గ్రేడ్ సెపరేటర్లుగా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మిస్తారు. వచ్చే వారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఇంజనీరింగ్ విభాగం సిద్ధమవుతుంది. 15 రోజుల గడువుతో బిడ్‌లను ఆహ్వానిస్తారు. ఏజెన్సీలు ముందుకు వస్తే సాంకేతిక, ప్రైస్ బిడ్‌లు పరిశీలిస్తారు. రాకపోతే మరో దఫా టెండర్ ఉంటుంది. అన్ని విభాగాల ఆమోదం తర్వాత ఒప్పందం కుదుర్చుకుంటారు. హెచ్-సిటీలో భాగంగా రూ.7032 కోట్లతో వివిధ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం, రహదారుల విస్తరణ పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. హెచ్-సిటీ మొదటి దశలో రూ.3446 కోట్ల పనులు చేపడతారు.



Flyover and Underpass at Film Nagar Jn

ప్రముఖుల ఆస్తులు

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. ఇది గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టు. వందల చెట్లు తొలగించాల్సి ఉంటుందని పర్యావరణ ప్రేమికులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో బ్రేక్ పడింది. దాంతో పార్క్‌ను ముట్టుకోకుండా రెండో వైపు ఉండే ఆస్తులను సేకరించాలని నిర్ణయించారు. రహదారి విస్తరణలో పలువురు ప్రముఖుల ఆస్తులు సేకరించనున్నారు. మాజీ మంత్రి జానారెడ్డి, అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, అపోలో చౌరస్తా వద్ద ఉన్న చిరంజీవి పాత ఇల్లు, భవ్య సంస్థలకు చెందిన భవనం, రోడ్ నెంబర్ 45 చౌరస్తా వద్ద ప్రముఖ నటుడు బాలకృష్ణ నివాసం విస్తరణతో ప్రభావితం కానున్నాయి. విరించి నుంచి బీఆర్ఎస్ ఆఫీస్ జంక్షన్ వరకు రోడ్ నంబరు 12లో ప్రస్తుతం 50-60 అడుగుల మేర రహదారి ఉంది. దీనిని 100 అడుగులకు విస్తరిస్తారు. అక్కడి నుంచి చెక్‌పోస్టు వరకు ప్రస్తుతం 80-100 అడుగులు ఉంది. దాన్ని 120 అడుగులకు విస్తరిస్తారు. ఖాళీ స్థలాలున్న వారు విస్తరణకు సానుకూలంగా స్పందిస్తున్నారు. భవనాలున్న వారు ముందుకు రాలేదు. దీంతో చట్ట ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి, ప్రజాభిప్రాయ సేకరణతో సేకరిస్తారు. కనీసం ఆరు నెలలు పడుతుందని అంచనా. ఎవరైనా కోర్టుకు వెళితే మరింత ఆలస్యమవుతుంది. అత్యంత రద్దీగా ఉండే ఈ రోడ్ల మీద సిమెంట్ నిర్మాణాలయితే ఎంత వేగంగా చేసినా రెండేళ్లకు పైగా పడుతుంది. నిర్మాణ కార్యక్రమాలకు చోటు కూడా లేదు. ట్రాఫిక్‌ను పూర్తిగా బ్లాక్ చేయాల్సి ఉంటుంది. అందుకే, స్టీల్ వంతెనల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దాంతో ఏడాదిన్నరలోపే పూర్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. మొదట రూ.826 కోట్లతో ఆరు జంక్షన్లను ప్రతిపాదించారు. స్టీల్ వంతెనల వల్ల అంచనా వ్యయం 31 శాతం పెరిగి రూ.1090 కోట్లు అయ్యింది.


బతుకమ్మతో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ఓసారి ఇంటికిరా కొడుకా..!!

- చావుకు దగ్గరవుతున్నా.. నీ ముఖం చూడాలని ఉంది
- మావోయిస్టు నేత దామోదర్ తల్లి ఆవేదన


మేడారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): "ఇంటికి రా... కొడుకా.. చావుకు దగ్గరవుతున్నా.. నీ ముఖం చూడాలని ఉంది.. నా కళ్లు పోయే, కాళ్లు పోయే, చేతులు పోయే".. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కార్యదర్శి బడే చొక్కరావు అలియాస్ దామోదర్ తల్లి బతుకమ్మ ఆవేదన ఇది. వృద్ధాప్యం, అనారోగ్యంతో అవస్థలు పడుతున్న ఆ తల్లి తన కొడుకు కోసం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మావోయిస్టు ఉద్యమంలో ఉన్నవారిని జన జీవన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు పోలీసు శాఖ చేపట్టిన 'పోరు కన్నా ఊరు మిన్న మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ శబరీష్.. దామోదర్ తల్లి బతుకమ్మను శుక్రవారం కలిశారు. తాడ్వాయి మండలం కాల్వపల్లిలోని ఆమె ఇంటికి వెళ్లి మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్యులతో ఆమెకు పరీక్షలు చేయించారు. బతుకమ్మ నరాల బలహీనత, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్నదని గుర్తించారు. ఎస్పీతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురైన బతుకమ్మ.. తన కొడుకును చూడాలని ఉంది అంటూ కన్నీరు పెట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 103 మంది తమ కుటుంబాలను వదిలి మావోయిస్టుల్లో చేరి ఏళ్లుగా అజ్ఞాతంలో జీవిస్తున్నారని తెలిపారు. వారంతా లొంగిపోయి తిరిగి తమ కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. స్వచ్ఛందంగా లొంగిపోయిన వారికి రిలీఫ్ ఫండ్, ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

చిత్రజ్యోతి

SINCE 1965

అల్లు అర్జున్‌తో పోల్చొద్దు

అమితాబ్ బచ్చన్



అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి'. ప్రస్తుతం దీని 16వ సీజన్ ప్రసారమవుతోంది. తాజా ఎపిసోడ్‌లో కంటెస్టెంట్‌గా పాల్గొన్న ఓ గృహిణి మాట్లాడుతూ 'తనకు అమితాబ్, అల్లు అర్జున్ అంటే ఎంతో ఇష్టమని అన్నారు. దీనికి వెంటనే అమితాబ్ స్పందిస్తూ ' అల్లు అర్జున్ తనకు వచ్చిన గుర్తింపులన్నింటికీ అర్హుడు. నేను కూడా అతనికి వీరాభిమానినే. ఇటీవల బన్నీ నటించిన పుష్ప-2 సినిమా మంచి విజయం సాధించింది. మీరు ఇంకా ఆ సినిమా చూడకుంటే వెంటనే చూడండి. అతడు గొప్ప ప్రతిభావంతుడు. అతనితో నన్ను పోల్చొద్దు' అని అన్నారు. ఈ వీడియో క్లిప్‌ను సోనీ టీవీ తన అధికారిక వెబ్ పేజీలో షేర్ చేయగా వైరల్ అయ్యింది.



అజిత్ ఫాస్ట్ బీట్ సాంగ్

అజిత్‌కుమార్ హీరోగా మగిళ్ తిరుమేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విడాముయర్చి'. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అర్జున్, త్రిషా కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతోంది. రీసెంట్‌గా విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. దాంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజాగా ఈ మూవీ నుంచి 'సవదీకా' అనే ఫాస్ట్ బీట్ ఎనర్జిటిక్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆంథోని దాసన్ పాడిన పాటకు అనిరుద్ రవిచందర్ సంగీతం అందించారు.

రాజుగారి పెళ్లి



నవీన్ పొలిశెట్టి హీరోగా నూతన దర్శకుడు మారి రూపొందిస్తున్న సినిమా 'అనగనగా ఒక రాజు'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. నవీన్ పొలిశెట్టి పుట్టిన రోజు సందర్భంగా సినిమా నుంచి ప్రీ వెడ్డింగ్ వీడియో టీజర్‌ను నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ వీడియో ఎంతో ప్రత్యేకంగా, వినోదాత్మకంగా ఉంది. నవీన్ పొలిశెట్టి పోషించిన రాజు పాత్ర వివాహానికి సిద్ధమవుతున్నట్లు వీడియోలో చూపించారు. రాజుగారి పెళ్లి అంటే ఎలా ఉండాలి? అంటూ భోజనాల వద్ద చమ్మక్ చంద్ర చేసిన హడావుడి నవ్వులు పూయించింది. అనంత్ అంబానీ వివాహానికి హాజరైన హాలీవుడ్ ప్రముఖుల ఫోన్ నెంబర్ల కోసం, నవీన్ ఏకంగా ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి మాట్లాడినట్లు చూపించడం కడుపుబ్బా నవ్వించింది. ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌లో వధువుగా నటి మీనాక్షి చౌదరి కనిపించారు. ఇక్కడ కూడా నవీన్ పోషించిన రాజు పాత్ర నవ్వులు పంచింది. 2025లో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు.

సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్



ప్రశాంత్ కృష్ణ, అనీషా ధామ, శ్రీనివాస్ రామిరెడ్డి, ఐశ్వర్య హోలక్కల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డ్రీమ్ క్యాచర్'. సీయోల్ మోషన్ పిక్చర్స్ బేనర్‌పై దర్శకుడు సందీప్ కాకుల రూపొందిస్తున్నారు. జనవరి 3న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. హీరో ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ 'సైకలాజికల్ థ్రిల్లర్‌గా సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ని ఈ చిత్రం ఇస్తుంది. ట్రైలర్ చూశాక నేను అడివి శేష్, రానా లా ఉన్నానంటూ కామెంట్స్ వస్తున్నాయి' అని అన్నారు. డైరెక్టర్ సందీప్ కాకుల మాట్లాడుతూ 'సినిమా చేయాలనేది నా డ్రీమ్. కలల మీద సినిమా చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ 'డ్రీమ్ క్యాచర్' మూవీ మొదలుపెట్టాను. మొత్తం షూటింగ్ అంతా హైదరాబాద్‌లోనే చేశాం. ఒక మంచి మూవీ చేస్తే ఎక్కడైనా ఆదరిస్తారని నమ్మాను' అని తెలిపారు. నటుడు శ్రీనివాస్ రామిరెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో కార్తిక్ అనే క్యారెక్టర్ చేశాను. మనం జీవితంలో ఏదో ఒక సందర్భంలో జరిగిన సంఘటనలో చిక్కుకు పోతాం. ఆ ఘటన జరిగినప్పుడు మనసులో ఒక సంఘర్షణ మొదలవుతుంది. అలా తన జీవితంలో జరిగిన ఓ ఘటన ప్రభావం నుంచి బయటపడేందుకు హీరో ఎలా ప్రయత్నించాడు అనేది ఈ సినిమా కథ' అని వివరించారు.

హృదయాలను హత్తుకునే ప్రేమకథ



సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరినీ' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి.సాయిప్రతాప్ రెడ్డి, జయశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. 1990ల నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను సంగీత దర్శకుడు ఆర్.పీ.పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాలని గుర్తుతెస్తుంది" అని చెప్పారు. "ఇది అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం. దర్శకుడు ఈ చిత్రాన్ని సహజంగా తెరకెక్కించారు" అని హీరో సువిక్షిత్ అన్నారు.

తెలుగు ప్రేక్షకులు పల్లె కథలకు పట్టం కట్టారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన చిత్రాలను ఆదరించారు. పల్లెటూరు నేపథ్యం, మంచి కథ, బెస్ట్ విజువలైజేషన్ ఉంటే చాలు... అవి చిన్న సినిమాలైనా పెద్ద విజయాలనే నమోదు చేశాయి. మొన్నటి సాయి దుర్గాతేజ్ 'విరూపాక్ష' మొదలు... నేటి కిరణ్ అబ్బవరం 'క' సినిమా వరకు ప్రేక్షకుల మెప్పు పొందాయి. అయితే కొన్ని చిత్రాలు మాత్రం ఆడియన్స్‌ను మెప్పించలేకపోయాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్ జానర్‌లో ఈ ఏడాది వచ్చిన అలాంటి ఓ ఐదు సినిమాలు ఏవో చూద్దాం!

పల్లె కథకు ప్రాధాన్యం



జాతర, ఎన్నికల చుట్టూ..

సెప్టెంబరులో రిలీజ్ అయిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని నాగబాబు కూతురు నిహారిక నిర్మించారు. గోదావరి జిల్లాలోని పురుషోత్తమపల్లె అనే గ్రామానికి సంబంధించిన కథ. ఆ గ్రామంలో 12 ఏళ్లకు ఒక సారి భరింకాళమ్మ జాతర జరుగుతుంది. ఈసారి ఉప సర్పంచ్ ఎన్నికలకు పదిరోజుల ముందు జాతర జరగాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఆ ఊరికి చెందిన యువకుడు శివ... ప్రస్తుత సర్పంచ్ పొలిశెట్టి బుజ్జిపై పోటీకి నిలబడేందుకు ముందుకు వస్తాడు. గత జాతర సమయంలో కమిటీ కుర్రోళ్ల(11 మంది) కారణంగా ఊర్లో జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి జాతర జరిగేంత వరకూ ఎన్నికల ప్రచారం చెయ్యొద్దని ఆ ఊరి పెద్దలు నిర్ణయం తీసుకుంటారు. ఆ తర్వాత ఏం జరిగింది? అనే దాని చుట్టూ కథ తిరుగుతుంది. ఈ సినిమా చూస్తున్నంత సేపూ 90వ దశకానికి చెందిన వారంతా తమ బాల్యాన్ని నెమరు వేసుకుంటారు. ఆ రోజులు మళ్లీ వస్తే బాగుండునని ఆశపడతారు. ప్రేక్షకుల్ని బాల్యంలోకి తీసుకెళ్లడంలో డైరెక్టర్ యదు వంశీ ప్రేక్షకులను మెప్పించగలిగారు.



పెళ్లి నేపథ్యం



అక్టోబరులో విడుదలైన 'లగ్గం' సినిమాకు దర్శకుడు రమేశ్ చెప్పాల. తెలంగాణాలో జరిగే పెళ్లి నేపథ్యంలో కథ సాగుతుంది. ఇక్కడి పెళ్లిలో జరిగే ఆచారాలు, సంప్రదాయాలను తెరకెక్కించారు. కథ విషయానికి వస్తే...తెలంగాణ ప్రాంతంలోని ఓ గ్రామంలో సదానందం, అతని కూతురు మానస నివసిస్తుంటారు. మేనల్లుడు చైతన్య. అల్లుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉందని లగ్గం ఖాయం చేస్తాడు సదానందం. అనుకోని పరిస్థితుల్లో చైతన్య ఉద్యోగం పోతుంది. ఈ పరిస్థితుల్లో వారి పెళ్లి జరిగిందా? లేదా? అన్నదే కథ. ముఖ్యంగా ఈ సినిమాకు పాటలు ప్లస్ పాయింట్ అయ్యాయి. ఈ పాటలన్నీ గ్రామీణ నేపథ్యాన్ని అల్లుకునే ఉన్నాయి. క్లయిమాక్స్‌లో పెళ్లి కూతురు అప్పగింత ఎపిసోడ్ సినిమాలో హైలెట్‌గా నిలిచింది.



పల్లె కథ

1980లో తెలంగాణలోని ఒక పల్లెకు సంబంధించిన కథ 'పొట్టేల్'. వంశపారంపర్యంగా ఆ ఊరి పటేళ్లకి అమ్మవారు పూనుతూ ఉంటుంది. ఆ సమయంలో పటేళ్లు ఏది చెబితే అదే వేదం. కొత్త పటేల్ నిమ్న వర్గాల వారిని బడికి వెళ్లకూడదని ఆ పూనకంలో ఆదేశిస్తాడు. కాని గంగాధర్ తన కూతురు సరస్వతిని చదివించాలనుకుంటాడు. ఈ నేపథ్యంలో కథ సాగుతుంది. ఇది పూర్తిగా ఒక గ్రామానికి సంబంధించిన స్టోరీ.

1977 నాటి కథ



కిరణ్ అబ్బవరం నటించిన 'క' సినిమా కథ అంతా 1977 బ్యాక్‌డ్రాప్‌లో జరుగుతుంది. అనాథ అయిన హీరోకు చిన్నప్పటి నుంచి పక్కవాళ్ల ఉత్తరాలు చదివే అలవాటు ఉంటుంది. పోస్ట్ మ్యాన్ అయితే అందరి ఉత్తరాలు చదవొచ్చు అనే ఆలోచనతో కృష్ణగిరి అనే గ్రామంలో పోస్ట్ మ్యాన్ అసిస్టెంట్‌గా జాయిన్ అవుతాడు. అయితే ఆ గ్రామంలో వరుసగా అమ్మాయిలు మిస్ అవుతూ ఉంటారు. వారిని కిడ్నాప్ చేసిందెవరు? కృష్ణగిరి గ్రామానికి చెందిన అమ్మాయిలే ఎందుకు మిస్ అవుతున్నారు? ఉత్తరాలు చదివే అలవాటు ఉన్న హీరోకు తెలిసిన విషయాలేమిటి? అనే అంశాల చుట్టూ కథ అల్లారు దర్శకులు. ఈ సినిమా కిరణ్‌కు మంచి బ్రేక్ ఇచ్చింది.



పల్లెటూరి బ్యాక్‌డ్రాప్

పల్లెటూరి బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కిన చిత్రం 'ఈసారైనా'. విప్లవ్ ఇందులో హీరోగా నటించడమే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా, మాటల రచయితగా కూడా వ్యవహరించారు. ఈ మూవీలో హీరో నాలుగేళ్లుగా గవర్నమెంట్ జాబ్ కోసం ఎదురు చూస్తుంటాడు. అదే సమయంలో ఆ ఊరిలో పనిచేస్తున్న టీచర్‌తో ప్రేమలో పడతాడు. ఆమె తండ్రి మాత్రం గవర్నమెంట్ జాబ్ వస్తేనే పెళ్లిచేస్తానని హీరోకు కండీషన్ పెడతాడు. హీరో జాబ్ కొట్టాడా లేదా? చివరకు ఏమైందనేది స్టోరీ. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో సాగిన ఈ చిత్రం మొత్తం షూటింగ్‌ను ఒక పల్లెటూరిలోని అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించారు. పచ్చని పలెటూరిలో ప్రశాంతంగా సాగే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ ఇది.

'బేర్' మంటున్న రూపాయి



మరో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 85.48కి పతనం.. త్వరలో 86 స్థాయికి పడిపోయే చాన్స్

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనం కొనసాగుతోంది. శుక్రవారం డాలర్‌తో 21 పైసలు నష్టపోయి మరో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి రూ.85.48 వద్ద ముగిసింది. 2023 ఫిబ్రవరి 2వ తేదీ తర్వాత డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒకే రోజు ఇంత భారీగా పడిపోవడం ఇదే మొదటిసారి. ఆ రోజు డాలర్‌తో భారత కరెన్సీ మారకం రేటు 68 పైసలు నష్టపోయింది. శుక్రవారం ఉదయం డాలర్‌తో 85.31 వద్ద ప్రారంభమైన రూపాయి మారకం రేటు ఇంట్రాడేలో ఒక దశలో 53 పైసలు నష్టపోయి 85.80 స్థాయిని తాకింది. ఆ దశలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద ఎత్తున డాలర్లను అమ్మకానికి పెట్టడంతో కొద్దిగా కోలుకుని 21 పైసల నష్టంతో 85.48 వద్ద ముగిసింది.

రెండు వారాలుగా ఇదే ట్రెండ్: గడిచిన రెండు వారాలుగా అమెరికా డాలర్‌తో రూపాయి మారకం రేటు ఆపసోపాలు పడుతోంది. గురువారం కూడా డాలర్‌తో రూపాయి 12 పైసలు నష్టపోయి 85.27 వద్ద ముగిసింది. అంతకు ముందు రెండు రోజుల్లోనూ 13 పైసలు నష్టపోయింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే వచ్చే కొద్ది రోజుల్లోనే డాలర్‌తో రూపాయి మారకం రేటు 86కు పతనమయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. రూపాయి మారకం రేటు పతనానికి ఈ కింది అంశాలు దోహదం చేస్తున్నాయి.

డాలర్లకు డిమాండ్: డిసెంబరు 31 సమీపిస్తుండడంతో దిగుమతిదారులు.. తమ చెల్లింపుల కోసం డాలర్ల కోసం ఎగబడుతున్నారు. అయితే డిమాండ్‌కు తగ్గట్టు మార్కెట్లో డాలర్ల సరఫరా లేదు. దీంతో గత రెండు వారాలుగా ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి గింగిరాలు పోతోంది.

ఎఫ్‌పీఐల అమ్మకాలు: దేశీయ స్టాక్ మార్కెట్ మళ్లీ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. ఈ నెల ప్రారంభంలో అమ్మకాల హోరు కొద్దిగా తగ్గించిన ఎఫ్‌పీఐలు మళ్లీ అమ్మకాలకు దిగాయి. గురువారం ఈ సంస్థలు రూ.2,376.67 కోట్ల విలువైన నికర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఇది కూడా డాలర్‌తో రూపాయి మారకం రేటును దెబ్బతీస్తోంది.

అమెరికా వడ్డీ రేట్లు: అమెరికాలో వడ్డీ రేట్లు మళ్లీ పైచూపులు చూస్తున్నాయి. పదేళ్ల కాల పరిమితి ఉండే అమెరికా ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీ రేటు 0.76 శాతం పెరిగి ఏడు నెలల గరిష్ఠ స్థాయి 4.61 శాతానికి చేరింది. దీంతో భారత డెట్ ఫండ్స్‌లో మదుపు చేసిన ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను మరింత సురక్షితంగా భావించే అమెరికా రుణ పత్రాలకు తరలిస్తున్నాయి. ఇది కూడా రూపాయిపై ఒత్తిడి పెంచుతోంది.

బలపడుతున్న డాలర్: డొనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు మరింత పుంజుకుంది. గురువారం మరో 0.04 శాతం పెరిగి 107.94కు చేరింది. ఈ ప్రభావం రూపాయి మీదా కనిపిస్తోంది.

చమురు సెగ: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర మళ్లీ పైచూపులు చూస్తోంది. శుక్రవారం బ్యారల్ బ్రెంట్ రకం చమురు ధర 73.37 డాలర్లకు చేరింది. త్వరలోనే ఇది మరింత పెరిగి 80 డాలర్లకు చేరువవుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే మన ద్రవ్య లోటు పెరిగి రూపాయి మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

ఫారెక్స్ నిల్వలూ ఢమాల్

రూపాయి మారకం రేటుతో పాటు భారత విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ నెల 20తో ముగిసిన వారాంతానికి ఫారెక్స్ నిల్వలు 64,439 కోట్ల డాలర్లకు (సుమారు రూ.55.08 లక్షల కోట్లు) పడిపోయాయి. గత ఏడు నెలల్లో ఫారెక్స్ నిల్వలు ఎన్నడూ ఇంత కనిష్ఠ స్థాయికి చేరలేదు. అంతకు ముందు వారంతో పోలిస్తే ఇది 850 కోట్ల డాలర్లు తక్కువని ఆర్‌బీఐ తెలిపింది. గత నెల రోజుల్లో ఫారెక్స్ నిల్వలు ఎన్నడూ ఒక వారంలో ఇంత భారీగా పడిపోలేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, విదేశీ చెల్లింపుల భారం పెరగడం, రూపాయి మారకం రేటును ఒక స్థాయిలో నిలబెట్టేందుకు ఆర్‌బీఐ ఓపెన్ మార్కెట్ ద్వారా డాలర్లను విక్రయించడం ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

లిస్టింగ్ మెరుపులు

147% లాభంతో మమతా మెషినరీ షేరు లిస్టింగ్
అదేబాటలో ట్రాన్స్‌రైల్ లైటింగ్, దామ్ క్యాపిటల్

ముంబై: ప్రైమరీ మార్కెట్లో మళ్లీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)లు కళకళలాడుతున్నాయి. కొద్దికాలంగా ఉన్న స్తబ్దుగా ఉంటూ వస్తున్న ఐపీఓ మార్కెట్ లిస్టింగ్ రోజునే మరోసారి ఇన్వెస్టర్లకు మంచి లాభాలను అందిస్తోంది. తాజాగా పబ్లిక్ ఇష్యూకు వచ్చిన మమతా మెషినరీ, దామ్ క్యాపిటల్ అడ్వైజర్స్, ట్రాన్స్‌రైల్ లైటింగ్, కంకార్డ్ ఎన్విరో, సనాతన్ టెక్స్‌టైల్స్. లిస్టింగ్ రోజే అదరగొట్టాయి. ప్యాకేజింగ్ మెషినరీ సంస్థ మమతా మెషినరీ శుక్రవారం ఏకంగా 146.91% లాభంతో రూ.600 వద్ద లిస్ట్ అయ్యింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ ఒక్కో షేరును రూ.243 ధరతో జారీ చేసింది. చివరకు 159.23% లాభంతో అప్పర్ సర్క్యూట్ లిమిట్‌ను తాకి రూ.629.95 వద్ద క్లోజైంది. ఎన్‌ఎస్ఈలోనూ 159.25 శాతం లాభంతో రూ.630 వద్ద ముగిసింది.

ట్రాన్స్‌రైల్ లైటింగ్: ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ ఒక్కో షేరును రూ.432కి జారీ చేయగా శుక్రవారం మార్కెట్లో 35.45% లాభంతో రూ.585.15 వద్ద లిస్ట్ అయ్యింది. ఒక దశలో బీఎస్ఈలో 39.81% లాభపడిన ఈ షేరు చివరకు 28.07% లాభంతో రూ.553.30 వద్ద స్థిరపడింది.

దామ్ క్యాపిటల్: బీఎస్ఈలో శుక్రవారం ఈ షేరు రూ.283 ధరతో పోల్చితే 38.83% ప్రీమియంతో రూ.392.90 వద్ద నమోదైంది, ఇంట్రాడేలో ఒక దశలో ఈ షేరు ఏకంగా 61.44% దూసుకుపోయి రూ.456.90 స్థాయిని తాకింది. చివరకు 46.66% ప్రీమియంతో రూ.415.05 వద్ద క్లోజైంది.

కంకార్డ్ ఎన్విరో: ఈ కంపెనీ రూ.701 ధరతో ఐపీఓకి రాగా శుక్రవారం బీఎస్ఈలో 18.68% లాభంతో రూ.832 వద్ద లిస్ట్ అయ్యింది. ఇంట్రాడేలో 22.67% లాభంతో రూ.859.95 స్థాయిని తాకిన ఈ షేరు చివరకు 18.18% లాభంతో రూ.828.45 వద్ద స్థిరపడింది.

సనాతన్ టెక్స్‌టైల్స్: శుక్రవారం ఈ షేరు ఇష్యూ ధర రూ.321తో పోల్చితే 30.56% లాభంతో రూ.419.10 వద్ద మార్కెట్లో నమోదైంది. ఒక దశలో 31.66% లాభపడిన ఈ షేరు ట్రేడింగ్ ముగిసే సమయానికి 21.18% లాభంతో రూ.422.65 వద్ద క్లోజైంది.

సుజుకీ అధినేత ఒసాము సుజుకీ కన్నుమూత

మారుతి సుజుకీ ఏర్పాటులో కీలక పాత్ర



న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం సుజుకీ మోటార్ కార్పొరేషన్ (ఎస్ఎంసీ) డైరెక్టర్, గౌరవ చైర్మన్ ఒసాము సుజుకీ (94) మరిక లేరు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన బుధవారం కన్నుమూసినట్టు ఎస్ఎంసీ ప్రకటించింది. భారత ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధిలోనూ ఆయనది కీలక పాత్ర. లైసెన్స్ రాజ్ హయాంలో ఏ విదేశీ ఆటోమొబైల్ కంపెనీ మన దేశంలో తన కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు సాహసించేది కాదు. అలాంటి సమయంలో ఒసాము సుజుకీ.. కేంద్ర ప్రభుత్వంతో కలిసి 1981లో మారుతి ఉద్యోగ్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేశారు. భారత్‌లో కార్ల మార్కెట్‌కు ఉన్న అవకాశాలను ముందే ఊహించి సుజుకీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతారు. 2007లో ప్రభుత్వ వాటాను పూర్తిగా కొనుగోలు చేయడం ద్వారా మారుతి ఉద్యోగ్ పూర్తిగా సుజుకీ మోటార్ కార్పొరేషన్ పరమైంది. దాంతో కంపెనీ పేరూ మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్)గా మారింది. ఈ కంపెనీకి ఆయన చాలా కాలం పాటు డైరెక్టర్‌గా, గౌరవ చైర్మన్‌గా సేవలు అందించారు.

ముందు చూపున్న నేత: ఒసాము సుజుకీ మృతి పట్ల మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ ఆర్‌సీ భార్గవ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 'ముందు చూపుతో ఆయన రిస్క్ తీసుకుని ఉండకపోతే భారత ఆటోమొబైల్ రంగం ఈ రోజు ఈ స్థాయికి ఎదిగి ఉండేది కాదు' అని నివాళులు అర్పించారు. మన దేశమంటే ఆయనకు ఎంతో ప్రేమ అన్నారు. భారత-జపాన్ సంబంధాల అభివృద్ధికీ సుజుకీ ఎంతో కృషి చేశారన్నారు. ఇందుకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ని పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది.

విప్లవాత్మక మార్పులు

1981 వరకు మన దేశ కార్ల మార్కెట్లో సీకే బిర్లా గ్రూప్ కంపెనీ హిందూస్థాన్ మోటార్స్ కంపెనీ తయారు చేసే అంబాసిడర్ కార్లదే హవా. మారుతి ఉద్యోగ్ విడుదల చేసిన 'మారుతి 800' కార్లతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆర్థిక సంస్కరణల తర్వాత అనేక దేశ, విదేశీ కంపెనీలు రంగంలోకి వచ్చినా, ఇప్పటికీ మార్కెట్లో అగ్రస్థానం మారుతి సుజుకీదే. మారుతున్న టెక్నాలజీతో ఎప్పటికప్పుడు కొత్త మోడల్స్ విడుదల చేస్తూ కంపెనీ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటోంది. ఇప్పుడు కొత్త ట్రెండ్ అయిన విద్యుత్ వాహనాల ఉత్పత్తిపైనా ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగుతోంది. నాటి ప్రధాని ఇందిరతో పాటు నేటి ప్రధాని మోదీతోనూ ఒసాము సుజుకీ సత్సంబంధాలు నడిపారు. ఆయన మృతి పట్ల భారత ఆటోమొబైల్ పరిశ్రమ దిగ్గజాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

బ్యాంకింగ్, ఆటో షేర్ల దన్ను

బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లైన బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ.. శుక్రవారం బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్ల దన్నుతో లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 226.59 పాయింట్ల లాభంతో 78,699.07 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 63.20 పాయింట్లు లాభపడి 23,813.40 పాయింట్ల వద్ద క్లోజైంది. వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ 657.48 పాయింట్లు, నిఫ్టీ 225.90 పాయింట్ల మేరకు లాభపడింది.

● రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నుంచి రూ.215 కోట్ల విలువైన ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్టు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా హైదరాబాద్‌లోని 20 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో ఐదేళ్ల పాటు ఓ అండ్ ఎం సేవలను అందించాల్సి ఉంటుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	109
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	100
కర్నూలు	103	నెల్లూరు	100
విశాఖపట్నం	108	అనంతపురం	100
గోదావరి	109		

ఆహారేతర ఖర్చులే అధికం

తగ్గుతున్న వినియోగ ఖర్చులు
పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అదే ట్రెండ్
గృహ వినియోగ ఖర్చుల సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ ఖర్చుల వ్యత్యాసం రోజురోజుకు తగ్గుతోంది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'గృహ వినియోగ ఖర్చుల సర్వే' ఈ విషయం తెలిపింది. 2022 ఆగస్టు-2023 జూలై కాలంతో పోల్చితే 2023 ఆగస్టు-2024 జూలై మధ్య కాలంలో ఈ వ్యత్యాసం మరింత తగ్గినట్లు వెల్లడించింది. సమాజంలో సంపద పంపిణీ, వినియోగ ఖర్చుల అసమానతలను తెలిపే జినీ కోఎఫీషియెంట్ నమూనా కూడా ఈ విషయాన్ని బలపరుస్తోంది. దీని ప్రకారం 2023 ఆగస్టు- 2024 జూలై మధ్య కాలంలో వినియోగ ఖర్చుల అసమానత గ్రామీణ ప్రాంతాల్లో 0.266 నుంచి 0.237కు, పట్టణ ప్రాంతాల్లో 0.314 నుంచి 0.284కు తగ్గిందని సర్వే పేర్కొంది.

ఇదీ ప్రస్తుత పరిస్థితి: ప్రస్తుత ధరల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటి నెలవారీ సగటు ఖర్చు (ఎంపీసీఈ)లు రూ.3,773, పట్టణ ప్రాంతాల్లో రూ.6,459గా నమోదయ్యాయి. అదే 2023-24 కాలానికి వచ్చేసరికి గ్రామాల్లో రూ.4,122కు, పట్టణ ప్రాంతాల్లో రూ.6,996కు పెరిగినట్టు సర్వే తెలిపింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను మినహాయించినా, ప్రస్తుత ధరల ప్రకారం ఈ కాలంలో నెలవారీ గృహ వినియోగ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,247గా, పట్టణ ప్రాంతాల్లో రూ.7,078గా నమోదయ్యాయి. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది జూలై మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 2,61,953 కుటుంబాల నెలవారీ వినియోగ ఖర్చుల ఆధారంగా ప్రభుత్వం ఈ సర్వే రూపొందించింది. దీని ప్రకారం చూసినా పట్టణ-గ్రామీణ ప్రాంతాల నెలవారీ వినియోగ ఖర్చుల వ్యత్యాసం 2022-23లో 84 శాతం నుంచి 71 శాతానికి, 2023-24లో 70 శాతానికి తగ్గింది.

మిగతా అవసరాలే ఎక్కువ: నెలవారీ గృహోపయోగ ఖర్చుల్లో ఆహారేతర ఖర్చులదే అగ్రస్థానమని కూడా సర్వే తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం గ్రామీణ నెలవారీ గృహ వినియోగ ఖర్చుల్లో 53 శాతం ఆహారేతర వస్తువులపై ఖర్చు చేశారు. పట్టణ జీవులకు వచ్చేసరికి ఇది మరింత పెరిగి 60 శాతంగా నమోదైంది. గ్రామీణ-పట్టణ ప్రాంత ఆహార ఖర్చుల్లో శీతల పానీయాలు, అల్పాహారాలు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల ఖర్చులు అగ్రస్థానంలో ఉన్నాయి. ఆహారేతర ఖర్చుల్లో ప్రయాణ ఖర్చులు, బట్టలు, పాదరక్షలు, వినోద, ఇతర చిల్లర ఖర్చులు ఎక్కువై పోయాయి. ఇంటి, గ్యారేజీ అద్దెలు, హోటల్ వసతుల కోసం చేసే ఖర్చులూ ఆహారేతర ఖర్చుల్లో ఏడు శాతం వరకు ఉన్నట్టు సర్వే తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		దజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	1,00,000 ▲
విజయవాడ	79,150 ▲	73,100 ▲	92,000 ▲
విశాఖపట్నం	77,010 ▲	70,590 ▲	89,590 ▼
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	90,900 ▲
ప్రొద్దుటూరు	78,750 ▲	72,930 ▲	90,500 ▲
ముంబై	76,436 ▲	70,015 ▲	87,831 ▲

ఆఖర్లో.. ఆ రనౌట్‌తో!

అంతా తారుమారు

భారత్ తొలి ఇన్నింగ్స్ 164/5
- జైస్వాల్ అర్ధసెంచరీ
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 474
- స్టీవ్ స్మిత్ శతకం




స్టీవ్ స్మిత్ (140)

మెల్‌బోర్న్: అంతా బాగుందనుకున్న వేళ.. బ్యాటర్ల అనూహ్య తడబాటు భారత్‌ను కష్టాల్లోకి నెట్టింది. ఓవైపు యశస్వీ జైస్వాల్ (82) సెంచరీ ఖాయమనిపించేలా క్రీజులో కుదురుకున్నాడు. మరోవైపు తన బలహీనతను అధిగమిస్తూ దీటుగా నిలబడిన విరాట్ కోహ్లీ (36). వీరిద్దరి ఆటతో బాక్సింగ్ డే టెస్టు రెండో రోజు టీమిండియా ఓ దశలో 153/2తో పటిష్ఠంగా కనిపించింది. కానీ జైస్వాల్ రనౌట్ అంతా మార్చివేసింది. ఒక్కసారిగా ఆసీస్ పోటీలోకి రావడంతో 6 పరుగుల తేడాతో భారత్ మూడు వికెట్లు కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం టీమిండియా శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 164/5 స్కోరు చేసింది. ఇప్పటికే సగం జట్టు పెవిలియన్‌కు చేరగా, భారత్ ఫాలోఆన్ గండం దాటాలంటే మరో 111 పరుగులు చేయాల్సి ఉంది. ఇక భారమంతా క్రీజులో ఉన్న పంత్ (6 బ్యాటింగ్), జడేజా (4)పైనే ఉంది. ఆ తర్వాత నితీశ్, సుందర్ కూడా బ్యాటర్లే కావడం సానుకూలాంశం. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (140) వరుసగా రెండో శతకం సాధించగా, కమిన్స్ (49) సహకరించాడు. బుమ్రాకు నాలుగు, జడేజాకు మూడు, ఆకాశ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్మిత్ శతకం: 311/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్‌కు స్మిత్, కెప్టెన్ కమిన్స్ భారీ స్కోరుకు దోహదపడ్డారు. భారత బౌలర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోవడంతో ఇద్దరూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరును పెంచారు. ఈ జోరుతో స్మిత్ కెరీర్‌లో 34వ శతకం పూర్తి చేశాడు. అనంతరం తను మరింత దూకుడుతో ఆడడంతో స్కోరు 400 దాటింది. అయితే ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించాక జడ్డూ ఓవర్‌లో కమిన్స్ వెనుదిరిగాడు. తొలి సెషన్‌లో ఆసీస్ 143 పరుగులు సాధించడం విశేషం. ఆ తర్వాత బ్రేక్ ముగిసిన తొలి రెండు ఓవర్లలోనే ఆసీస్ స్టార్క్ (15), స్మిత్ వికెట్లను కోల్పోయింది. కాసేపటికే చివరి వికెట్ లియాన్ (13)ను బుమ్రా అవుట్ చేయడంతో దాదాపు మూడున్నర గంటల ఆసీస్ పోరాటం ముగిసింది.

ఓపెనర్‌గా వచ్చినా..: జైస్వాల్‌కు జతగా రోహిత్ (3) ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. కానీ అతడు ఈ టెస్టులోనూ నిరాశపర్చాడు. రెండో ఓవర్‌లోనే అతడిని కమిన్స్ వెనక్కి పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రాహుల్ (24) తిరిగి జైస్వాల్‌కు జత కలిశాడు. ఇద్దరూ ఆచితూచి ఆడారు. మూడు ఫోర్లతో చక్కగా కుదురుకున్న రాహుల్ టీబ్రేక్‌కు ముందు ఓవర్‌లో కమిన్స్‌కు చిక్కాడు. ఈ సెషన్‌లో 15 ఓవర్లు ఆడిన భారత్ 51/2తో నిలిచింది.

జైస్వాల్-విరాట్ అండగా..: ఆఖరి సెషన్‌లో అధిక భాగం భారత్ ఆధిపత్యం చూపింది. జైస్వాల్-విరాట్ జోడీ ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ భారత్‌కు ఆశలు కల్పించారు. అలాగే ఆఫ్‌సైడ్ బంతులను వదిలేస్తూ విరాట్ ఈసారి సరైనరీతిలో ఆడాడు. అటు జైస్వాల్ సహజశైలిలో ఆడేస్తూ బౌండరీలు రాబట్టాడు. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్ బౌలర్లను మార్చినా, ఫీల్డింగ్‌ను మోహరించినా ఫలితం లేకపోయింది.

1 భారత్‌పై ఎక్కువ టెస్టు సెంచరీలు (11) సాధించిన బ్యాటర్‌గా స్మిత్. ఈ క్రమంలో రూట్ (10)ను అధిగమించాడు.

ఆఖరి 20 నిమిషాల్లో..

జైస్వాల్-విరాట్ మధ్య మూడో వికెట్‌కు అప్పటికే వంద పరుగులు జత చేరాయి. ఇక ఆట ముగిసేందుకు 20 నిమిషాలే ఉంది. స్కోరు 153/2. వీరి ఆటనుచూస్తే మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగిస్తారనిపించింది. కానీ ఇద్దరిమధ్య సమన్వయలోపంతో భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 41వ ఓవర్ చివరిబంతికి జైస్వాల్ సింగిల్‌ను ఆశించాడు. ఈ క్రమంలో మిడాన్ వైపు బంతిని ఆడి వేగంగా నాన్‌స్ట్రయిక్ ఎండ్‌వైపు వచ్చాడు. అటు విరాట్ ఇదేమీ గమనించకుండా బంతిని చూస్తూ అక్కడే ఉండిపోయాడు. దీంతో ఇద్దరూ ఒకే వైపునకు చేరడంతో కీపర్ క్యారీ స్ట్రయిక్ ఎండ్ వికెట్లను గిరాటేయడంతో యశస్వీ రనౌటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఏకాగ్రత కోల్పోయిన విరాట్ ఓవర్ వ్యవధిలో మళ్లీ ఆఫ్‌సైడ్ ఆవలి బంతిని ఆడి క్యారీకి క్యాచ్ ఇచ్చాడు. కాసేపటికే నైట్ వాచ్‌మన్ ఆకాశ్ డకౌట్ కావడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో రోజును ముగించింది.

కోహ్లీని గేలి చేసిన ఆసీస్ ఫ్యాన్స్

ఈ సిరీస్‌లో కోహ్లీకి కలిసి రావడంలేదు. ఆసీస్ అరంగేట్రం ఆటగాడు కాన్‌స్టాస్‌ను ఢీకొని విమర్శలపాలైన కోహ్లీని రెండోరోజు ఆటలో ఆసీస్ ఫ్యాన్స్ ఎగతాళి చేశారు. దీంతో అవుటై పెవిలియన్‌కు వెళ్తున్న కోహ్లీ (36 పరుగులు) వెనక్కివచ్చి మరీ తనను గేలిచేసిన వారున్న స్టాండ్‌వైపు ఆగ్రహంగా చూశాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది విరాట్‌ను లోపలికి పంపించారు.



స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (ఎల్బీ) జడేజా 60; ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57; లబుషేన్ (సి) కోహ్లీ (బి) సుందర్ 72; స్మిత్ (బి) ఆకాశ్ 140; హెడ్ (బి) బుమ్రా 0; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4; క్యారీ (సి) పంత్ (బి) ఆకాశ్ 31; కమిన్స్ (సి) నితీశ్ (బి) జడేజా 49; స్టార్క్ (బి) జడేజా 15; లియోన్ (ఎల్బీ) బుమ్రా 13; బోలాండ్ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 27; మొత్తం: 122.4 ఓవర్లలో 474 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-89, 2-154, 3-237, 4-240, 5-246, 6-299, 7-411, 8-455, 9-455, 10-474. **బౌలింగ్:** బుమ్రా 28.4-9-99-4; సిరాజ్ 23-3-122-0; ఆకాశ్ 26-8-94-2; జడేజా 23-4-78-3; నితీశ్ 7-0-21-0; సుందర్ 15-2-49-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 82; రోహిత్ (సి) బోలాండ్ (బి) కమిన్స్ 3; రాహుల్ (బి) కమిన్స్ 24; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 36; ఆకాశ్ (సి) లియోన్ (బి) బోలాండ్ 0; పంత్ (బ్యాటింగ్) 6; జడేజా (బ్యాటింగ్) 4; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 46 ఓవర్లలో 164/5. వికెట్ల పతనం:** 1-8, 2-51, 3-153, 4-154, 5-159; **బౌలింగ్:** స్టార్క్ 13-0-48-0; కమిన్స్ 13-2-57-2; బోలాండ్ 12-3-24-2; లియోన్ 5-1-18-0; మార్ష్ 3-0-15-0.

గ్రౌండ్‌లోకి ఆగంతకుడు



రెండోరోజు ఆటలో ఓ ఆగంతకుడు మైదానంలోకి రావడం కలకలం రేపింది. భద్రతా సిబ్బంది కళ్లుగప్పి అతడు ముందుగా రోహిత్ వైపు వెళ్లగా అతడు వెంటనే పక్కకు తప్పుకొన్నాడు. దీంతో విరాట్‌ను సమీపించి భుజంపై చేయి వేసి ప్రేక్షకుల వైపు అభివాదం చేస్తూ కనిపించాడు. ఈ సమయంలో విరాట్ ప్రశాంతంగానే ఉండి అతడిని సెక్యూరిటీకి అప్పగించాడు.

నమ్మకం లేనప్పుడు ఇద్దరు స్పిన్నర్లు ఎందుకు?

రెండో స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడాన్ని మాజీ కోచ్ రవిశాస్త్రి ప్రశ్నించాడు. ఆసీస్ ఇన్నింగ్స్ 52వ ఓవర్ వరకు అతడి చేతికి కెప్టెన్ రోహిత్ బంతి ఇవ్వనేలేదు. అప్పటికే జట్టు స్కోరు 171/2గా ఉంది. ఓవరాల్‌గా అతడు వేసింది 15 ఓవర్లే. శుక్రవారం లంచ్ విరామ సమయంలో శాస్త్రి మాట్లాడుతూ 'భారత్‌కు ప్రణాళిక లేకుండా పోయింది. అనుకున్నరీతిలో స్పిన్నర్లను ఉపయోగించుకోవడం లేదు. సుందర్‌ను అంత ఆలస్యంగా దించేట్టయితే ఇక ఇద్దరు స్పిన్నర్లతో ఆడడమెందుకు? స్పిన్నర్లపై నమ్మకం లేనప్పుడు ఇద్దర్ని తీసుకోవడం అవసరమా?' అని ఘాటుగా ప్రశ్నించాడు.

స్పోర్ట్స్

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత్‌దే చివరి వన్డే ● 3-0తో సిరీస్ కైవసం



వడోదర: వెస్టిండీస్‌తో ఆఖరి వన్డేలోనూ భారత మహిళల జట్టు సత్తా చాటింది. మొదట బౌలింగ్, ఆపై బ్యాటింగ్‌తో దీప్తి శర్మ (6/31, 48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్‌తో 39 నాటౌట్) ఆల్‌రౌండ్ షో కనబర్చడంతో చివరి వన్డేలో హర్మన్ సేన 5 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. తద్వారా సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్లను భారత బౌలర్లు దీప్తి శర్మ, రేణుకా సింగ్ (4/29) బెంబేలెత్తించారు. దీంతో విండీస్ 38.5 ఓవర్లలోనే 162 పరుగులకు కుప్పకూలింది. చినెల్లె హెన్రీ (61) అర్ధ సెంచరీ చేసింది. ఛేదనలో దీప్తి శర్మ (39 నాటౌట్) రిచా (23 నాటౌట్) చెలరేగడంతో 28.2 ఓవర్లలోనే 167/5 చేసి గెలిచింది. దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, రేణుక 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు.

బాష్ ప్రపంచ రికార్డు

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం ● పాక్‌తో తొలి టెస్టు



సెంచూరియన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఆటగాడు కార్బిన్ బాష్ ప్రపంచ రికార్డుతో అదరగొట్టాడు. అరంగేట్రం మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీయడంతో పాటు అర్ధ సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. అంతేకాదు..అరంగేట్రంలో తొమ్మిదో ఆటగాడిగా బ్యాటింగ్‌కు దిగి అత్యధిక స్కోరు (81 నాటౌట్) చేసిన దక్షిణాఫ్రికా ఆటగాడిగా కూడా రికార్డు నెలకొల్పాడు. కాగా క్రితంరోజు స్కోరు 82/3తో రెండో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 301 పరుగులకు ఆలౌటై 90 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్నందుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాకిస్థాన్ ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 3 వికెట్లకు 88 పరుగులు చేసింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులు సాధించింది.

సెమీస్‌కు లక్ష్యసేన్

షెన్‌జెన్ (చైనా): ఆరంభ కింగ్ కప్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు లక్ష్యసేన్ సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్య 10-21, 21-13, 21-13తో ఆగ్నస్ లాంగ్(హాంకాంగ్) పై గెలిచాడు.

సెమీస్‌లో కేరళ, సర్వీసెస్

సంతోష్ ట్రోఫీ

హైదరాబాద్: కేరళ, సర్వీసెస్ జట్లు సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని డెక్కన్ ఎరీనా మైదానంలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేరళ 1-0తో జమ్మూ కశ్మీర్‌ను ఓడించింది. మరో క్వార్టర్స్‌లో సర్వీసెస్ 2-1తో మేఘాలయను ఓడించింది. ఆదివారం జరిగే సెమీఫైనల్స్‌లో కేరళతో మణిపూర్, సర్వీసెస్‌తో బెంగాల్ తలపడనున్నాయి.

ఫైనల్లో పట్నా X హరియాణా

పుణె: ప్రొకబడ్డీ లీగ్ టైటిల్ పోరుకు పట్నా పైరేట్స్, హరియాణా స్టీలర్స్ అర్హత సాధించాయి. ఆదివారం ఇరు జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో హరియాణా 28-25 తేడాతో యూపీ యోధాస్‌ను ఓడించింది. రైడర్ శివమ్ పతారె ఏడు పాయింట్లు సాధించగా, యూపీ నుంచి గగన్ గౌడ 10 పాయింట్లతో ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. అనంతరం మరో సెమీస్‌లో పట్నా జట్టు 32-28 తేడాతో దబాంగ్ ఢిల్లీపై నెగ్గింది. రైడర్ దేవాంక్, ఆయన్ ఎనిమిదేసి పాయింట్లతో కీలకంగా నిలిచారు. ఢిల్లీ రైడర్ అషు మాలిక్ 9 పాయింట్లతో పోరాడాడు.

నాలుగో స్థానంలో హారిక

- 12లో అర్జున్.. 38లో హంపి
- ప్రపంచ ర్యాపిడ్ చెస్

న్యూయార్క్: ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి విజయంతో ప్రారంభించాడు. భారత కాలమాన ప్రకారం గురువారం అర్ధరాత్రి మొదలైన ఈ మెగా టోర్నీలో ఓపెన్ విభాగంలో తొలి ఐదు రౌండ్లకుగాను నాలుగింటిలో అర్జున్ గెలిచాడు. మూడో రౌండ్ ఓటమిని మినహాయిస్తే మిగతా రౌండ్లన్నింటిలో ప్రత్యర్థులను ఓడించాడు. దీంతో ఐదురౌండ్లు ముగిసేసరికి అర్జున్ 4 పాయింట్లతో 12వ స్థానంలో కొనసాగుతున్నాడు. మరో భారత ఆటగాడు రౌనక్ సధ్వాని కూడా 4 పాయింట్లే సాధించినా.. తన ఖాతాలో ఓటమే లేకపోవడంతో ఐదో స్థానంలో నిలిచాడు. హర్ష భరత్‌కోటి 2.5 పాయింట్లతో 108వ స్థానంలో, ప్రజ్ఞానంద 3 పాయింట్లతో 56వ స్థానంలో ఉన్నారు. మహిళల ర్యాపిడ్ విభాగంలో తొలిరోజు నాలుగు రౌండ్లు జరిగాయి. 3 విజయాలు, ఓ డ్రా నమోదుచేసిన హారిక 3.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. హంపి 2.5 పాయింట్లతో 38వ, సాహితి వర్షిణి 2 పాయింట్లతో 57వ, ప్రియాంక 2 పాయింట్లతో 61వ స్థానాల్లో ఉన్నారు.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెన్నుతట్టిన మన్మోహన్: కేటీఆర్

న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌లో న్యాయం ఉందని, ఆ ఆశయం ఫలించాలని మనస్ఫూర్తిగా ఆశించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు మన్మోహన్‌తో ఎంతో సాన్నిహిత్యం ఉందని.. తెలంగాణ ఉద్యమ సమయంలో అధైర్య పడొద్దని, వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ పార్థివదేహానికి బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్‌రావులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశాన్ని మన్మోహన్ ఆర్థికంగా ఎంతో ముందుకు తీసుకెళ్లారని, ప్రపంచంలో దేశ ఖ్యాతిని పెంచారని తెలిపారు. దాదాపు రెండేళ్లపాటు ఆయన కేంద్ర మంత్రివర్గంలో కేసీఆర్ పనిచేశారని గుర్తు చేశారు. 2004లో కేంద్ర మంత్రివర్గంలో చేరిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో ఎన్నోసార్లు ఆటుపోట్లు ఎదురైతే అధైర్య పడొద్దని ప్రోత్సహించారని చెప్పారు.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది: కూనంనేని

మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక వేత్తగా, అధ్యాపకుడిగా, రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నేతగా, ప్రధానిగా మన్మోహన్ దేశానికి ఎన్నో సేవలందించారని కొనియాడారు. మన్మోహన్ మరణం పట్ల ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సంతాపం వ్యక్తం చేశారు. ప్రధానిగా ఆయన దేశానికి ఎనలేని సేవలు చేశారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'రింగ్ రోడ్డు' రైతుకు న్యాయం చేయాలి: లక్ష్మణ్



హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డుతో నష్టపోతున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రూపొందించిన అలైన్‌మెంట్‌తో వేలాది మంది రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్‌ను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి నేతృత్వంలో బాధిత రైతులు కలిశారు. రీజినల్ రింగ్‌రోడ్డు అశాస్త్రీయ అలైన్‌మెంటుతో జరుగుతున్న అన్యాయాన్ని వారు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డుకు తాము వ్యతిరేకం కాదని, కానీ రోడ్డు అలైన్‌మెంటు శాస్త్రీయంగా లేదన్నారు. రైతులకు న్యాయం చేయకుంటే బీజేపీ ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు.

ఎస్సీ కమిషన్ కోర్టులాంటిదే

» అధికారులు దీన్ని గుర్తించాలి: వడ్డేపల్లి రామ్‌చందర్

హైదరాబాద్‌సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ)కు సివిల్ కోర్టులకు ఉన్న అధికారాలే ఉన్నాయని, దానిని అధికారులు గమనించాలని ఆ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ అన్నారు. కమిషన్ పరిధిని తెలుసుకోవాలని కోరారు. కమిషన్ పనితీరుపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ 9 నెలల కాలంలో తెలంగాణలో 64 కేసులు విచారణకు వస్తే వాటిలో 11 కేసులకు పరిష్కరించినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి సహా దేశంలో 11 రాష్ట్రాలకు తాను ఇన్‌ఛార్జ్‌నని తెలిపారు. ఎలక్షన్ కమిషన్‌లా తమకు కూడా విశేషాధికారాలు ఉన్నాయని చెప్పారు. ఎంతటి వారినైనా బోనులో నిలబెట్టే అధికారం తమకు ఉందని తెలిపారు. తమ కమిషన్ పనితీరు గురించి తెలుసుకుని, అందుకనుగుణంగా వ్యవహరించకపోతే వారు చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. తన పరువుకు భంగం కలిగించేలా ఓ వ్యక్తి వ్యవహరిస్తున్నాడని ఆలంపూర్ ఎంఎల్‌ఏ పోలీసులను ఆశ్రయించినా కేసు నమోదు చేయలేదని, తాము ఇప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించాల్సి వచ్చిందన్నారు. ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కరిస్తున్నట్టు చెప్పారు.

మన్మోహన్ మరణం.. దేశానికి లోటు

ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ సాకారం.. దేశం ఆయనను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది: రేవంత్

- మాజీ ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి సహా పలువురు నేతల నివాళి
- ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్: జూపల్లి కృష్ణారావు
- గొప్ప ఆర్థికవేత్త.. దార్శనికుడు: దామోదర రాజనర్సింహ
- దేశ అభ్యున్నతికి దారులు వేసిన నేత: జగ్గారెడ్డి
- గాంధీభవన్‌లో మన్మోహన్‌కు నేతల నివాళులు



ఢిల్లీలో మన్మోహన్‌సింగ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. అలా సాకారమైన తెలంగాణకు తాని ప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నానని తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్థివ దేహానికి సీఎం రేవంత్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ సేవలను గుర్తు చేసుకున్నారు. "మన్మోహన్‌సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీతో పాటు దేశానికి తీరని లోటు. మన్మోహన్ తీసుకొచ్చిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ దేశాన్ని బలోపేతం చేశాయి. సమాచార హక్కు, విద్యాహక్కు, ఆహార భద్రత చట్టాలు, నరేగా, న్యూక్లియర్ డీల్ ఆయన ప్రవేశపెట్టినవే. తెలంగాణ రాష్ట్రాన్ని కూడా మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడే ఏర్పాటు చేశారు. ఆయన వల్ల ఈ దేశం ఎంతో ప్రగతి సాధించింది. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ లోటు ఎవరూ భర్తీ చేయలేనిది. ఈ దేశం మన్మోహన్‌ను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాగా, సీఎం రేవంత్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు మన్మోహన్ పార్థివదేహానికి నివాళులర్పించారు. దేశ రూపురేఖలను మార్చేసిన ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మన్మోహన్ గొప్ప ఆర్థిక వేత్త, దార్శనికుడు అని మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. మన్మోహన్‌తో తమ తండ్రి, దివంగత వెంకటస్వామికి మంచి అనుబంధం ఉండేదని ఎమ్మెల్యేలు జి.వినోద్, జి.వివేక్ అన్నారు.

దేశం విశిష్ట వ్యక్తిని కోల్పోయింది..

దేశం ఒక విశిష్ట వ్యక్తిని కోల్పోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఎంపీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్‌ది అని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. అవినీతి మరక అంటని గొప్ప రాజకీయ నాయకుడు మన్మోహన్‌సింగ్ అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కొనియాడారు. శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన మన్మోహన్ సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

కాగా, తాను కాంగ్రెస్ ఓబీసీ కన్వీనర్‌గా ఉన్న సమయంలో తనకు మన్మోహన్‌సింగ్‌తో కలిసి పని చేసే అవకాశం దక్కిందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు గుర్తు చేసుకున్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి వీహెచ్‌తోపాటు పలువురు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. వీరిలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్ రావు, శోభారాణి, మెట్టు సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, చరణ్ కౌశిక్, బొల్లు కిషన్, సూర్య నాయక్, కోట నీలిమ తదితరులు ఉన్నారు. కాగా, మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వారం రోజులు సంతాప దినాలుగా పాటిస్తోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలతోపాటు జనవరి 3వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ప్రకటించిన అన్ని రాజకీయ కార్యక్రమాలను రద్దు చేసినట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు.



హుస్సేన్ సాగర్ వద్ద జాతీయ జెండాను అవనతం చేసిన దృశ్యం

దార్శనికుడు మన్మోహన్: జగ్గారెడ్డి

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో తన మేధస్సును ధార పోసి ఆర్థిక అభ్యున్నతికి దారులు వేసిన దార్శనికుడు మన్మోహన్‌సింగ్ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దమని పేర్కొన్నారు. ఎదిగిన కొద్దీ ఎలా ఒదిగి ఉండాలో చాటి చెప్పిన మహనీయుడని, దేశ రాజకీయాల్లో అజాత శత్రువు అని కొనియాడారు. మన్మోహన్ మరణంతో దేశం ఒక గొప్ప ఆర్థిక పితామహుడిని, క్రమశిక్షణ కలిగిన నాయకుణ్ని కోల్పోయిందన్నారు. ఎన్నో ఆర్థిక సంస్కరణలు, విప్లవాత్మకమైన పథకాలు తీసుకొచ్చిన నేతగా మన్మోహన్ సింగ్ గుర్తుండిపోతారన్నారు. అటు కేంద్ర ఆర్థిక మంత్రిగా తర్వాత దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను దేశం ఎప్పటికీ మరిచిపోదని తెలిపారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే.. స్థానికం నిర్వహించాలి

» 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభ: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి. ఈ హామీని పట్టించుకోకుండా ఎన్నికలకు వెళ్లాలని ప్రయత్నిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. శుక్రవారం రాష్ట్రంలోని 40కి పైగా బీసీ కుల సంఘాల నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 3వ తేదీన ఇందిరా పార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో చేపట్టనున్న జనగణనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. 40 బీసీ సంఘాలతో తాను సమావేశం అయ్యింది ట్రైలర్ మాత్రమేనని, జనవరి 3న సినిమా చూపిస్తామని వ్యాఖ్యానించారు. బహిరంగ సభకు బీసీలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యత తెలియజేయాలని ఆమె కోరారు.

ఎస్సీ వర్గీకరణ వల్ల ఎవరికీ అన్యాయం జరగదు

» ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ



హైదరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ వలన ఎవరికీ అన్యాయం జరగదన్నారు. బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న అధ్యక్షతన హైదరాబాద్‌లో నిర్వహించిన కళానేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంద కృష్ణ మాట్లాడుతూ.. మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అడ్డంకులను ఎదుర్కొనడానికి 'వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల'తో మాదిగల మండే గుండెచప్పుళ్లను వినిపించడానికి శ్రీకారం చుట్టామని ఆయన చెప్పారు. ఫిబ్రవరి 3న నిర్వహించనున్న 'వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల' కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన కళానేతలంతా ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం కళానేతలు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ న్యాయం కాబట్టే ఎమ్మార్పీఎస్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కూడా గజ్జె కట్టి గళం విప్పుతామని తెలిపారు. సమావేశంలో ప్రజాగాయని విమలక్క, మధుప్రియ, నల్గొండ గద్దర్, దరువు అంజన్న తదితరులు పాల్గొన్నారు.

దేహం.. దానం!

(మొదటిపేజీ తరువాయి)

మరొకరు స్ఫూర్తి పొందుతున్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టు ప్రభావిత జిల్లాల్లో ఈ తరహా వైఖరి పెరుగుతోంది. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో 65 శవాలు ఉండగా, అవన్నీ వారి కుటుంబ సభ్యులు దానంగా ఇచ్చినవే కావడం గమనార్హం. కానీ, ఇలాంటి పరిస్థితి అన్ని చోట్ల కనిపించడం లేదు. సర్కారీ వైద్య కళాశాలల్లో శవాల కొరత లేనప్పటికీ.. ప్రైవేట్ కాలేజీలు మాత్రం తిప్పలు పడాల్సిన పరిస్థితి ఉంది. తమ విద్యార్థులు నేర్చుకునేందుకు శవాలు కావాలంటూ డీఎంఈకి ఆయా కాలేజీలు దరఖాస్తు చేసుకోవడం.. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

గత నవంబరు 5న ఈదుప్పగంటి వెంకటరత్నమ్మ(92) మరణించారు. గతంలో ఆమె రాసిన వీలునామా మేరకు కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని ఉస్మానియా కాలేజీకి అప్పగించారు. వెంకటరత్నమ్మ మరణించిన 5 రోజులకే ఆమె వియ్యంకురాలు వంకినేని హైమవతి(78) కూడా పరమపదించారు. ఇదే తీరులో ఆమె మృతదేహాన్ని సైతం కుటుంబ సభ్యులు ఉస్మానియా మెడికల్ కాలేజీకి దానం చేశారు. వీరిద్దరినీ స్ఫూర్తిగా తీసుకుని అమెరికాలో ఉండే వీరి బంధువు మరొకరు కూడా తన మరణానంతరం.. పార్థీవ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించాలని వీలునామా రాశారు. వీరి మాదిరిగానే మరో ఐదారుగురు సైతం ఈ ఏడాది అదే కాలేజీకి వచ్చి వీలునామా రాసిచ్చారు.

ప్రతీ 25 సీట్లకు ఒక శవం తప్పనిసరి

వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలోనే అనాటమీ (శరీర నిర్మాణ శాస్త్రం) ఒక సబ్జెక్టుగా ఉంటుంది. విద్యార్థులు వైద్య విద్యను నేర్చుకునే క్రమంలో భాగంగా శవాల(కెడావర్‌ల)ను కోసి శరీర నిర్మాణం గురించి అధ్యాపకులు వివరిస్తారు. అనంతరం ఆ కోసిన శవాలను ప్రత్యేక రసాయనాలతో నింపిన ట్యాంకులలో భద్రపరుస్తారు. అలా ఒక శవాన్ని పదే పదే కోసి... శరీర నిర్మాణం గురించి విద్యార్థులకు వివరిస్తారు. ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య ఆధారంగా ఆయా కాలేజీల్లోని అనాటమీ విభాగానికి శవాలు కావాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి 25 సీట్లకు ఒక శవం అవసరం ఉంటుంది. అంటే... 250 సీట్లు ఉండే ఒక మెడికల్ కాలేజీకి ఏడాదికి సగటున 10 శవాలు కావాలి. మానవ శరీరం నిర్మాణం, అవయవాల పనితీరు, లోపాలు, వ్యాధిగ్రస్తమైతే ఏమవుతుంది? వంటి అంశాలను డిసెక్షన్(డెడ్‌బాడీని కోసి చూడడం) ద్వారా విద్యార్థులు నేర్చుకుంటారు. అప్పుడే వారికి ప్రాక్టికల్ జ్ఞానం వస్తుంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీలో వైద్య పరిశోధనల నిమిత్తం సుమారు 65 శవాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా స్వచ్ఛందంగా వారి కుటుంబ సభ్యులు ఇచ్చినవే. ఇంకా చెప్పాలంటే ఆ మృతదేహాలన్ని కూడా కమ్యూనిస్టు కుటుంబాలకు చెందినవే.

ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు కష్టమే..

సాధారణంగా దానం కింద వచ్చిన శవాలనే వైద్య పరిశోధనల కోసం వినియోగించాలన్నది నైతిక నియమం. అనాథలు, రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో చనిపోయిన వారి మృతదేహాలను ఎవరూ తీసుకెళ్ల లేదన్న కారణంతో(అన్‌క్లెయిమ్డ్ డెడ్‌బాడీస్‌ను) వైద్య పరిశోధనల కోసం వినియోగించకూడదు. అయితే, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ఇలాంటి శవాలను వినియోగించుకునే పరిస్థితి లేకపోవడం, కొత్త మెడికల్ కాలేజీల సంఖ్య పెరగడంతో గత బీఆర్ఎస్ సర్కారు ఒక జీవోను జారీ చేసింది. నిర్దిత సమయంలోగా ఆయా శవాలను తీసుకెళ్లడానికి ఎవరూ రాకుంటే.. వాటిని మెడికల్ కాలేజీల కోసం వినియోగించుకోవచ్చన్నది దాని సారాంశం. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రస్తుతం శవాల కొరత పెద్దగా లేదనే చెప్పాలి. అయితే, ప్రైవేటు వైద్య కళాశాలలకు శవాలు దొరకడం కష్టంగా మారింది. వాస్తవానికి ఆయా కాలేజీలకు దేహ దానం చేసే వారు తక్కువగా ఉంటారు. ప్రమాదాల బారిన పడి చికిత్స కోసం వచ్చిన వారెవరైనా మరణించినా.. పోస్టుమార్టం నిమిత్తం మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రులకే పంపుతారు. దీంతో ప్రైవేటు వైద్య కళాశాలల్లో శవాలు అందుబాటులో ఉండడం లేదు.

డీఎంఈకి కాలేజీల నుంచి అర్జీలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోని మార్చురీల్లో ఉండే అన్‌క్లెయిమ్డ్ మృతదేహాలను వైద్య పరిశోధనల నిమిత్తం ప్రైవేటు వైద్య కళాశాలలకు అప్పగించేందుకు వీలుగా గతంలో ఒక జీవోను జారీ చేశారు. ఇందుకోసం ఒక్కో మృతదేహానికి రూ.60వేల చొప్పున ఆయా ప్రైవేట్ కాలేజీలు చెల్లించాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఇటీవల కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలు తమకు శవాలు కావాలని డీఎంఈకి దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఏడాది కొత్తగా 150 సీట్లతో ప్రారంభమైన ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ యాజమాన్యం.. తమకు 15 శవాలు కావాలని అభ్యర్థించినట్లు తెలిసింది. కొన్ని మెడికల్ కాలేజీలు శరీర నిర్మాణాలను పోలి ఉండే రబ్బరు బొమ్మలను తీసుకువచ్చి విద్యార్థులకు అనాటమీ పాఠాలు నేర్పిస్తున్నాయి. ప్రాక్టికల్‌గా శవాలను కోసి, శరీర నిర్మాణం గురించి తెలుసుకున్నప్పుడు మానవ దేహంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంటుందని, రబ్బరు బొమ్మలపై నేర్చుకుంటే ఏం తెలుస్తుందని వైద్య విద్య నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారు భవిష్యత్తులో మంచి వైద్యులు కాలేరని చెబుతున్నారు.

రబ్బరు బొమ్మలపై నేర్పడం చట్టవిరుద్ధం

వైద్యవిద్య విద్యార్థులకు మొదటి సంవత్సరం గట్టి పునాదిలాంటింది. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్టు సబ్జెక్టులుంటాయి. ఈ మూడింటి ద్వారా శరీర నిర్మాణం ఎలా ఉంటుంది? ఎలా పనిచేస్తుంది? రసాయన ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలుస్తుంది. విద్యార్థులు కేడావర్(మృతదేహాల)ను డిసెక్షన్ చేయడం ద్వారానే అంతా నేర్చుకుంటారు. ఇదంతా రబ్బరు బొమ్మలపై నేర్చుకోవడం చట్ట విరుద్ధం. ఎన్ఎంసీ నిబంధనలకు ఇది పూర్తి వ్యతిరేకం. ఎన్ఎంసీ నిబంధనలను ప్రైవేటు కాలేజీలు పాటించడం లేదు.

- డాక్టర్ పుట్ట శ్రీనివాస్, మాజీ వైద్య విద్య సంచాలకులు



సంక్రాంతికి ఆర్టీసీ 5 వేల ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు సర్వీసులు
- మహిళా ప్రయాణికులకు సరిహద్దుల వరకే ఉచితం
- తెలంగాణలోని జిల్లాలకూ సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు
- నేడు సంక్రాంతి స్పెషల్ బస్సులపై ప్రకటన

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేందుకు హైదరాబాద్ వాసులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పండగ రద్దీని తట్టుకునేందుకు తెలంగాణ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి మరిన్ని సర్వీసులను పెంచాలని అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తరలించేందుకు ఈ సంక్రాంతికి 5 వేల ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఏపీతోపాటు తెలంగాణ జిల్లాలకూ సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం యథావిధిగా కొనసాగిస్తారు. అయితే తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకే జీరో టికెట్‌పై ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వర్తిస్తుంది. ఆ తర్వాత టికెట్ కొనాల్సిందే. పండగకు సంక్రాంతికి వెళ్లే వారు, పండగ తర్వాత తిరిగి హైదరాబాద్ చేరుకునే వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జనవరి మొదటి వారం నుంచి 17వ తేదీ వరకు పది రోజులు ఈ ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. సంక్రాంతి స్పెషల్ బస్సులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆర్టీసీ అధికారులు శనివారం అధికారికంగా ప్రకటన చేయనున్నారు.

ఏపీఎస్ఆర్టీసీ 2,400 ప్రత్యేక బస్సులు...

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ఆర్టీసీ హైదరాబాద్ నుంచి 2,400 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. జనవరి 9 నుంచి 13 వరకు సంక్రాంతి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని, వీటిని సాధారణ చార్జీలతో ఏపీలోని పలు జిల్లాలకు నడుపుతున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.విజయలక్ష్మి తెలిపారు. ప్రయాణికులు www.apsrtconline ద్వారా, అధీకృత ఏటీబీ ఏజెంట్ల ద్వారా అడ్వాన్సుగా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

అంత లేదు పుష్పా!

ఎర్రచందనం వేలానికి స్పందన కరువు

- టన్ను టెండరు రేటు రూ.70 లక్షలు
- 50 లక్షలకే బిడ్లు వేసిన వ్యాపారులు
- కొన్న సరుకు కూడా 30 శాతమే
- రెడ్ శాండల్‌కు తగ్గిన డిమాండ్
- చైనా, జపాన్, మలేషియా, సింగపూర్,
- అరబ్ దేశాల్లో ఆర్థిక సంక్షోభమే కారణం

'మంగళం శీను గాడికి అమ్మితే టన్నుకు యాభై లక్షలు.. అదే శీను అమ్మే మురుగన్ దగ్గరికి వెళితే టన్నుకు కోటి న్నర.. మురుగన్ అమ్మే దగ్గరికి మనం వెళ్లగలిగితే.. పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా.. ఇంటర్నేషనల్..' ..ఇటీవలే రిలీజైన పుష్ప-2 సినిమాలో కాబోయే ముఖ్యమంత్రి సిద్దప్పనాయుడి(రావు రమేష్)తో ఎర్రచందనం స్మగ్లర్ పుష్పరాజ్ (అల్లు అర్జున్) చెబుతాడు. అయితే ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ మాత్రం అంతలేదు పుష్పా.. మా దగ్గర ఐదు వేల టన్నులు స్టాకుంది.. టన్ను 50 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ ఎవరూ ముందుకు రావడంలేదని అంటోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



స్మగ్లర్ల నుంచి ఎర్రచందనం యాంటీ టాస్క్‌ఫోర్స్, పోలీసులు గత పదేళ్లలో స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు తిరుపతి సమీపంలోని తిమ్మినాయుడిపాలెం గోడౌన్లలో నిల్వ ఉంచారు. సుమారు 40 ఏళ్లు పెరిగే చెట్టు నుంచి తీసే ఎర్రచందనం మొదటి రకం. అంతకు తక్కువ కాలం పెరిగే చెట్లను నరికి తీసే ఎర్రచందనం రెండోరకం. దుంగల సైజును బట్టి మూడో రకంగా అటవీశాఖ అధికారులు వర్గీకరిస్తారు. వాటిని ఏడాదిలో రెండు సార్లు వేలం వేసి.. నాణ్యమైన మొదటి రకాన్ని కొంతమేర విక్రయిస్తారు. రెండో రకంలో సగం, మూడో రకంలో దాదాపు 80 శాతం వరకూ అమ్ముడుపోదు. ఇలా పదేళ్లుగా నిల్వ ఉన్న ఎర్రచందనంలో మూడో రకమే ఎక్కువగా ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. గోడౌన్‌లో ఉన్న ప్రస్తుతం 5,376 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం ఉంది. దాని విక్రయానికి రాష్ట్ర అటవీశాఖ కేంద్రప్రభుత్వ అనుమతి తీసుకుంది. గ్లోబల్ టెండర్ల ద్వారా నిరుడు కొంత ఎర్రచందనం వేలానికి ప్రయత్నించినా.. టెండర్‌దారులు ముందుకు రాలేదు. తాజాగా 905 టన్నులు విక్రయించేందుకు రాష్ట్ర అటవీశాఖ టెండర్లు ఆహ్వానించినా కొనుగోలుదారుల నుంచి స్పందన కనిపించలేదు. అది వేలం వేసే ఎర్ర చందనానికి డిమాండ్ లేకపోవడమే దీనికి కారణం. గత ఏడాది కాలంలో మూడు సార్లు టెండర్లు పిలిచినా.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఆసక్తి చూపలేదు. మన ఎర్రచందనం వేలంలో చైనాకు చెందిన 10-15 మంది వ్యాపారులు పాల్గొంటుంటారు. అటవీశాఖ టన్ను ధర రూ.70 లక్షలుగా నిర్ణయించింది. కానీ ఎక్కువ మంది టెండరుదారులు రూ.50 లక్షలకు మించి బిడ్లు వేయలేదు. టెండర్ రేటుకు బిడ్లు వేసిన ఒకరిద్దరు వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకు కూడా 30% మించలేదు. 2022లో 500 టన్నులు వేలం వేయగా.. ఇంకా 4,900 టన్నులు మిగిలి ఉంది. అందులో 2023లో లాట్‌ల వారీగా 400-500 టన్నుల చొప్పున రెండు సార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచారు. కానీ టెండర్ రేటు కన్నా తక్కువ కోట్ చేస్తూ బిడ్లు వచ్చాయి. అనుకున్న ధరకు కాస్త అటూఇటూగా ఉన్న బిడ్లను మాత్రమే ఖరారు చేసి, మిగతా లాట్‌ల వేలాన్ని అధికారులు ఆపేశారు. అత్యధికంగా 2016-19 మధ్య టన్ను ధర రూ.70-75 లక్షలు పెట్టి వేలంలో వ్యాపారులు కొనుక్కున్నారు. కానీ గరిష్ఠంగా నాడు అమ్ముడుపోయిన ధరనే టెండర్ రేటుగా నిర్ణయించడంతో అంత ధరతో కొనడానికి ఇప్పుడు వ్యాపారులు ముందుకు రావట్లేదు. దీనికి కారణం చైనా, జపాన్, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉండడమేనని అధికారులు చెబుతున్నారు. ఆయా దేశాల్లో విలాసవంతమైన భవన నిర్మాణాలు, ఖరీదైన ఫర్నిచర్ వినియోగం తగ్గడంతో ఎర్రచందనానికి డిమాండ్ తగ్గిపోయిందని అంటున్నారు.

శేషాచలం ఎర్రచందనానికి భలే గిరాకీ

కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుడు వెలసిన శేషాచలం కొండల్లో మాత్రమే లభ్యమయ్యే ఎర్రచందనానికి దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. చైనా, జపాన్, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాల్లో సంపన్నులు ఎర్రచందనం కర్రతో ఫర్నిచర్ చేయించుకుని హోదా ప్రదర్శిస్తారు. ఈ కర్రతో చేసే ఫర్నిచర్ 50 ఏళ్లయినా చెక్కు చెదరదు. ఈ డిమాండ్‌ను గమనించిన స్మగ్లర్లు శేషాచలం కొండల నుంచి ఎర్రచందనాన్ని నరికి అక్రమంగా దేశ, విదేశాలకు సరఫరా చేసి కోట్లకు పడగలెత్తుతున్నారు. వారు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అటవీ సిబ్బందిని సైతం హత్య చేసి స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను సినిమా ఫక్కీలో ఎత్తుకెళ్లేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ అరుదైన సంపదను ప్రభుత్వ ఆదాయ వనరుగా మార్చుకోవాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు 450 మంది సాయుధ పోలీసులు, అటవీ సిబ్బందితో రెడ్ శాండిల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. 2014-19 మధ్యలో పట్టుబడిన ఎర్రచందనాన్ని తిరుపతికి సమీపంలోని తిమ్మినాయుడిపాలెంలో ఒక గోడౌన్‌లో నిల్వ చేశారు. విదేశాల్లో ప్రకటనలు ఇప్పించి అక్కడి నుంచి వ్యాపారులను రప్పించి వేలం ద్వారా విక్రయించేవారు. ఆ సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమయ్యేది. అయితే 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌ను దాదాపు నిర్వీర్యం చేసింది. ఐజీ పోస్టు తీసేసి పనిష్మెంట్ కింద ఒక ఎస్పీ స్థాయి అధికారిని బలవంతంగా నియమించడంతో శేషాచలంలో అరుదైన వృక్షజాతితో పచ్చగా ఉన్న అటవీ ప్రాంతం మోడు బారింది.

జెన్‌కోలో కొలువులు ఇస్తలేరు

» సర్టిఫికెట్ల తనిఖీ పూర్తయి3 నెలలు అవుతున్నా జాప్యం

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్, కెమిస్టుల నియామకాలపై నిర్లక్ష్యం నెలకొంది. జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), 60 కెమిస్టు ఉద్యోగాల కోసం 2023 అక్టోబరులో నోటిఫికేషన్ వెలువడింది. మూడుసార్లు జాప్యం అనంతరం గత జూలై 14వ తేదీన రాత పరీక్ష జరిగింది. గత సెప్టెంబరు 4వ తేదీన ఫలితాలు వెలువరించారు. అనంతరం సెప్టెంబరు 18వ తేదీ నుంచి 21వ తేదీ దాకా సర్టిఫికెట్ల తనిఖీ కూడా జరిగింది. అసలు ధ్రువపత్రాలు కూడా అధికారులు తీసుకున్నారు. చాలామంది అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు వదులుకొని.. ఆయా సంస్థల నిరభ్యంతర పత్రాలు కూడా సమర్పించారు. నియామక ప్రక్రియ వెనువెంటనే జరగాల్సి ఉండగా.. అధికారుల నిర్లక్ష్యంతో మూడునెలలుగా అభ్యర్థులు విద్యుత్ సౌధ(జెన్‌కో ప్రధాన కార్యాలయం)తో పాటు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇప్పుడిప్పుడే కొత్త యూనిట్‌లలో విద్యుత్ ఉత్పాదన ప్రక్రియ ప్రారంభమయింది. కొత్తగా ఉద్యోగుల అవసరం ఉండగా.. నియామక ప్రక్రియలో జాప్యం వెనుక కారణాలు బోధపడటం లేదు. జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియాను ఐదుసార్లు కలిసి నివేదించినా ఫలితం లేకుండా పోయిందని అభ్యర్థులు వాపోతున్నారు. ఉప ముఖ్యమంత్రిని మూడుసార్లు కలిసినా ప్రయోజనం లేదని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు వదులుకొని వచ్చామని, నియామక పత్రాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ కమిటీల జీవోపై స్టేకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 33పై మధ్యంతర స్టే ఇచ్చేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ జీవోకు సంబంధించి వివరణ సమర్పించాలని ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు నిర్మించాలని సంకల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ అక్టోబర్ 11న జీవో జారీ చేసింది. అయితే చట్టప్రకారం గ్రామసభ ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరగాలని, అవి కాకుండా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం చెల్లదని పేర్కొంటూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ కొలిపాక మండలం కొత్తపల్లికి చెందిన ఆరే నితీశ్‌కుమార్ తదితరులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రభుత్వ విచక్షణపై ఆధారాపడి ఉంటుందని, దాంట్లో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ సింగిల్ జడ్జి ఆ పిటిషన్‌లను కొట్టేశారు. సింగిల్ జడ్జి తీర్పుపై పిటిషనర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ కే శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫు న్యాయవాది ఎస్. సంతోష్‌కుమార్ వాదిస్తూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇళ్లు ఇచ్చుకునేందుకు ఎలాంటి అర్హతలు పేర్కొనకుండా ఇందిరమ్మ కమిటీలను తెరపైకి తెచ్చారని, గ్రామసభను విస్మరించారని పేర్కొన్నారు. తుది తీర్పు వచ్చే వరకు ఆ జీవోపై స్టే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజినీకాంత్ రెడ్డి వాదిస్తూ పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేందుకే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. విచారణను జనవరి 24కు వాయిదా వేసింది.

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా

» మాజీ ప్రధాని మన్మోహన్ మృతి నేపథ్యంలోనే..

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి కొత్త రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం మరోసారి వాయిదా పడింది. రూ.4.13 కోట్లతో నిర్మించిన ఈ శాటిలైట్ టెర్మినల్‌ను శనివారం రైల్వే మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే.. గురువారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో కేంద్రం వారం రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. ఈ సమయంలో రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించడం సమంజసం కాదని భావించిన కేంద్ర ప్రభుత్వం.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని దక్షిణ మధ్య రైల్వేను ఆదేశించింది. దీంతో టెర్మినల్ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. అయితే రెండు నెలల్లో మొత్తంగా నాలుగు సార్లు టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడడం రైల్వే వర్గాలను తీవ్రంగా నిరాశపరిచింది.

కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించిన ఎస్సైకి వారం జైలు.. 2 వేల జరిమానా

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించిన పోలీసు ఎస్సైకి హైకోర్టు శుక్రవారం జైలు శిక్ష, జరిమానా విధించింది. ఏడేళ్ల కంటే తక్కువ జైలుశిక్ష పడే ఓ చిన్న కేసులో గొలుసు నర్సయ్య అనే వ్యక్తిని అరెస్టు చేయరాదని, సీఆర్పీసీ 41ఏ ప్రకారం నోటీసు ఇవ్వాలని స్పష్టంగా హైకోర్టు ఆదేశించినప్పటికీ వాటిని ధిక్కరించిన వరంగల్ జిల్లా తరిగొప్పుల ఎస్సై నరేశ్ యాదవ్‌కు ఈ శిక్షలు వేసింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణకు పాల్పడి నిందితుడిని అరెస్టు చేయడాన్ని తప్పు పట్టింది. వారం రోజుల పాటు జైలుశిక్ష అనుభవించాలని, రూ. 2 వేలు జరిమానా చెల్లించాలని జస్టిస్ కె. సురేందర్ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. బాధితుడికి ఎస్.ఐ. సొంత జేబు నుంచి రూ. 50 వేలు పరిహారం చెల్లించాలని స్పష్టంచేసింది. చట్టాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగి.. తన హోదాను దుర్వినియోగం చేయడం క్షమార్హం కాదని పేర్కొంది. అరెస్టు చేయకుండా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిసి కూడా తనకు ఉత్తర్వులు అందలేదని తప్పించుకునే యత్నం చేశారని తెలిపింది. ఇలాంటి తప్పుదోవ పట్టించే చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించింది.

ట్రాక్టర్ నాగలికర్రు గొంతులో దిగి..

» రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

» ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాకర్

» బైకర్‌ను 50 మీటర్లు ఈడ్చుకెళ్లిన డ్రైవర్

» సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్)లో ఘటన

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి, ట్రాక్టర్ నాగలి కర్రు గొంతులో దిగబడటంతో మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలంలో ఈ హృదయవిదారకమైన ఘటన జరిగింది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు కలగాని లెనిన్(28), తన భార్య, కుమారుడితో కలిసి గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి శుక్రవారం రాత్రి బైక్‌పై వస్తున్నాడు. రామన్నగూడెం నుంచి వస్తున్న ట్రాక్టర్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ట్రాక్టర్ వెనక వైపు ఉన్న నాగలికర్రు లెనిన్ గొంతులో దిగబడింది. ద్విచక్ర వాహనంతో పాటు భార్య, కుమారుడు కింద పడగా నాగలికర్రు గుచ్చుకున్న లెనిన్‌ను సుమారు 50మీటర్లు ట్రాక్టర్ ఈడ్చుకెళ్లింది. ఓ చోట సదరు ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని నిలిపి లెనిన్ మృతదేహాన్ని నాగలికర్రు నుంచి వేరుచేసి, పక్కనపడేసి ట్రాక్టర్‌తో పరారయ్యారని ఎస్సై తెలిపారు. భార్య, కుమారుడు రోదించడంతో గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికొచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదైంది.

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా బైక్‌ను లారీ ఢీకొని..

» తల్లీకుమారుడి మృతి తండ్రీకూతురికి గాయాలు

» భువనగిరి జిల్లా రాయగిరిలో ఘటన

భువనగిరి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా లారీ ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన తల్లీకుమారుడు మృతి చెందగా.. తండ్రీకూతురికి గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయగిరి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా చంపాపేటకు చెందిన బహిగల్ల జగన్, భార్య పావని (30), కుమారుడు కన్నయ్య (3), కుమార్తె సాత్విక (8) శుక్రవారం యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చారు. దైవ దర్శనం అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. భువనగిరి మండలం రాయగిరి సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో పావని అక్కడికక్కడే మృతి చెందింది. కన్నయ్య, జగన్, సాత్వికలను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా.. కన్నయ్య చికిత్స పొందుతూ మరణించాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు.

ఆదాయంలో కోత



గత ఏడాదితో పోలిస్తే 6% తగ్గుదల.. రాష్ట్ర రాబడులు 51 శాతమే!

» నవంబరు నాటికి రాబడి 1,41,178 కోట్లు

» మొత్తం ఖర్చు రూ.1,38,556 కోట్లు

» అంచనా వ్యయంలో ఇది 54 శాతం

» రాష్ట్ర ఆదాయ, వ్యయాలపై 'కాగ్' నివేదిక

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాబడులు తగ్గిపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 6 శాతం ఆదాయం తగ్గింది. ఈ సారి బడ్జెట్‌లో అన్నిరకాల రాబడులు రూ.2,74,057 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ, ఇప్పటి వరకు రూ.1,14,178 కోట్లు మాత్రమే సమకూరాయి. అంటే మొత్తం అంచనాలో ఇది 51.51 శాతమే! గత ఏడాది అంచనా వేసిన మొత్తంలో ఇదే కాలానికి 57.46 శాతం రాబడులు సమకూరాయి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సర్కారుకు ఇది కొంత ఇబ్బందికర పరిస్థితే. నవంబరు నాటికి అన్ని రకాల రాబడులు, అప్పుల ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,41,178 కోట్లు సమకూరినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) వెల్లడించింది. రాష్ట్ర ఆదాయ వ్యయాలకు సంబంధించి శుక్రవారం విడుదల చేసిన నవంబరు నివేదికలో ఈ విషయాలను వివరించింది. రెవెన్యూ రాబడుల కింద రూ.2,21,242 కోట్లను అంచనా వేయగా.. నవంబరు నాటికి రూ1,03,300 కోట్లు (51.32%) సమకూరాయి. మూలధన రాబడుల కింద రూ.52,815 కోట్లను అంచనా వేయగా.. రూ.37,878 కోట్లు(71.72%) వచ్చాయి. మూలధన రాబడుల్లో ప్రధానంగా మార్కెట్ రుణాల కిందే రూ.37,850 కోట్లు ఉన్నాయి. అంటే బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.49,255 కోట్ల రుణాల్లో 76.84 శాతం రుణాన్ని ప్రభుత్వం తీసేసుకుంది. ఇక రెవెన్యూ రాబడుల్లో పన్నుల కింద రూ.93,553 కోట్లు వచ్చాయి. ఇందులో జీఎస్టీ రూ.33,766 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.9,524 కోట్లు, అమ్మకం పన్ను రూ.21,081 కోట్లు, ఎక్సైజ్ సుంకాలు రూ.12,364 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.11,472 కోట్లు, ఇతర పన్నులు రూ.5,343 కోట్లు సమకూరాయి. పన్నేతర రాబడి రూ.5,217 కోట్లు, కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రూ.4,529 కోట్లు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నవంబరు నాటికి అన్ని వ్యయాల కింద రూ.1,38,556 కోట్లను ఖర్చు చేసింది. ఇది అంచనా వ్యయం రూ.2,54,431 కోట్లలో 54.46 శాతం కావడం గమనార్హం.

వచ్చింది సగమే

లక్ష్యం 18 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన ఆదాయం రూ.9,571.89 కోట్లే. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా నాలుగు నెలలే ఉన్నందున ఆలోపు రూ.5 వేల కోట్లకు మించి రాదని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంమీద 2024-25లో రూ.15 వేల కోట్లకు మించి రాబడి రాదనే భావనలో ఉన్నారు. ఆదాయం తగ్గడానికి పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఆంక్షలు కూడా కారణమేనని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఆ మెమోనే కారణమా..?

తెలంగాణలో పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖల్లో రెండు కొత్త చట్టాలు చేశారు. 2020లో ఈ చట్టాలు వచ్చిన సమయంలో లేఅవుట్ లేనివి, వ్యవసాయేతర భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపేశారు. ఇదే సమయంలో నాలా తీసుకోని భూముల రిజిస్ట్రేషన్లు చేయొద్దని, తప్పనిసరి అయితే సంబంధిత శాఖల అనుమతి తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కమిషనర్, ఐజీ పేరుతో మెమో ఇచ్చారు. దీంతో పంచాయతీ, పురపాలక శాఖల పరిధిలోని అనధికారిక లేఅవుట్ల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ మెమోను ఎప్పటి నుంచి అమలు చేయాలనేదానిపై స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. కొందరు కోర్టులకు వెళ్లి ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు పొందినా 2022లో సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో పూర్తిగా నిలిచి పోయాయి. రాష్ట్రంలో సుమారు 3 లక్షల ప్లాట్లు ఇలా రిజిస్ట్రేషన్ లేకుండా పోయాయి. వీటికి అనుమతి ఇస్తే రిజిస్ట్రేషన్ శాఖకు రూ.5-7 వేల కోట్ల రాబడి వచ్చే అవకాశం ఉంది. నాలా చేయని వారు ఫాంల్యాండ్ పేరుతో కొన్నిచోట్ల కోర్టు అనుమతితో విక్రయించినా, ఇప్పుడవి కూడా జరగడం లేదు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, పురపాలక శాఖల ఉన్నతాధికారులు సమావేశమై పరిష్కార మార్గాలు కనుగొనాలని నిర్ణయించారు.



ఆటంకంగా మారిన ఎల్ఆర్ఎస్

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద 2020లో వచ్చిన దర ఖాస్తులపై రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లక్షలాది మంది దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి చేకూర్చే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇటీవల మార్గదర్శకాలను విడుదల చేసింది. 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 వరకు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25.70 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వానికి తక్షణ ఆదాయం కింద సుమారు రూ.10 వేల కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. అయితే, ఎల్ఆర్ఎస్‌కు అవకాశమిచ్చి ఆర్నెల్లు గడిచినా ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో ఆశించిన పురోగతి లేదు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 99450 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించారు. వాటి ద్వారా రూ.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఎల్ఆర్ఎస్‌ను వేగిరం చేయడానికి అనధికారిక లేఅవుట్లను, ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని ఆదేశించడం, అనుమతి లేకుండా నిర్మించిన భవనాల రిజిస్ట్రేషన్లు ఆగిపోవడం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం తగ్గిపోయిందనేది ఆ శాఖ అధికారుల వాదన. గతంలో ఇచ్చిన జీవో 257 ద్వారా అనధికారిక లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు చేయొద్దని ప్రభుత్వం పేర్కొంది. దానిపై కొంత మంది కోర్టును ఆశ్రయించి, అనుమతులు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. సుప్రీంకోర్టు దానిపై స్టే ఇవ్వడంతో రిజిస్ట్రేషన్లు చేయలేని పరిస్థితి నెలకొంది. పురపాలక, పంచాయతీరాజ్ శాఖల నుంచి పాత చట్టాలు, జీవోల ఆధారంగా అనధికారిక లేఅవుట్ల విషయంలో అనుమతులు ఇవ్వకపోవడం రిజిస్ట్రేషన్లపై తీవ్ర ప్రభావాన్నే చూపుతుంది. ఈ నేపథ్యంలో పురపాలక, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో రిజిస్ట్రేషన్ శాఖ సమావేశమై చట్టపరిధిలో లేని అంశాల ప్రాతిపదికన నిలిచిపోతున్న రిజిస్ట్రేషన్లకు సానుకూల వాతావరణం కల్పించాలని కోరుతున్నారు. 50 శాతం కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన లేఅవుట్‌లో ఉండే మిగిలిన ప్లాట్ల యజమానులకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ ప్రకటనకు ముందు అంటే 2020 ఆగస్టు ముందు ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అనుమతులు అవసరం లేకుండా పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు నిబంధనలు సడలిస్తే రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. మూడు శాఖల మధ్య నెలకొన్న గందరగోళ పరిస్థితిని తొలగించి, ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచాలనే యోచనలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఉన్నారు. ఈ వారంలోనే మూడు శాఖల ఉన్నతాధికారులు సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏటా ఆదాయ వివరాలు

సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)	శాతం
2014-15	2746	---
2015-16	3786	37.87
2016-17	4249	12.23
2017-18	5177	21.84
2018-19	6612.74	27.73
2019-20	7061.03	6.78
2020-21	5260.20	-25.50
2021-22	12370.59	135.17
2022-23	14291.04	15.52
2023-24	14588.06	2.08



ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సమస్యల ముళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఎక్కడైనా గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ తండాలు, ఆవాసాల్లో ఆన్‌లైన్ అందుబాటులో లేకపోయినా కూడా యాప్ పనిచేస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అందుకోసం ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తుదారు వివరాలను తీసుకుని, ఫొటోలు సేకరించి ఇంటర్‌నెట్‌తో అనుసంధానమయ్యాక ఆన్‌లైన్ విధానంలో ఆ వివరాలను యాప్‌లో పొందుపరిస్తే సరిపోతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. ఆ వివరాలను నమోదుచేయడానికి యాప్ సహకరించడం లేదు. కొత్తగూడెం జిల్లాలోని ఖమ్మంతోగు, పగిడేరు అనే ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ కనెక్షన్ లేదు. అక్కడి దరఖాస్తుదారుల వివరాలను ఆఫ్‌లైన్‌లో తీసుకుని, ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో నమోదుచేయడానికి పది రోజుల సమయం పట్టింది. పది రోజుల్లో వంద దరఖాస్తులను మాత్రమే ఈ విధానంలో చేయగలిగామని, దీని ప్రకారం సర్వే మరింత ఆలస్యమయ్యే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ నెల 31నాటికి దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి, సంక్రాంతినాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ సాంకేతిక సమస్యల కారణంగా జనవరి 10వ తేదీ వరకు పరిశీలన ప్రక్రియే కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పలు జిల్లాల కలెక్టర్లు కూడా సమస్యను పరిగణనలోకి తీసుకుని జనవరి 5 వరకైనా పూర్తయ్యేలా చూడాలంటూ సిబ్బందికి సూచిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నిరుడు డిసెంబరులో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 80.50లక్షల దరఖాస్తులొచ్చాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 69,83,895 దరఖాస్తులు, జీహెచ్ఎంసీ పరిధిలో 10,70,659 దరఖాస్తులొచ్చాయి. ప్రస్తుతం వీటి పరిశీలన ప్రక్రియ కొనసాగుతుండగా, యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో సిబ్బంది సతమతమవుతున్నారు.

డిండి ఎత్తిపోతలకు 1800 కోట్లు!

» ఏదుల నుంచి 30 టీఎంసీల తరలింపుపై ప్రతిపాదనలు

» త్వరలో మంత్రివర్గంలో చర్చకు అవకాశం

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకం పనుల్లో కదలిక వచ్చింది. 3.61 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా రూ.4822.41 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటి దాకా రూ.2544.37 కోట్ల విలువైన పనులు జరిగాయి. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల వద్ద నిర్మించిన రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్లు తరలించనున్నారు. అయితే, ఏదుల నుంచి డిండికి 30 టీఎంసీల నీటిని తరలించేందుకుగాను రూ.1800 కోట్లతో చేపట్టే పనులకు సంబంధించిన సవరణ ప్రతిపాదనల ఫైలు మంత్రివర్గం ఆమోదానికి వచ్చింది. త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశముంది. మంత్రివర్గ ఆమోదం లభిస్తే డిండి ఎత్తిపోతల పథకం పనులు తిరిగి ఊపందుకోనున్నాయి. కాగా, ఏదుల నుంచి డిండికి నీటిని తరలించేందుకు.. ఏదుల నుంచి 16కిమీల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. అలాగే, ఉల్పర గ్రామానికి ఎగువన పోతిరెడ్డిపల్లి వద్ద ఒక చెక్‌డ్యామ్ నిర్మాణం జరగనుంది. ఆ తర్వాత ఉల్పరలో ఒక బ్యారేజీ, అక్కడి నుంచి డిండి ఎగువన కెనాల్ ద్వారా సింగరాజుపల్లి వద్ద ఒక రిజర్వాయర్‌కు, గోకవరం, గొట్టిముక్కల, ఇర్విన్, చింతపల్లి, కిష్టంపల్లి, శివన్నగూడెం వద్ద రిజర్వాయర్లకు నీటిని తరలిస్తారు. 30 టీఎంసీలతో చేపట్టనున్న ప్రాజెక్టులో 25.641 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా రిజర్వాయర్లు కడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు 16,389 ఎకరాల భూమి అవసరం ఉండగా ఇప్పటి దాకా 12,317 ఎకరాలను సేకరించారు.

పాలమూరు ప్యాకేజీ-3 సవరణ అంచనాలు కూడా

పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్ నుంచి ఏదుల దాకా 8కిమీల మేర ఓపెన్ కెనాల్ పనులు జరగాల్సి ఉంది. ఓ మాజీ మంత్రి వియ్యంకుడు గుత్తేదారుగా ఉండగా.. అంచనాలను సవరిస్తే తప్పా పనులు చేయబోనని పట్టుబట్టారు. పనులు పూర్తి చేసి లింకు కలిపితే కానీ పాలమూరు పథకంలోని ఇతర రిజర్వాయర్లకు నీళ్లు తరలించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో పాలమూరు పథకం ప్యాకేజీ-3లో ఏడు కిమీల మేర ఓపెన్ కెనాల్, పలు చోట్ల బ్లాస్టింగ్ కోసం వ్యయాన్ని రూ.400 కోట్ల నుంచి రూ.600 కోట్లకు సవరిస్తూ చేసిన అంచనాలను రాష్ట్ర స్థాయి స్థాయీ సంఘం (ఎస్ఎల్ఎస్‌సీ) ఇటీవల ఆమోదించింది. దీన్ని మంత్రివర్గం ఆమోదం కోసం పంపించనున్నారు. మంత్రివర్గం ఆమోదం లభించి పరిపాలనపరమైన అనుమతులు వస్తే ఈ పనులు ముందుకు కదిలే అవకాశాలు ఉన్నాయి. కాగా, పాలమూరు-రంగారెడ్డి పథకం డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఇటీవల వెనక్కి పంపించింది. 90 టీఎంసీలను ప్రాజెక్టుకు కేటాయిస్తూ డీపీఆర్ సమర్పించగా సీడబ్ల్యూసీ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వనప్పటికీ తాగునీటి అవసరాల కోసం పనులు చేసుకోవడానికి సుప్రీం కోర్టు అనుమతి ఉంది.

10 వేల కోట్ల అప్పు.. బాండ్ల రూపంలో!

రుణం పొందిన టీజీఐఐసీ .. 3-10 ఏళ్ల కాలవ్యవధితో బాండ్ల విడుదల

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఇటీవల సేకరించిన రూ.10 వేల కోట్ల అప్పు.. బాండ్ల రూపంలో సమకూరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఈ) ద్వారా సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసి టీజీఐఐసీ ఈ రుణాన్ని సేకరించింది. మూడేళ్ల నుంచి పదేళ్ల కాల వ్యవధితో ఈ బాండ్లను విడుదల చేసింది. ఈ రుణ సేకరణలో ఐసీఐసీఐ బ్యాంకు మధ్యవర్తి పాత్ర (అకౌంట్ బ్యాంక్)ను పోషించింది. ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిన 400 ఎకరాల భూమిని సెక్యూరిటీగా చూపించి బాండ్లను రిలీజ్ చేసినట్లు తెలిసింది. టీజీఐఐసీ ఈ రుణాన్ని బ్యాంకుల నుంచి సేకరించినట్లు ప్రభుత్వ వర్గాల్లో తొలుత చర్చ జరిగింది. కానీ, ఈ రుణం బ్యాంకుల నుంచి తీసుకున్నది కాదని, టీజీఐఐసీయే స్వయంగా బాండ్లను రిలీజ్ చేసి రుణాన్ని సేకరించిందని ఆ సంస్థ వర్గాలు స్పష్టతనిచ్చాయి. కాగా, రుణంగా తీసుకున్న ఈ మొత్తం సొమ్ము ప్రభుత్వ ఖజానాకు బదిలీ కానుంది. ఈ నిధులను ప్రభుత్వం రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12 వేల భృతి పథకాలను వినియోగించనుంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. నెలవారీగా సమకూరుతున్న రాబడులు, మార్కెట్ రుణాల రూపంలో వస్తున్న సొమ్ము.. ప్రభుత్వ పథకాలకు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు వడ్డీలు, అసలు చెల్లించడానికే సరిపోతోంది. దీంతో రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12 వేల భృతి వంటి పథకాలను అమలు చేయాలంటే నిధుల కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. మార్కెట్ నుంచి మరిన్ని రుణాలను సేకరిద్దామంటే కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. పైగా.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి రుణాలు తీసుకునే పరిస్థితి లేదు. ఏదైనా కార్పొరేషన్ ద్వారా అప్పులు తీసుకుందామన్నా.. గ్యారెంటీ అప్పులను కూడా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే పరిగణిస్తామని కేంద్రం గతంలోనే తేల్చి చెప్పింది. దీంతో ప్రస్తుతమున్న రుణాలను రీ-స్ట్రక్చర్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని, తద్వారా వడ్డీ భారం తగ్గి.. కొంతమేరకైనా నిధులు ఆదా అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వివరిస్తూ వచ్చింది. కానీ, కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టతనివ్వలేదు. మరోవైపు రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు పెద్దగా కనిపించడం లేదు.

నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ ద్వారా రుణ సేకరణ

'అకౌంట్ బ్యాంక్'గా ఐసీఐసీఐ

ఇన్వెస్టర్ల హక్కుల ట్రస్టీగా 'బీకాన్ ట్రస్టీషిప్'

భూములను విక్రయిస్తే విమర్శలొస్తాయనే..

రాష్ట్ర ఖజానాకు ఆదాయం రావాలంటే భూములను విక్రయించడమొక్కటే మార్గంగా కనిపిస్తోంది. కానీ, ప్రభుత్వమే నేరుగా భూములను విక్రయిస్తే విమర్శలు వచ్చే అవకాశాలున్నాయి. అందుకే టీజీఐఐసీకి భూమిని బదలాయించి, నిధులు సేకరించాలని యోచించింది. టీజీఐఐసీకి రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో భూములు, ఇతర ఆస్తులున్నాయి. వీటిని తనఖా పెట్టడం, లేదంటే ఆస్తుల పేరిట సెక్యూరిటీ బాండ్లను రిలీజ్ చేసి అప్పులను సేకరించడం వంటి



ప్రయత్నాలు చేయొచ్చని ఆలోచించింది. ఈ మేరకే జూన్ 26న 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 54ను జారీ చేసింది. అప్పటినుంచి టీజీఐఐసీ అప్పుల వేటలో పడింది. మొదట ఈ భూమిని తనఖా పెట్టి రుణం తీసుకోవాలని యోచించింది. అయితే బ్యాంకులు ప్రభుత్వం నుంచి గ్యారెంటీ ఇప్పించాలని కోరాయి. కానీ, ప్రభుత్వం గ్యారెంటీలు ఇస్తే.. మళ్లీ కేంద్రంతో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పేచీ ఎదురవుతుంది. ప్రభుత్వ బడ్జెట్ అప్పుల కింద ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే పరిగణిస్తామని కేంద్రం చెబితే మళ్లీ తలనొప్పిగా పరిణమిస్తుంది. అందుకే టీజీఐఐసీ 'సెక్యూరిటీ బాండ్ల' పద్ధతిని ఎంచుకుందని తెలిసింది. దీనికి ఐసీఐసీఐ బ్యాంకు 'అకౌంటు బ్యాంకు'గా వ్యవహరించగా, బాండ్ ఇన్వెస్టర్ల హక్కులకు 'బీకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్' ట్రస్టీగా నిలిచింది. ఇలా బాండ్లను రిలీజ్ చేసిన టీజీఐఐసీ, ఐసీఐసీఐ బ్యాంకు, బీకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం మేరకు టీజీఐఐసీకి రూ.10 వేల కోట్ల రుణం అందింది.

మంజీరలో మొసళ్ల భయానక సవ్వళ్లు!

» నదిలోంచి గట్లు, పొలాల్లో సంచారం.. ఓ లేగదూడపై దాడి

» ఐదేళ్ల క్రితమే నదిలో 600పైగా మొసళ్లు.. ఇప్పుడు రెట్టింపు?



సంగారెడ్డి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా కలబ్‌గూరులోని మంజీర నది పక్కనే ఓ మొసలి మాటువేసి నీళ్లు తాగుతున్న ఓ లేగదూడ గొంతు పట్టింది. ఊపిరాడక ఆ లేగదూడ చనిపోయింది. స్థానికులు తరిమికొట్టడంతో మొసలి నీళ్లలోకి వెళ్లిపోయింది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చండూరులోని పొలాలకు సమీపంలో ఈనెల 18న భారీ మొసలి ప్రత్యక్షమైంది. గట్టుపై మకరం సేదతీరుతుండగా రైతులు చూశారు. స్థానికులు కేకలు వేయడంతో నీళ్లలోకి జారుకుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో విస్తరించి ఉన్న మంజీరా నది పొడుగునా ఇలా మొసళ్లు గట్టుపైకి, పొలాల్లో కనిపించడం ఆ పరిసర గ్రామ ప్రజలు, మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తోంది. రెండు నెలల వ్యవధిలో సమీప గ్రామాల్లో నాలుగు భారీ మొసళ్లు ప్రత్యక్షం కావడం కలకలం సృష్టిస్తోంది. ఐదేళ్ల క్రితమే మంజీరా నదిలో 600పైగానే మొసళ్లు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు ఓ అంచనాకు వచ్చారు. ఇప్పుడు వీటి సంఖ్య మరింత పెరిగి ఉండొచ్చునని భావిస్తున్నారు మంజీరా నది మహారాష్ట్రలోని బాలాఘాట్ పర్వతాల్లో మొదలై కర్ణాటకలోని బీదర్ మీదుగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రవహించి నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తుంది. ఈ నదిపై సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో సింగూరు రిజర్వాయర్, సంగారెడ్డి పట్టణ శివారులో మంజీరా డ్యామ్ నిర్మించారు. సింగూరు రిజర్వాయర్ నుంచి మెదక్ జిల్లా ఘన్‌పూర్ ఆనకట్ట వరకు విస్తరించిన నదిలో మొసళ్లు ఉన్నాయి. దీనిని మంజీరా మొసళ్ల అభయారణ్యంగానూ పిలుస్తుంటారు. ఇటీవల సంగారెడ్డి సమీపంలోని కలబ్‌గూరు వద్ద చేపల పెంపక కేంద్రంలోని ఒక మడుగులో మొసలి చేరింది. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అల్మాయిపేటలో ఓ మొసలి ప్రత్యక్షమైంది. గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపల కోసం వలలు వేసి తిరిగి సాయంత్రం నది వద్దకు చేరుకోగా అక్కడ బండరాయిపై భారీ మొసలి కనిపించడంతో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

మొసళ్లు లేక బోసిపోయిన సంరక్షణ కేంద్రం

మంజీరా నది సమీప ప్రాంతాల్లో మొసళ్ల సంచారం భయాందోళనకు గురిచేస్తుంటే కలబ్‌గూరు వద్ద మంజీరా డ్యామ్ ఆవరణలో ప్రత్యేకంగా మొసళ్ల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన కొలనులో మాత్రం ఒక్క మకరం కూడా లేదు. ఇక్కడ 10 మొసళ్లు ఉండేవి. మొసళ్లకు ఆహారంగా మాంసం పెట్టేవారు. నిధుల కొరత కారణంగా ఏడాది క్రితమే ఆహారం పెట్టడం మానేశారు. కొన్నాళ్లకే ఆ మొసళ్లను అక్కడి నుంచి తరలించి మంజీరా నదిలో వదిలేశారు.

శుభాకాంక్షల పేరుతో కొత్త మోసం

- న్యూ ఇయర్ విషెస్, డిస్కౌంట్ల పేరిట లింకులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ నిపుణులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాదేది మోసానికి అనర్హం అంటూ వేడుకలను సైతం సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆప్తులు, స్నేహితులకు పంపించే శుభాకాంక్షలు, దుకాణాలు ప్రకటించే ఆఫర్లను మోసాలకు మార్గాలుగా మార్చుకుంటున్నారు. న్యూ ఇయర్ విషెస్, డిస్కౌంట్ కూపన్లు, భారీ ఆఫర్లు, ఈవెంట్ల పాస్‌ల పేరుతో బోగస్ లింకులను పంపి మోసానికి పాల్పడుతున్నారు. ఒకవేళ వాటిని తెరిస్తే ఫోన్ హ్యాక్ అవుతుంది. బ్యాంకు అకౌంటు ఖాళీ అవుతుంది. ఆ లింక్‌లను ఇతరులకు ఫార్వార్డ్ చేస్తే అందుకున్న వారు కూడా నష్టపోయే ప్రమాదం ఉంది. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా వివిధ సంస్థల పేరుతో ఈవెంట్ పాసులు కూడా పంపుతున్నారు. వివరాలు నమోదు చేసుకుంటే తక్కువ ధరకే టికెట్లు వస్తాయని ఊరిస్తున్నారు. లింక్‌లు తెరిచిన వెంటనే ఇందులో ఉండే మాల్‌వేర్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను తమ నియంత్రణలో తీసుకుంటున్నారు. బ్యాంకు ఖాతాలోని డబ్బు కాజేయడంతోపాటు బ్లాక్ మెయిలింగ్‌లకు సైతం పాల్పడే ప్రమాదం ఉందని పోలీసులు, సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల తెలియని, కొత్త నెంబరు నుంచి వచ్చే లింకులను తెరవకూడదని సైబర్ నిపుణుడు ప్రసాద్ పాటిబండ్ల సూచించారు.

ఖమ్మంలో సీఎం కప్ వాలీబాల్ పోటీలు షురూ

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. పోటీలకు రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి 140 మంది బాలురు, 140 మంది బాలికలు హాజరయ్యారు. మూడు రోజులు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీవైఎస్‌వై సునీల్‌రెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. వచ్చే ఒలింపిక్స్ పోటీల్లో తెలంగాణ నుంచి పతకాలు సాధించే సత్తా గల క్రీడాకారులను వెలికి తీయడమే ఈ క్రీడల ముఖ్యోద్దేశమని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు పోటీల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

తొలిరోజు విజేతలు...

బాలుర విభాగంలో: ఖమ్మం జట్టు మెదక్ జట్టుపై, మహబూబ్‌నగర్ జట్టు హైదరాబాద్ జట్టుపై, వరంగల్ జట్టు నల్గొండ జట్టుపై, రంగారెడ్డి జట్టు కరీంనగర్ జట్టుపై విజయం సాధించాయి.

బాలికల విభాగంలో: నల్గొండ జట్టు రంగారెడ్డి జట్టుపై, వరంగల్ జట్టు మెదక్ జట్టుపై, నిజామాబాద్ జట్టు ఖమ్మం జట్టుపై, మహబూబ్‌నగర్ జట్టు కరీంనగర్ జట్టుపై విజయం సాధించాయి.

అప్పులబాధతో యువ రైతు ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో మరో రైతు మృతి

కౌడిపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడగా, విద్యుదాఘాతంతో మరో రైతు మృతి చెందాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి గ్రామానికి చెందిన సంద్రుగు భాస్కర్(29) తనకున్న ఎకరన్నర పొలంలో వేసిన పంటలకు దిగుబడి రాలేదు. గ్రామంలో సంవత్సరం క్రితం టెంట్‌హౌస్ నిర్వహణ చేపట్టగా తీవ్రనష్టాలు వచ్చాయి. అయితే అటు వ్యవసాయానికి, ఇటు టెంట్‌హౌస్ కోసం చేసిన రూ.5 లక్షల అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక భార్య సరితతో తరచూ తన మనోవేదన చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి భార్య, పిల్లలను అదే గ్రామంలోని అత్తగారి ఇంటికి పంపించి ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. మరోవైపు నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామానికి చెందిన బద్దెల గోవిందు(48) అనే రైతు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాడు. ఎప్పటిలానే శుక్రవారం గోవిందు తన పొలానికి వెళ్లాడు. అప్పుడు సమీపంలో ఉన్న మహిళా రైతు నీల.. పొలంలో విద్యుత్ తీగ తెగి ఉండడాన్ని గమనించి గోవిందుకు తెలియజేసింది. ఆ తీగకు మరమ్మతులు చేస్తుండగా గోవిందు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దగ్గర్లో ఉన్న కొంత మంది రైతులు గోవిందును దేవరకొంత ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. గోవిందుకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న
పీవీ సింధు దంపతులు



తిరుమల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): నూతన దంపతులు, స్టార్ షట్లర్ పీవీ సింధు, వెంకట దత్తసాయి శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఇటీవల ఏడడుగులు వేసి ఒక్కటైన ఈ జంట గురువారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్నారు. శుక్రవారం వేకువజాము జరిగిన అభిషేక సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం పీవీ సింధు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఏటా శ్రీవారి దర్శనానికి రావడం తనకు అలవాటన్నారు. పెళ్లి జరిగిన నేపథ్యంలో తన భర్తతో కలిసి శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందానన్నారు.

బీసీ బిల్లు కోసం అఖిల పక్షాన్ని ఢిల్లీ పంపాలి

- జనవరి 6న అమరావతిలో బీసీ సభ: ఆర్ కృష్ణయ్య

బర్కత్‌పుర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో బీసీ బిల్లు కోసం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడు అఖిల పక్ష బృందాన్ని ఢిల్లీకి పంపి కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏపీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. క్రీమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. జనవరి 6న అమరావతిలో వేలాదిమందితో బీసీ సభ నిర్వహించి ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ సత్తా

- జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం



గుంటూరు (విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్టు అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. ఈ మేరకు మెయిన్ క్యాంపస్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మోహన్ మాట్లాడుతూ తమ విద్యార్థి రిషబ్ ఓత్సవాల్ ఆర్ మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నాడని తెలిపారు. అదే విధంగా మంజులూరి మోహన్‌కృష్ణ 33, కేసన సాయిచరణ్ 34, కాకుమాను కృష్ణ చైతన్య 40వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు తమ విద్యార్థులు 50 సార్లు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను 31 వరకు
అరెస్టు చేయొద్దు



ఫార్ములా ఈ-రేసు కేసులో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో మరోసారి ఊరట లభించింది. ఆయనను ఈ నెల 31 వరకు అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఏసీబీని ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను ఈ నెల 31 వరకు పొడిగించింది. మరోవైపు కేటీఆర్‌ను అరెస్ట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని, ఆయనను అరెస్ట్ చేయకుండా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తేయాలంటూ హైకోర్టుకు ఏసీబీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మధ్యంతర అప్లికేషన్‌ను దాఖలు చేసింది. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించి విదేశీ సంస్థకు ప్రభుత్వ సొమ్మును చెల్లించారన్న సర్కారు ఫిర్యాదు మేరకు ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ ఎస్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసును రెగ్యులర్ రోస్టర్ కలిగిన ధర్మాసనం ఎదుట లిస్ట్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ కేసు శుక్రవారం రెగ్యులర్ రోస్టర్ కలిగిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఏసీబీ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాల మేరకు కౌంటర్ దాఖలు చేశామని, వెకేట్ స్టే పిటిషన్‌పై వాదనలు వినిపిస్తామని అన్నారు. మరోవైపు కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. ఏసీబీ కౌంటర్‌కు రిప్లై దాఖలు చేశామని తెలిపారు. కాగా, ఫార్ములా కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తరఫున అదనపు ఏజీ తేరా రజినీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. 'మీరు ప్రత్యేకంగా కౌంటర్ వేస్తారా?' అని ధర్మాసనం ఏఏజీని ప్రశ్నించగా.. తాము ఏసీబీ దాఖలు చేసిన కౌంటర్‌ను అనుసరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు పూర్తయిన దరిమిలా ఇక ప్రధాన అంశంపై ఈ నెల 31న వాదనలు వింటామని ధర్మాసనం తెలిపింది.

నేరం లేదు.. ఉన్నదంతా రాజకీయ కుట్రే

- నాపై కేసు పెట్టాలనే దురుద్దేశంతోనే వాయిదాల ఎగవేత
- ఏసీబీ కౌంటర్‌కు రిప్లై దాఖలు చేసిన కేటీఆర్

ఫార్ములా ఈ-రేస్ అంశంలో ఎలాంటి నేరం జరగలేదని, ఇదంతా రాజకీయ కుట్ర మాత్రమేనని మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టుకు తెలిపారు. అనుమతుల వ్యవహారాన్ని చూసుకోవాల్సింది అధికారులే తప్ప.. నాటి మంత్రిగా తాను కాదని చెప్పారు. హెచ్ఎండీఏ బాధ్యతలు చూస్తున్న దానకిశోర్.. హెచ్ఎండీఏను ప్రమోటర్‌గా చూపుతూ సిఫారసు చేసిన ఫైలుపైనే తాను సంతకం చేశానని వెల్లడించారు. దర్యాప్తును అడ్డుకోవడానికే తాను క్వాష్ పిటిషన్ దాఖలు చేశానన్న ఏసీబీ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నేరం జరిగినట్లు ఎఫ్ఐఆర్ నిరూపించడం లేదు కాబట్టే.. దానిని కొట్టేయాలని హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఏసీబీ కౌంటర్‌కు హైకోర్టులో కేటీఆర్ రిప్లై దాఖలు చేశారు. ప్రైవేటు స్పాన్సరర్‌కు సంబంధించిన భారాన్ని ప్రభుత్వం నెత్తిన రుద్దారన్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. స్పాన్సరర్ చేతులెత్తేయడంతో ఎఫ్ఈవో సంస్థ సీజన్ 10కు సంబంధించిన ఈవెంట్స్ క్యాలెండర్‌లో హైదరాబాద్ పేరును చేర్చలేదని తెలిపారు. హైదరాబాద్ పేరు ప్రఖ్యాతుల్ని కాపాడటానికి ఎఫ్ఈవో సంస్థతో చర్చలు జరిపి స్పాన్సరర్ మొత్తాన్ని మూడు వాయిదాల్లో చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. "రెగ్యులేటరీ అనుమతులు లేకుండానే విదేశీ మారకంలో చెల్లింపులు చేశారని ఆరోపిస్తున్నారు. కానీ, ఎలాంటి అనుమతులు పొందాలో స్పష్టంగా చెప్పడం లేదు. ప్రొసీజర్ చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉండదు. అదనపు ట్యాక్స్ భారం హెచ్ఎండీఏపై పడిందనే ఆరోపణ సైతం అర్థంలేనిది. ఎందుకుంటే అదనపు ట్యాక్స్‌లు ప్రమోటరే భరించాలని రెండు ఒప్పందాల్లోనూ ఉంది. అలాగే రూ.10 కోట్లకు మించిన ఖర్చులు చేస్తే హెచ్ఎండీఏ పరిపాలనాపరమైన అనుమతులు పొందాలని చెబుతున్నారే తప్ప.. అలాంటి ప్రొసీజర్ ఒకటి ఉందని, దానికి సంబంధించిన నిబంధనలు, చట్టం ఏంటో చెప్పడంలేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఒప్పందం కేవలం ఫార్మాలిటీయే..

ఒప్పందానికి ముందే చెల్లింపులు చేశారనడం సరికాదని, ఒప్పందం అనేది కేవలం ఫార్మాలిటీ మాత్రమేనని కేటీఆర్ తెలిపారు. ఫార్ములా రేస్ సీజన్ 10ను హైదరాబాద్ చేజార్చుకోరాదనే ప్రధాన ఉద్దేశంతోనే చెల్లింపులు చేశామన్నారు. "ఎప్పుడెప్పుడు చెల్లింపులు చేయాలన్న దానికోసం మాత్రమే నామమాత్రంగా ఒప్పందం జరిగింది. ముందస్తు చెల్లింపులు చేయడం వల్లే సీజన్ 10లో హైదరాబాద్ పేరును చేర్చారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా చెల్లింపులు చేశారంటున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ నుంచి నోటీసు రాలేదు. వాస్తవానికి ఎన్నికల కోడ్ 2023 అక్టోబరు 9న అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత మంత్రిగా నా పాత్ర నామమాత్రమే. ప్రభుత్వం ఆరోపిస్తున్న దేనికీ నా బాధ్యత ఉండదు. వచ్చే మూడేళ్లకు 600 కోట్ల కమిట్‌మెంట్ ఇచ్చారన్నది వాస్తవం కాదు. అంకెలను ఎక్కువగా చేసి చూపుతున్నారు. పైగా హెచ్ఎండీఏ చేసే చెల్లింపులకు సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ వర్తించవు. ఫైల్‌ను రూపొందించిన దానకిశోర్ చెబుతున్న ప్రకారం ముఖ్యమంత్రికి ఫైల్ పంపించారు. విధానపరమైన అంశాలేవైనా ఉంటే సంబంధిత అధికారులే చూసుకోవాలి. ఒప్పందం చేసుకోవడంలో విధానపరమైన లోపాలున్నంత మాత్రాన ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించాలనే ఉద్దేశం, ఇతరులకు లబ్ధి కలిగించాలనే ఉద్దేశం ఉన్నట్లు కాదు" అని కేటీఆర్ వివరించారు.

చెల్లింపులు చేయనందున భారీగా నష్టం..

తదుపరి 50% చెల్లింపులు ఉద్దేశపూర్వకంగా చేయకపోవడం వల్ల రూ.55 కోట్ల నష్టం జరగడమే కాకుండా ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోయిందని కేటీఆర్ తెలిపారు. 2023 ఫిబ్రవరిలో 9వ సీజన్ ఫార్ములా రేస్ నిర్వహించడం వల్ల రాష్ట్రానికి 83 మిలియన్ డాలర్ల ఆదాయం వచ్చినట్లు నీల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్‌లో తేలిందన్నారు. "తర్వాత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా 50% మొత్తం ఎగ్గొట్టడం వల్లే అసలు నష్టం జరిగింది. తర్వాత ఏర్పడ్డ ప్రభుత్వం ఒప్పందాలకు కట్టుబడి ఉండాలి. నాపై తప్పుడు కేసు పెట్టాలనే ఏకైక ఉద్దేశంతో ఒప్పందాన్ని గౌరవించకుండా డీఫాల్ట్ చేసింది. నా ప్రతిష్ఠను దెబ్బ తీయడానికి, వేధించడానికే ఎలాంటి నేరం లేకున్నా దర్యాప్తు కొనసాగిస్తామంటున్నారు.ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంలో 14 నెలల ఆలస్యమవడమే కాక ప్రాథమిక దర్యాప్తు జరగలేదు. చట్టాన్ని అపహాస్యం చేస్తూ తప్పుడు ఆరోపణలతో పెట్టిన కేసును కొట్టేయండి" అని కేటీఆర్ పేర్కొన్నారు

బిగుస్తున్న ఉచ్చు!

ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ మీద 409 సెక్షన్

- నోటీసులు ఇవ్వకుండా అరెస్టుకు అవకాశం
- క్వాష్ పిటిషన్ తేలగానే ఏసీబీ కదిలే అవకాశం
- కేటీఆర్ టీవీల ముందే తప్పు ఒప్పుకున్నారు
- ప్రభుత్వ సొమ్మును దురుద్దేశంతో బదిలీ చేశారు
- కోర్టు ముందు కౌంటర్ అఫిడవిట్‌లో ఏసీబీ



హైదరాబాద్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారంలో కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. తమకు అందిన ఫిర్యాదు ఆధారంగా కేటీఆర్‌ను ఏ1గా, అర్వింద కుమార్ ఏ2గా, బీఎల్ఎన్ రెడ్డి ఏ3గా కేసు నమోదు చేసిన ఏసీబీ, ఫిర్యాదులోని ప్రతి అంశానికి పక్కా ఆధారాలు సేకరించింది. తాము సేకరించిన ఆధారాలు, మంత్రి హోదాలో కేటీఆర్ చేసిన తప్పులు, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, ఆర్థిక శాఖను బేఖాతర్ చేసిన వైనాన్ని పూసగుచ్చినట్లు కౌంటర్ అఫిడవిట్ ద్వారా ఏసీబీ హైకోర్టు ముందుంచింది. ఫార్ములా ఈ రేసుకు సంబంధించి అంతా తన కనుసన్నల్లోనే జరిగిందని, పూర్తి బాధ్యత తనదేనని టీవీల్లో కేటీఆర్ చెప్పిన అంశాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఏ విధంగా నేరస్థుడు అవుతారో వివరాలను ఏసీబీ అధికారులు హైకోర్టు ముందు పెట్టారు. ఫార్ములా ఈ రేసు కేసులో ఒకటి రెండు కాదని, అనేక ఉల్లంఘనలు జరిగాయని ఏసీబీ పేర్కొంది. ఒప్పందం చేసుకోవడానికి ముందే నిధులను విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించారని ప్రస్తావించింది. 2022లో తొలిసారి చేసుకున్న ఒప్పందంలోనూ గవర్నర్ అనుమతి తీసుకోలేదని, 2023లో చేసుకున్న ఒప్పందంలో ఒక అడుగు ముందుకు వేసి విదేశీ కరెన్సీ రూపంలో నిధుల చెల్లింపు చేయడం పూర్తిగా నేరపూరిత చర్యేనని ఏసీబీ స్పష్టం చేసింది. మొత్తం రూ.54.9 కోట్లను కేటీఆర్ నిర్దేశం ప్రకారమే ఖర్చు చేశారని ధ్రువీకరించింది. ఇందులో ప్రాథమికంగా ఆధారాలున్నాయి కాబట్టి కేసు నమోదు చేసినట్లు ఏసీబీ న్యాయస్థానానికి నివేదించింది. సచివాలయ బిజినెస్ రూల్స్ 9,11 ప్రకారం నిర్దేశిత మొత్తం కన్నా ఎక్కువగా ఏ శాఖ అయినా ఖర్చు చేయాల్సి ఉంటే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని గుర్తు చేసింది. మంత్రివర్గం అనుమతి తర్వాతే ఆర్థిక శాఖ నిధులను విడుదల చేయాలని స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కోడ్‌లోని ఆర్టికల్ 51(బి), ఆర్టికల్ 299 ప్రకారం విదేశీ కంపెనీతో ఒప్పందం చేసుకోవాలి అంటే గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిందేనని ఏసీబీ చెప్పింది. వీటిని ఉల్లంఘించి ఆర్థిక ఒప్పందం చేసుకోవడమంటే విచారించ తగ్గ నేరమేనని వ్యాఖ్యానించింది. కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోకుండా డబ్బు విడుదల చేయడం నేరమేనని ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఆస్తిపై ఆధిపత్యం కలిగి ఉన్న ప్రజాప్రతినిధిగా నేరపూరిత విశ్వాస ఉల్లంఘనకు పాల్పడితే సెక్షన్ 409 వర్తిస్తుందని తెలిపింది. ఈ సెక్షన్ కింద నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేసేందుకు ఏసీబీకి అధికారం ఉంది. ఇదే విషయాన్ని పలువురు న్యాయ నిపుణులు ధ్రువీకరిస్తున్నారు. డిసెంబరు 31లోగా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేస్తే సెక్షన్ 409 కింద ఏసీబీ నోటీసులు ఇవ్వకుండానే కేటీఆర్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటున్నారు. మంత్రివర్గం ఆమోదం లేకుండా, రిజర్వు బ్యాంకు అనుమతి తీసుకోకుండా వ్యవహరించడం సెక్షన్ 13(1)(ఏ) కింద నేరమని ఏసీబీ తన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ విధంగా తాము నమోదు చేసిన ప్రతి సెక్షన్‌కు సంబంధించి కేటీఆర్ తదితరులు ఏ విధంగా కేసు విచారణకు అర్హులో వివరిస్తూ సుదీర్ఘ కౌంటర్‌ను ఏసీబీ హైకోర్టు ముందు ఉంచింది.



2025 ఏడాదికి సెలవులు ఖరారు

- 27 సాధారణ, 23 ఐచ్ఛిక సెలవులు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2025 ఏడాదికి గాను ప్రభుత్వం సెలవులను ఖరారు చేసింది. 27 సాధారణ, 23 ఐచ్ఛిక సెలవులు కలిపి మొత్తం 50 సెలవులు ఉన్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

2025 సాధారణ సెలవులు

సెలవు	తేదీ
నూతన సంవత్సరం	1-జనవరి
భోగి	13-జనవరి
సంక్రాంతి/పొంగల్	14-జనవరి
గణతంత్ర దినోత్సవం	26-జనవరి
మహా శివరాత్రి	26-ఫిబ్రవరి
హోళీ	14-మార్చి
ఉగాది	30-మార్చి
రంజాన్	31-మార్చి
రంజాన్ మర్నాడు	1-ఏప్రిల్
జగ్జీవన్ రాం జయంతి	5-ఏప్రిల్
శ్రీరామ నవమి	6-ఏప్రిల్
అంబేద్కర్ జయంతి	14-ఏప్రిల్
గుడ్ ఫ్రైడే	18-ఏప్రిల్
బక్రీద్	7-జూన్
మొహర్రం	6-జూలై
బోనాలు	21-జూలై
స్వాతంత్ర దినోత్సవం	15-ఆగస్టు
కృష్ణాష్టమి	16-ఆగస్టు
వినాయకచవితి	27-ఆగస్టు
మిలాద్-ఉన్-నబీ	5-సెప్టెంబరు
బతుకమ్మ	21-సెప్టెంబరు
మహాత్మాగాంధీ జయంతి/విజయదశమి	2-అక్టోబరు
విజయదశమి మర్నాడు	3-అక్టోబరు
దీపావళి	20-అక్టోబరు
కార్తీక పౌర్ణమి	5-నవంబరు
క్రిస్మస్	25-డిసెంబరు
బాక్సింగ్ డే	26-డిసెంబరు

సరిహద్దుల్లో 'కిక్కు' తగ్గింది!

(మొదటిపేజీ తరువాయి)

కిందటి పరిస్థితి ఇది! కానీ, ఇప్పుడు సీన్ రివర్స్ అయింది! సరిహద్దుల్లోని మద్యం షాపులు ఇప్పుడు మందుబాబుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఆయా దుకాణాల్లో విక్రయాలు పెంచుకునేందుకు ఎక్సైజ్‌శాఖ చెమటోడ్చాల్సి వస్తోంది. నాగర్‌కర్నూలు, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని సరిహద్దు మండలాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. ఈ ఆరు జిల్లాల్లో ఈ నెల (డిసెంబరు) 23 రోజుల్లోనే రూ.40 కోట్ల ఆదాయం తగ్గిందని ఆబ్కారీ శాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ బ్రాండ్లన్నీ ఏపీలో..

గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన మద్యం కోసం మందుబాబులు నానా ఇబ్బందులు పడ్డారు. అక్కడ బ్రాండెడ్ మద్యం అందుబాటులో లేకపోవడంతో తెలంగాణ వైపు వచ్చేవారు. దీంతో గద్వాల, నాగర్‌కర్నూలు, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల సరిహద్దు మండలాల్లోని మద్యం దుకాణాల్లో విక్రయాలు ఎక్కువగా జరిగేవి. రాష్ట్రంలో ఎక్కువ మద్యం విక్రయాలు జీహెచ్ఎంసీ పరిధిలోని మద్యం దుకాణాల్లో జరిగేవి. కానీ, సరిహద్దు జిల్లాల్లోని దుకాణాల్లో మాత్రం గతంలో హైదరాబాద్‌లోని దుకాణాలకు మించి అమ్మకాలు జరిగేవి. దీంతో అక్కడ స్టాక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించేది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ లక్ష్యాలను అందుకోవడం వెనక సరిహద్దు జిల్లాలు కీలక పాత్ర పోషించాయి. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడ్డ ఎన్డీయే ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. ఇది అక్టోబరు-15 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పుడు అక్కడ తెలంగాణలో లభించే అన్ని బ్రాండ్ల మందు అందుబాటులో ఉంది. నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు బ్రాండెడ్ లిక్కర్ క్వార్టర్ రూ.99కే విక్రయిస్తున్నారు. దీంతో ఏపీ నుంచి మద్యం కోసం తెలంగాణ సరిహద్దుల్లోకి వచ్చే మందుబాబుల సంఖ్య ఒక్కసారిగా తగ్గిపోయింది. అక్టోబరు నుంచి తెలంగాణ సరిహద్దు మండలాలపై ఈ ప్రభావం కనిపిస్తోంది. నవంబరులో విక్రయాలు తగ్గగా.. డిసెంబరులో తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

మధిర.. రెండో స్థానం నుంచి చివరికి..

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన ఖమ్మం జిల్లా మధిరలో ఈ ఏడాది డిసెంబరులో మద్యం అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో 20 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 59 శాతం మద్యం విక్రయాలు తగ్గాయి. గత ఏడాది డిసెంబరులో రూ.20.49కోట్ల మద్యం అమ్మకాలతో మధిర ఎక్సైజ్ స్టేషన్ జిల్లాలోనే రెండో స్థానంలో నిల్చింది. అలాంటిది ఈ ఏడాది డిసెంబరులో (25వ తేదీ వరకు) రూ.8.45కోట్ల వ్యాపారమే జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఏపీలో మద్యం నాణ్యత లేకపోవడం, అధిక ధరలు ఉండడంతో ఏపీ ప్రజలు ఎక్కువగా తెలంగాణ మద్యం తాగేవారు. తాజాగా ఏపీలో ప్రభుత్వం మారడంతోపాటు మద్యం విధానం కూడా మారింది. అక్కడా నాణ్యమైన మద్యం దొరుకుతోంది. దీంతో ఏపీ నుంచి మందుబాబుల రాక బాగా తగ్గిపోయింది. రెండేళ్ల కిందట మద్యం విక్రయాల్లో ఖమ్మం జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచిన మధిర.. ఇప్పుడు చివరి స్థానానికి పడిపోయింది. గతంలో మద్యం అమ్మకాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిన ఖమ్మం జిల్లా ఈ ఏడాది 28వ స్థానానికి పడిపోయినట్లు సమాచారం.

ఖజానాకు రూ.300 కోట్లు గండి

ఈ నెల 23 వరకు ఆరు సరిహద్దు జిల్లాల పరిధిలో రూ.40 కోట్ల మేర ఆదాయం తగ్గింది. దసరా, నూతన సంవత్సరం వేడుకల సమయంలోనే ఆబ్కారీ శాఖకు ఎక్కువ ఆదాయం వస్తుంది. ఈసారి సరిహద్దుల్లో కొత్త సంవత్సర ఆదాయం కూడా గణనీయంగా తగ్గనుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి సరిహద్దు జిల్లాల్లో రూ.300 కోట్ల ఆదాయం తగ్గే అవకాశాలున్నాయని అంచనా. రాష్ట్ర ఖజానాకు ఎక్సైజ్ శాఖ వెన్నెముక లాంటిది. ఈ శాఖ నుంచి ఏటా ఆశించినదానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. 2024-25లో మద్యం విక్రయాల ద్వారా రూ.25617 కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు వస్తున్న ఆదాయం ప్రకారం.. మార్చితో ముగియనున్న ఆర్థిక సంవత్సరం నాటికి అంచనా వేస్తే లక్ష్యానికి రూ.2 వేల కోట్ల దూరంగా ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మద్యం ధరలు 5-10 శాతం పెంచాలని ధరల నిర్ణయ కమిటీ సూచించినా ప్రభుత్వం పెంచలేదు. ధరలు పెంచకుండా ఈ లక్ష్యాన్ని సాధించడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో మద్యం విక్రయాలు తగ్గడం ప్రభుత్వాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు సమాచారం.

అభయారణ్యం చుట్టూ కట్టుదిట్టం!

- ఏటూరు నాగారం అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యం
- సున్నిత పర్యావరణ ప్రాంతంగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను జారీ చేసిన కేంద్రం
- పది కిలోమీటర్ల వరకూ నిషేధిత ప్రాంతం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి)

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా ఏటూరునాగారం అభయారణ్యాన్ని సున్నిత పర్యావరణ ప్రాంతంగా(ఎకో సెన్సిటివ్ జోన్‌గా) మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ములుగు, భూపాలపల్లి జిల్లాల పరిధిలోని మొత్తం 106 గ్రామాలను ఎకో సెన్సిటివ్ జోన్‌లో చేర్చాలని భావిస్తోంది. తద్వారా అభయారణ్యం చుట్టూ 10 కిలోమీటర్ల మేర నిషేధిత ప్రాంతంగా ప్రకటించనున్నారు. ఇది అమలులోకి వస్తే ఈ ప్రాంతంలో మైనింగ్, రోడ్డు నిర్మాణ పనులు, పరిశ్రమల ఏర్పాటుకు బ్రేక్ పడనుంది. అంతే కాకుండా.. ఇసుక తవ్వకాలు మొదలుకొని వాహనాల కదలికల వరకు అన్నింటిపై ఆంక్షలను అమల్లోకి రానున్నాయి. కేంద్రం జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం జోనల్ మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేసి.. పంపిస్తే ఎకో సెన్సిటివ్ జోన్‌గా తుది ప్రకటన వెలువడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

జోనల్ మాస్టర్ ప్లానే కీలకం

అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణ, వృద్ధి కోసం నిషేధిత ప్రాంతంలో ఏయే చర్యలు తీసుకోవాలనే విషయాన్ని ఎప్పటికప్పుడు చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు జోనల్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో కేంద్రం స్పష్టంగా పేర్కొంది. ఇందుకోసం వివిధ శాఖల అధికారులతో ములుగు కలెక్టర్ అధ్యక్షతన మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి ఆరేళ్ల క్రితమే కేంద్రం ఒక సారి నోటిఫికేషన్ జారీ చేయగా.. మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో ఆ కాలవ్యవధి కాస్త ముగిసిపోయింది. దీంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం మరో సారి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించింది. నిబంధనల ప్రకారం కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేశాక.. 545 రోజుల్లోగా అభ్యంతరాలను స్వీకరించి తుది నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం.. దాని కొనసాగింపు ప్రతిపాదనలను కచ్చితంగా పంపాల్సి ఉంటుంది. అయితే, ఇది అమలులోకి వస్తే గోదావరి తీరం వెంబడి ఉన్న ఇసుక క్వారీలు, సమ్మక్క-సారలమ్మ ఆలయం కూడా ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోకే రానున్నాయి. ఈ కారణంగానే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందన్న ఆరోపణలున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.